
ఆంధ్రజ్యోతి
స్వాతంత్ర్య సంచిక



భరణీవారి

# రత్నమాల.

భానుమతి.. సి. యస్ ఆర్
డాక్టర్ సుబ్బారావు ఆరణి
నాగేశ్వరరావు హేమలత...

*Studio..* NEWTONE

*Direction* RAMAKRISHNA *Story Dialogues & Songs* SAMUDRALA *Music..* SUBBARAMAN
*Dances* V RAGHAVIAH

# మీ పిల్లలు బలారోగ్యంగా పెరిగేటట్లు చూడండి

హిందూ దేశంలో ముఖ్యంగా దక్షిణ ప్రాంతాలలో ఆహార వస్తువులందు సత్తువతనం లేదనీ అట్టి ఆహారాలపై పెరిగే శిశువులు ఆరోగ్యవంతులుగనూ దృఢకాయులుగనూ ఉండరనీ శాస్త్రకారులు వక్కాణించుచున్నారు.



మెక్లెక్ వారి శిశు ఆహారములలో ముందుగ జీర్ణింపించిన శాకాహారపు ప్రొటీన్లసారము. గ్లూకోసు ఉన్నాయి. మెక్లెక్ సిరప్ కాల్విటాలులో ముఖ్య విటమిన్లు ఖనిజలవణాలు ఉన్నాయి. ఈ రెండూ శిశు ఆహార లోపాలను తీర్చడానికి ముఖ్యమైనవి.

మీ శిశుశరీర పోషణ మీ చేతిలో వున్నదే; వారికి మెక్లెక్ ఆహారాలిచ్చిన మీదట ఎలా పెరుగుతారో మీకే ఆశ్చర్యం కలిగిస్తుంది.

సమపాలనాహారాలకు ఈ మెక్లెక్ ఆహారములు మహాసహాయకారులని ఆహారపరిశోధకులు ప్రకటించారు. మెక్లెక్ ఆహారాలు సులభ జీర్ణవంతములు ఘనసారవంతములు; కానీ మందులూ మత్తు కల్పించేవి కావు.

★

శిశువులకు: మెక్లెక్ వారి ప్రొటీను లోపనివారణీ యాహారము.

విటమిను లోపనివారణకు: సిరప్ కాల్విటాల్.

**మెక్లెక్ న్యూట్రిమెంట్సు**

మీ ఆహార పదార్థములను సమపాలనం చేయును.

వివరాలను ఈ క్రింది వారినడగండి.

**మెక్లెక్ న్యూట్రిమెంట్సు అండ్ ఫార్మాస్యూటికల్సు, లిమిటెడ్.**

99. ఎ. ఆర్మీనియన్ స్ట్రీట్ జి. టి. మద్రాసు.

MNP. 49 B Telugu

# పెప్పర్ మింట్

లేదా ...



పిల్లలకు కావలసిన రుచి ఏమిటో సరిగ్గా తెలుసుకోవటంలో ఎంత ఆనందం ఉంది! ఈవేళ పెప్పర్ మింట్ ఇష్టం. రేపు కేరామెల్ ఇష్టం కావచ్చు. కె.సి.పి. వారు అన్ని రకాలూ తయారు చేస్తారు. వాటి అన్నిటిలోనూ తప్పకుండా ఉన్న ముఖ్యలక్షణం లోపంలేని పరిశుభ్రత.

సర్వత్రా ఆదరించబడినవి



## సావ్రిన్ స్వీట్స్

కె. సి. పి. తయారీ



# స్వర్ణోత్సవసుప్రభాతము



పండిత డి. గోపాలాచార్యులవారి

# జీవామృతము

పీడిత మానవులకు సేవచేయుటలో నేటితో జీవామృతము నకు ఏబది వత్సరములు ఉదయించి నది. నేటికిని, మెదడు పనిచేయు వారికి, బలహీనులకు జీవశక్తి ప్రసాదించేది జీవామృతమే యని శ్లాఘింప బడుచున్నది.



## ఆయుర్వేదాశ్రమము లిమిటెడ్

మద్రాసు 17

(1)

పిల్లవాడు ఏడుస్తున్నాడు



(కారణంలేకుండానే)

(2)

అతనికి

గ్రైప్ సిరప్ ఇవ్వండి



(అసహ్యమైనరుచిలేదు)

(3)

పిల్లవాడు నవ్వుతున్నాడు



ఒక ITL ప్రాడక్టు మైసూర్ ఇండస్ట్రియల్ &
టెస్టింగ్ లేబరేటరీ లి. బెంగుళూరు

BGK-15-TG

సెల్లింగ్ ఏజెంట్లు: బెస్ట్ అండ్ కో. లిమిటెడ్ P. B. నెం. 63, మద్రాసు.



భారత స్వాతంత్ర్యోదయముతో మనకొక
నవ స్వర్ణ యుగారంభమైనది - -

ఈ స్వాతంత్ర్యమును దక్కించుకొనుటకు
ప్రతి భారతీయుడున్నూ జాతీయోద్యమంలో
శాయశక్తులా కృషిచేయవలెను - -

దేశమునకు ఆర్థిక విముక్తి సంపాదించుటకు
మేము దేశమును సేవించుచుండెదము -

సర్వోపయుక్తమైన
అల్యూమినియముతో
వంటపాత్రలుమొదలు,
విమానములపరకూ
చేయుదురు -

ఏ అల్యూమినియము వస్తువులు కావలసినను మీ సమీపశాఖకు వ్రాయండి :

PURE ALUMINIUM THE CROWN

జీవన్‌లాల్ (1929) లిమిటెడ్

★

మేనేజింగు డైరెక్టర్ :

రాయ్‌బహదూర్ హేమ్‌చంద్ కే. షా.

కలకత్తా - బొంబాయి - మద్రాసు - రాజమండ్రి - ఏడెన్ - రంగూన్ - ఢిల్లీ.


రీటా తలవెండ్రుకలను పెంచును
రీటా కుదుళ్ళకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెండ్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్. తల వెండ్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకు, ఇంకను తలవెండ్రుకలకు సంబంధించిన సమస్తవ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనకువేలు వారి గుణమును పొందియున్నారు. మీరు కూడ నేటినుండి రీటాయే వాడుడు.
రీటా హిందూదేశమంతటా దొరకును. సీసా 15 అ.
RITA
HAIR TONIC
RITA

సూచనలు కనిపించిన తక్షణమే
పిల్లల లివరు స్ప్లీను వ్యాధులకు
జమ్మివారి
లివర్ క్యూర్
వాడండి.
అన్ని మందుల షాపులలోను దొరకును.
హూ కో
కోరింతదగ్గుకు అద్భుతఔషధం.
జమ్మి వెంకటరమణయ్య & సన్సు హెడ్ ఆఫీసు మైలాపూరు మద్రాసు.
J. 88—Telugu

## మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే

బాధపడుచున్న యెడల వెంటనే

పాత్రుడుగారి

# బాలసంజీవిని

యీయండి

ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.

వివరములకు:

## డా॥ పిల్లా పాపయ్య పాత్రుడు & బ్రదరు,

11, దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

కుంభకోణం బ్రాంచి:
నెం. 7, సారంగపాణి కోవిల్,
తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి:
నెం. 15, పుగళై పిళ్ళై వీధి,
తెప్పకొలం.



# ఈస్ట్ అండ్ వెస్ట్

## ఇన్షూరెన్సు కంపెనీ, లిమిటెడ్, బొంబాయి.

[1913 లో స్థాపితం]

ప్రధాన కార్యాలయం:

'ఈస్ట్ అండ్ వెస్ట్ బిల్డింగ్', ఫోర్టు, బొంబాయి.

33 సంవత్సరాలుగా దేశసేవచేస్తూ జాతీయోన్నతి సంపొందిస్తూ ఉన్న ప్రముఖ భారతీయ భీమాసంస్థ.

ఆర్థికంగా సుస్థిరమై, పాలసీదార్లతోనూ, ఏజంట్లతోనూ వ్యవహరించుటలో సంస్కారానికి పేరెన్నికగన్న సంస్థ.

1944 లో జరిపిన అడనపువ్యాపారం కోటిరూపాయలు మించింది.

చురుకైనటువంటిస్నీ, పలుకుబడి కలిగినటువంటిస్నీ వ్యక్తులు ఏజన్సీలకొఱకు దరఖాస్తులు పెట్టుకోవచ్చును.

వివరాలకు:

శ్రీ జె. యస్. రెడ్డి
బ్రాంచి సెక్రటరీ.,
377, ఎస్ప్లనేడ్,
మద్రాసు.

★

శ్రీ ఎ. వెంకటరెడ్డి
ఇన్స్పెక్టర్ ఆఫ్ ఏజన్సీస్.
మోదుకూరు, వయా—పొన్నూర్.
గుంటూరు జిల్లా.

శ్రీ యస్. మల్లికార్జునరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ, బెజవాడ.

# బిటా కేఫిన్




(తలనొప్పి బిళ్లలు)

అన్ని నొప్పులను, జ్వరములను కుదుర్చును.

తలనొప్పి, పంటినొప్పి, కాళ్లనొప్పి, నిద్రలేకుండుట, కీళ్ళనొప్పులు, మలేరియా, స్త్రీల బహిస్టు నొప్పులు, అలసట వగైరా అన్నిటికి గ్యారంటీగా పనిచేయును. వాడుకొను విధము పొట్లములో నుండును.

పొట్లం 3 బిళ్లలు **1 అణా.**

స్టాకిస్టులు: దాదా అండ్ కంపెనీ, పి. టి., మద్రాసు.

అన్ని చోట్ల దొరకును.

తయారుచేయువారు:

*Stockists:*—M/S DADHA & CO, P. T. MADRAS.

*Manufactured by*—**BOMBAY TABLET MANUFACTURING CO.,**
**Post Box No. 2092, BOMBAY. 2.**

# వాల్కాన్ పెయిన్ బామ్

(అన్ని విధముల నొప్పులకు)

## స్కాబిజోటిక్ (తీట, గజ్జి, కురుపులు గడ్డలకు)

టవర్ మార్కు

## పండ్లపొడి (దంత. శుభ్రతకు)

వీటిని ప్రసిద్ధ డాక్టర్లు సిఫారసు చేయుచున్నారు. ఎందుకన, అవి ప్రత్యేక గుణములు గలిగియున్నవి.

అన్నిచోట్ల ఏజెంట్లు కావలెను

వివరములకు:

## MALKAN PRODUCTS CO.,

**KURLA :: BOMBAY.**

# ఆంధ్రజ్యోతి

.....సచిత్ర మాస పత్రిక.....

సంపాదకుడు: చక్రపాణి

సంపుటి 8] **15 ఆగస్టు 1947** [సంచిక 3


# స్వాతంత్ర్య పతాక

ఎగురవే వినువీధి ఎగురవే జెండా
శాంతిదూతగ నేడు, జాతీయ జెండా!
యుగయుగంబుల జగతి నెగురవే జెండా
సౌఖ్యప్రదాతగా స్వాతంత్ర్య జెండా!

భారతీయుల మహాపోరాట ఫలితమా!
వీరయోధుల రక్తధారలకు చిహ్నమా!
శాంతిమాత, అశోక ధర్మచక్రముదాల్చి
శాంతి నిల స్థాపించ నరుదెంచితివి నీవు!

పెనుతుపానులవెన్ని పెనవేసుకొన్న
దనుజులందరు గూడి, నిను దింప నున్న
కడ భారతీయుండు పడిపోవు దనుక
గగనాన ధ్రువతార కరణి నిల్చెదవు!


సుంకర సత్యనారాయణ

# స్వాతంత్ర్య దినము

నేడుగా తమమేని నెత్తురులోడ్చి రాజ్యశ్రీని జేకొన్న యట్టిదినము
నేడుగా జగతి బానిసజాతియను పేరు బోగొట్టుకొన్నట్టి పుణ్యదినము
నేడుగా యెన్నడుపీడని దాస్యశృంఖలముల(దెంచిన ఘనదినమ్ము
నేడుగా పరజాతినిన్ ద్రోసిరాజని యాటకట్టించినయట్టిదినము

నేడుగా దేశమాత పున్నెముఫలించి
ఖండ ఖండాంతరముల నఖండయశము
బడయు దివ్యముహూర్త, మీపర్వమందు
సంస్మరింపు డీ పుణ్యవాసరమునందు.

"డయ్యరు" చేతిలో వ్రయ్యలై తొల్త గష్టమ్ములన్ గుందె పంజాబు తల్లి
ఉరికంబముల నెక్కి యుసురులర్పించిరి, ధీర భగత్‌సింగు వీరవరులు
ప్రాయోపవేశు(డై ప్రాణమర్పించె బందియయందె వీర జతీంద్రదాసు
శత్రుసేనల జేరి సాధింపయోధుడై పణమొడ్డినాడు సుభాసుబాబు

సాధనములందు వేర్వేర సరణులున్న
బడయునాదర్శ మొక్కటే, ప్రాణములను
దృణముగానెంచి తమ మాతృదేశమునకు
ధారవోసిన యాధీర వీరవరుల
సంస్మరింపు డీ పుణ్యవాసరమునందు.

నౌరోజి గోఖలే నాటిన స్వాతంత్ర్య బీజమనుదినమ్ము వృద్ధినొందె
బాలగంగాధర ప్రముఖుండు పోషింప వృక్షమై శాఖలవెలపెదిశల
లాలాజి దాసు మోతీలాలు రక్షింప విచ్చిరమ్యముగ పుష్పించికాచె
మదనమోహన, గాంధి మొదలగువారలు పెంచి కాపాడ ఫలించె నేడు

నాయకాగ్రణు లెందఱెందఱొ జనించి
దేశ మాత ఋణమ్మది తీర్చినారు
ప్రాణముల ధారవోసిన పావనులను
సంస్మరింపుడీ పుణ్యవాసరమునందు.

# పదిహేను ఆగస్టు 1947

దివ్యమోహను నాజ్ఞదీక్షగృహమ్ముల నలిపిన ఘనతపఃశక్తిఫలము
లాటీలకును వెన్కలాగకయె శిరమ్ము లొగ్గి సహించిన యోర్పు ఫలము
అన్నవస్త్రము లీకయున్న బందెలగుంది చేసిన యా యుపవాసఫలము
అకట ! తుపాకిగుండ్లకు ప్రాణమొడ్డి యంగవిహీనులగు జనాకాంక్షఫలము

కాక యీనాటి యీ మహత్కార్యమునకు
జేర గల్గుదుమే వారి శిథిల జీవి
తమె పునాదిగ గట్టు సౌధమున వీరి
సంస్మరింపు డీ పుణ్యవాసరమునందు.

వృద్ధాప్యమున బందెవీడక ప్రాణముల్ ధారవోసినది కస్తూరి తల్లి
సత్యాగ్రహమ్మున జైలులో మరణించె మహదేవదేశాయి మాన్యయశుడు
చీమూరు మిద్నపూర్ సీమల వేనవేల్ హింసింపబడి రమాయికప్రజలు
తీయక పోరి జాతీయపతాకరక్షణ క్రిందనలిగి నష్టమ్ముగనిరి

ధర్మసంరంభమనుచు సత్యాగ్రహమ్మ
టం చహింసయు రాట్నమ టంచు గాంధి
బోధసేయగ జయములు పొందుఘనుల
సంస్మరింపు డీ పుణ్యవాసరమునందు.

సాహసమున స్వరాజ్యస్థాపనకు పాటుబడ్డ ఝాన్సీ లక్ష్మిబాయి యొకతె
కడదాక దేశరక్షణకు పోరాడెను నానసాహెబు ప్రజానాయకుండు
పరరాజ్యమున్ద్రోయ పన్నితంత్రమ్ముల సాధించె తాంతియాయోధుడొండు
గడగడవణికించె యడలి ఖిల్లులగూర్చి రాజ్యమున్గొన రామరాజొకండు

భారత స్వతంత్రసంరంభ కారణమున
ప్రాణముల్ ధారవోసిరీ భరతభూమి
త్యాగులైనట్టి వీరినందఱిని భక్తి
సంస్మరింపు డీ పుణ్యవాసరమునందు.

తనివిందీరక వీరమాతయన, స్వాతంత్ర్యేచ్ఛతో నొక్కటై
లను జాతీయపతాకబూని మదినుల్లాసంబునన్ దేశర
క్షణకై పూరుషవీరవర్యులబలెన్ జాతీయ సంరంభమం
దున పాల్గొన్న సతీశిరోమణుల నెంతున్ భక్తి జోహారులన్.

రమణీయంబుగ గుంపులన్ జయజయా రావమ్ములన్ వీరవా
క్యములన్ బల్కుచు జేరవచ్చిరిదె విద్యార్థుల్ స్వతంత్రేచ్ఛ హ
స్తములన్ దేశపతాకలన్ గొని స్వరాజ్యస్థాపనౌ నీ ముహూ
ర్తమునన్ దీవనలిమ్మహో! భరతమాతా! శ్రీ సమేతా! దయన్.

వర గాంధీ జవహర్ పటేలు మెహతాబ్ పట్టాభి రాజాజి శం
కరరావ్ పంత్ అజాద్ కృపాలినులు డాక్టర్ ఘోషసాహాలి ధీ
వర రాజేంద్రులునున్ సరోజనియు నాపై నెందఱో భక్తిజే
రిరి, శ్రీ మాతృపదాబ్జపీఠికి సమర్పింపంగ దామంజలుల్.

అదె రారండు స్వదేశ మాతృపదపీఠారాధనామగ్నులై
యిదె వేచేరుచు నున్నవారలు స్వతంత్రేచ్ఛన్ ముహూర్తమ్మిదే
కదిసెన్ జాగునొనర్పకే నిలువుడీ కైవారమున్ బట్టి య
ల్లదె నీరాజనమున్ గ్రహించు సమయంబయ్యెన్ వెసన్ జేరుడీ.

అదె ఢిల్లీపుర కోటలో నడుమ సౌధాగ్రమ్మునన్ స్వేచ్ఛగా
కదలెన్ దివ్య సుదర్శనంబనగ చక్రంబొండు భాసిల్ల న
య్యదె జాతీయపతాక యెల్లరును జోహారుల్ సమర్పింపగా
సుదినం బియ్యది జేరరండు తరియించున్ జన్మ లీనాటితోన్.

ఇది 'సంపూర్ణ స్వరాజ్య' మెన్నటికిగాదే, యైకమత్యంబునన్
మెదలన్ 'బూర్ణ స్వరాజ్యమున్' ద్వరగ నిర్మింపన్ సుసాధ్యంబగున్
మదిలో భేదములేక యెల్లరును సంపాదింపుడీ నేడెగా
సుదినం బయ్యది చేరరండు తరియించున్ జన్మ లీనాటితో.

గురుజాడ రాఘవశర్మ



# ఇండియాలో బ్రిటిష్ పరిపాలన

రెండువందల సంవత్సరాలనుంచి సాంఘికంగా, ఆర్థికంగా రాజకీయంగా ఆసేతు హిమాచలం ఆవరించి ఉంటున్న ఘోర పారతంత్ర్యం ఈనాటికి అంతరించింది. దేశం విభక్తమై, సంస్థానాల సమస్యలు, తదితర ఆర్థికసమస్యలు తీవ్రస్వరూపం వహించి ఉన్నప్పటికీ భారతీయులు తమ భవితవ్యాన్ని దిద్దితీర్చుకొనటానికి సర్వస్వతంత్రాధికారం నేడు లభించింది. ఇకముందు భారతీయ సాంఘిక, ఆర్థిక, రాజకీయ వ్యవహారాలమీద బ్రిటన్‌కు ఈషణ్మాత్రంకూడా అధికారంలేదు. ఇది భారతదేశ చరిత్రలో అత్యంత పర్వదినం. భారతీయజీవనం రౌరవనరకంగా తయారుచేసి దానినుంచి వెలువడకుండా చూస్తూవచ్చిన బ్రిటిష్ సామ్రాజ్య పరిపాలన ఇక్కడ అంతరించింది. ఈ పరిపాలన ఘోరదుస్స్వప్నం కన్నా దారుణం. దుస్స్వప్నంవల్ల కలిగేఫలితం జాగృతితో అంతరిస్తుంది. బ్రిటిష్ పరిపాలన వల్ల కలిగిన ఫలితాలు, ఈనాడుకూడా మనం అనుభవిస్తూ వున్నాము.

ఈ దుష్ఫలితాలనుంచి బయటపడాలంటే ఇండియాలో బ్రిటిష్ పరిపాలనను ఒకసారి నిష్పాక్షికంగా సింహావలోకనం చేసుకోవాలి. బ్రిటిష్ పరిపాలన అంతరించింది కాబట్టి యిప్పుడు వట్టి ఆవేశాలకు తావులేదు. పైగా సరియైన శాస్త్రీయదృష్టితో పరిశీలించకపోతే మన భవితవ్యానికి చక్కనిమార్గం ఏర్పరచుకోలేము. అందువల్ల నిష్పాక్షిక నిర్లిప్త పరిశీలన అవస్థ.

బ్రిటిష్ పరిపాలనకూ, అంతకుపూర్వపు, ఇండియాపై దండెత్తి జయించి విదేశీయులు సాగించిన, పరిపాలనకు ఎక్కడా సంబంధంలేదు. చరిత్రలో ఇండియా తరచుగా విదేశ దండయాత్రలకు పాల్పడుతూవచ్చినమాట నిజమే. కాని నిజానికి ఈస్టు ఇండియా కంపెనీ ఈదేశానికి రాకపూర్వం ఇండియా యెన్నడూ స్వాతంత్ర్యాన్ని కోల్పోలేదు. విదేశీయులు ఈదేశంపై దండెత్తివచ్చి జయించినవారు ఇక్కడే నిలిచిపోయి. దీనినే మాతృదేశంగా భావించి పరిపాలన సాగించారు. మొదట్లో జయించినవారికి, జయింపబడినవారికి పరస్పర ద్వేషాలున్నా కాలంగడిచినకొందికీ పరస్పర సంబంధాలు హెచ్చి సుహృద్భావం ఏర్పడింది. జంగిస్‌ఖాన్‌లాంటివారు నలుగురైదుగురు దండెత్తివచ్చి దేశాన్ని దోచుకొన్నా వారు వెంటనే

వెళ్ళిపోయారుకాని, యిక్కడే తిష్ఠవేసి విదేశీయులవలె పరిపాలన సాగించలేదు. అందువల్ల ఇండియా ఎన్నిసార్లు విదేశ దండయాత్రలకు ఆహుతి అవుతూవచ్చినా స్వాతంత్ర్యం కోల్పోలేదు. ఇతరదేశ అభ్యుదయంకోసమని యీ దేశపరిపాలన జరగలేదు.

బ్రిటిష్‌వారు ఈ దేశంలో ఉండిపోదామని రాలేదు. కేవలం వర్తకంకోసమని వచ్చారు. లాభాలు సంపాదించి వాటిని మాతృదేశంలో అనుభవించటమే వీరి ప్రధానదృష్టిగా ఉంటూ వచ్చింది. ఇండియాలో కొంత వశమైననాడుకూడా ఇక్కడ ఉండి పోదామన్న దృష్టి ఏర్పడలేదు. ఇలాంటిదృష్టి ఏర్పడకపోవటానికి కారణాలు ఏమైనా, వారు ఇక్కడ ప్రజలతో కలిసిపోయి ఈ దేశమే తమ మాతృదేశంగా భావించటం జరగలేదు. అందువల్ల వారు ఎంత ఉదారహృదయంతో ప్రవర్తించాలనుకున్నా మాతృదేశమైన బ్రిటనే ప్రధానమనుకొని దాని శ్రేయస్సుకోసమే పాటుపడటం జరిగింది. ఇండియాలోని సాంఘిక ఆర్థిక రాజకీయ వ్యవస్థలన్నీ బ్రిటన్ అభ్యుదయానికి తోడ్పడేట్లుగా ఇంగ్లీషువారు తారుమారుచేసి వేశారు. మరొక దేశంకోసమని ఇండియాను పరిపాలించటమనేది మొట్టమొదటిసారి ఆంగ్లపరిపాలనతో వచ్చింది. అంతకుముందెన్నడూ భారతీయచరిత్రలో ఇలాంటిది జరగలేదు.

తరువాత ముఖ్యంగా గమనించవలసిన విషయం మరొకటిఉంది. బ్రిటిష్‌వారు వర్తకం యంత్రసంస్కృతి పురస్కరించుకొని యీ దేశానికి వచ్చారు. వర్తకానికి లాభంతప్ప మరొకదృష్టిఉండదు. మానవత్వం, పురుషార్థాలు నశిస్తున్నా దానికికావలసింది లాభం. యంత్రసంస్కృతికికూడా మొన్న మొన్నటివరకు లాభమనేది పరమార్థంగా ఉంటూవచ్చింది. ఈనాటికికూడా అమెరికా ఆ సిద్ధాంతాన్నితప్ప మరొకటి అంగీకరించటంలేదు. ఇలాంటి సంకుచితమైన వర్తకం యంత్రసంస్కృతి అనేవి ప్రధానలక్ష్యాలు కావటంవల్ల మనదేశం పండినా, ఎండినా, పట్టించుకోకుండా సొంత లాభంకోసం తీవ్రంగా పాటుపడుతూవచ్చారు. లాభమనేదే ఏకైక లక్ష్యమైనప్పుడు నీతి, అవినీతి అనికాని, న్యాయం అన్యాయం అనికాని, ఉచితం అనుచితం అనికాని, మానుషం అమానుషం అనికాని ఎన్నడూ తోచనన్నా తోచదనటానికి ప్రబలనిదర్శనం ఇండియాలో బ్రిటిష్ పరిపాలనే.

దేశంలో నేడు దారిద్ర్యం, అజ్ఞానం, సంకుచిత మత ఆవేశాలు, అవినీతి ప్రబలంగా ఉన్నాయంటే అవన్నీ బ్రిటిష్ పరిపాలనపెట్టిన భిక్షకాని మరొకటికాదు. బ్రిటిష్‌వారు అడుగుపెట్టేనాటికి దేశం ఇంత అధ్వాన్నంగాలేదు. ఆనాడు పారిశ్రామికంగా ఆర్థికంగా ఇండియా ఎంతో ఉచ్ఛస్థితిలోఉంది. అందువల్లనే ఇండియాతో వర్తకంసాగించి లాభం పొందుతామన్న దృష్టిచే డచ్చివారు, ఫ్రెంచివారు, పోర్చుగీసువారు, ఇంగ్లీషువారు, ఇక్కడకు రావటం జరిగింది. లేకపోతే అన్నివేల మైళ్ళనుంచి రావలసిన పనిలేదు. దుర్భిక్షంగా ఉన్న దేశంలో వర్తకసౌకర్యాలు ఏర్పరచుకోవటం కోసమని పాశ్చాత్య వర్తకసంఘాలు పరస్పరం తీవ్రంగా పోరాడుకో నవసరంలేదు.

16, 17 శతాబ్దాలలో ఇండియా రాజకీయంగా అల్లకల్లోలాలకు ఆహుతిఔతున్నా, వర్తకం, పరిశ్రమలు, ఆర్థికవిధానం, ప్రపంచంలోని మరేదేశానికి తీసిపోలేదని ప్రామాణికులైన చరిత్రజ్ఞులు సోపపత్తికంగా తెలుపుతున్నారు. ఆనాటికి యూరప్‌లో అంతటా ఇండియా సరకులు, పరిశ్రమలు పేరుగడించుకొన్నాయి. ప్రతివారు భారతీయ వస్తువులకోసం అర్రులు సాస్తూవచ్చారు. ఆనాటి భారతీయుల బ్యాంకింగ్‌విధానం చక్కని పద్ధతులపై దేశమంతటా విస్తరించివుంది. పెద్దపెద్ద భారతీయ పారిశ్రామిక వాణిజ్యసంస్థల హుండీలు, ఒక్క ఇండియాలోనేకాక ఇరాన్, కాబూల్, హీరాట్ మొదలైన మధ్య ఆసియా ప్రాంతాలలోకూడా అవ్యాహతంగా చెలామణి అవుతూవచ్చాయి. ఈసంస్థలకు ముఖ్యమైన ప్రతికేంద్రంలోను ఏజెంట్లు, గుమస్తాలు, బ్రోకర్లు, ఖాయిదాదార్లు ఉంటూవచ్చారు. నౌకాపరిశ్రమకూడా ఎంతో అభివృద్ధిలోఉంది. నెపోలియన్ యుద్ధాలలో ఆంగ్లేయ నౌకాధిపతి వినియోగించిన ముఖ్య నౌకలలో ఒకటి భారతీయ నౌకాపారిశ్రామికసంస్థ నిర్మించిందే.

1757 లో మూర్షిదాబాద్‌ను (బెంగాల్‌లోనిది) గురించి వ్రాస్తూ క్లయివు విస్తీర్ణంలోను, జనసంఖ్యలోను, సిరిసంపత్తులలోను లండన్‌నగరానికి తుల్యంగాఉంది. అయితే మూర్షి దాబాద్‌లోని కొంతమంది వ్యక్తుల ఐశ్వర్యం లండన్‌లోని వ్యక్తుల ఐశ్వర్యంకంటె ఎంతో అధికంగా ఉందన్నాడు.

దేశంలో అంతటా ఇంతకంటె పెద్దనగరాలు ఎన్నోఉన్నాయి. పెద్ద పెద్ద పారిశ్రామిక సంస్థలు, వాణిజ్యసంస్థలు నెలకొని ఎప్పటికప్పుడు వస్తువులధరలు తెలుసుకుంటూవుండేయి. యుద్ధవార్తలు ఈస్టిండియా కంపెనీవారికంటె ముందుగాకూడా సంపాదిస్తూండేది.

ఇలా వాణిజ్యంలోను, పరిశ్రమలలోను ఎంతో ఉచ్ఛస్థితిలోఉన్న దేశంలో బ్రిటిష్‌వారు కాలుమోపిన ప్రతిప్రాంతం శాంతి, వృత్తులు, వాణిజ్యం, పరిశ్రమలు, నశించి వల్లకాడుగా తయారవుతూవచ్చింది. బ్రిటిష్‌వారు ఆక్రమించేనాటికి బెంగాలురాష్ట్రం అన్నివిధాలా భాగ్యవంతంగా సుభిక్షంగాఉంది. కాని ఈస్టుఇండియాకంపెనీ వర్తకంపేరుతో ప్రవేశించి 1757 ప్లాసీయుద్ధంలో జయించిన అనతికాలంలోనే ఆర్థికవిధానం, పరిశ్రమలు తుత్తునియలైపోయాయి. వర్తకంపేరుతో క్లయివు ప్రజలను దోచుకోటానికి అవలంబించని అవినీతి, దౌష్ట్యం, కుతంత్రం, వంచన ఒకటికూడాలేదు. దీనిఫలితంగా బెంగాల్ బీహారు రాష్ట్రాలలో చరిత్రలో అంతకు మున్నెన్నడు కనీవిని ఎరుగని ఘోరక్షామం బయలుదేరింది. మొత్తం జనసంఖ్యలో మూడోవంతు బలి అయిపోయింది.

మొట్టమొదట యూరపియన్ వర్తకసంఘాలన్నీ ఇండియాలో తయారైన వస్త్రాలు, వస్తువులు, సుగంధద్రవ్యాలు మొదలైనవాటినికొని యూరప్‌లో అమ్మకొని లాభంసంపాదించటానికి బయలుదేరాయి. ఈస్టిండియా కంపెనీకూడా అలా బయలుదేరిందే. అయితే 15 వ శతాబ్ది ఉత్తరార్థానికి ఇంగ్లండులో ఆవిరియంత్రం, బట్టలమిల్లులు, మొదలైన యంత్రాలు

జయలుదేరి యంత్రపరిశ్రమలు అభివృద్ధిచెందాయి. ఆనాటికి ఇండియాలో తయారవుతున్న సరకులన్నిటిని కొని యూరప్ కెగుమతిచేయటం దాదాపుగా బ్రిటిష్‌వారు గుత్తపొందారని చెప్పవచ్చును. ఇంగ్లండులో యంత్రపరిశ్రమలను నెలకొల్పి సరకులు తయారుచేయటం మొదలుపెట్టగానే పెట్టుబడిదారులు తమ పార్లమెంటుచే శాసనంచేయించి ఇండియా సరకులు బ్రిటన్‌కురాకుండా నిషేధింపజేశారు. అంతేకాదు ఈస్టు ఇండియాకంపెనీ ఇండియా సరకులను విదేశాలకు ఎగుమతిచేయటం మానివేసింది. దానితో బ్రిటిష్ వస్తువుల ఎగుమతికి అనుకూల్యం ఏర్పడింది. స్థితిగతులు ఇంతటితో ఆగలేదు. భారతీయ పరిశ్రమలను అరికట్టటానికి, ధ్వంసంచేయటానికి అనేకమార్గాలు అవలంబించింది. పన్నులు అధికంగా విధించి ఇండియా సరకులు దేశంలోనే ఒకప్రాంతంనుంచి మరొకప్రాంతానికికూడా ఎగుమతికాకుండా అటకాయించసాగింది. ఇలాంటిసమయంలో బ్రిటిష్ పరిశ్రమలు ఎలాంటి సుంకాలబాధకు గురికాక అవ్యాహతంగా దేశంలోకివచ్చి పడసాగాయి. దీనివల్ల భారత వస్త్రపరిశ్రమ ఒక్కసారిగాకూలి ఊరుకొన్నది. వేలకొలది సాలీలు నేతగాండ్రు జీవనోపాధి కోల్పోయారు. ఈ పని ముందు బెంగాల్ బీహారు రాష్ట్రాలలో జరిగింది. ఈ అరిష్టం బ్రిటిష్ ఆక్రమణ జరిగినచోటికల్లా వ్యాపించి రైల్వేలు ఏర్పడిన ప్రాంతాలంతటా ప్రబలమైపోయింది. 19 వ శతాబ్దమంతటా ఈపనిజరిగింది. భారత వస్త్రపరిశ్రమేకాక నౌకానిర్మాణం, లోహపరిశ్రమలు, గాజులు, కాగితం మొదలైన పరిశ్రమలు వరసగా త్వరత్వరగా అంతరిస్తూవచ్చాయి.

ఈ ఘోరవిధ్వంసనతో కోట్లకొలది ప్రజలకు తరతరాలనుంచి వస్తున్న వృత్తులు నశించాయి. ప్రాతవృత్తులు పోయినా నూతనజీవనోపాధిమార్గాలు ఏర్పడినవా అంటే అదీలేదు. ఇక మార్గమేమిటి? ఆకటిచిచ్చుతో మలమలమాడటంకన్నా మార్గమేముంది? నిజంగా అలాగే జరిగింది. లక్షలాదిప్రజలు మరణించారు. లక్షన్నర జనాభా కలిగిన ఢాకా నగరం పదిహేనేళ్ళలో 130 వేల జనాభా కోల్పోయింది. ఇండియా గవర్నర్ జనరల్‌గా పనిచేసిన లార్డ్ బెంటింకు 1834 లో ఇలావ్రాశాడు :

"వాణిజ్య చరిత్రలో యిలాంటి ఘోర పరిస్థితి కని విని యెరుగరు. నేతగాండ్ర యెముకలతో ఆర్యావర్తం మైదానాలు నిండి నిబిడీకృతాలై శ్మశానవాటికలుగా తయారయ్యాయి."

చచ్చినవారు చావగా ఇంకా ఎన్నోలక్షలు తమవృత్తులను కోల్పోయి వేరే గత్యంతరంలేక వ్యవసాయవృత్తికి మళ్ళారు. 19 వ శతాబ్ద మధ్యభాగంనాటికి పోయిన పరిశ్రమలు పోగా నూటికి 45 మంది ఇంకా పరిశ్రమలతో జీవిస్తూవచ్చారనీ, నూటికి 55 మందికి వ్యవసాయం జీవనోపాధిగా ఉందనీ చరిత్రకారులు వ్రాస్తున్నారు. ఈ యుద్ధానికి పూర్వంతేల్చిన లెక్కలను బట్టి నూటికి 75 మంది వ్యవసాయంతో జీవిస్తున్నట్లు తెలుస్తున్నది. దీనినిబట్టి బ్రిటిష్ ప్రభుత్వం భారతపరిశ్రమలను ఎంత ధ్వంసంచేసిందో స్పష్టమౌతూనే వున్నది.

పరిశ్రమలపైన వాణిజ్యంపైన ఆధారపడుతూ వచ్చినవారు లక్షలాది వ్యవసాయానికి మళ్ళారు. దీనిఫలితంగా భూములు సేద్యగాండ్రచేతినుండి జారిపోయాయి. జారిపోయినా,

వ్యవసాయానికి అనుకూల్యం ఎక్కువ అయిందా అంటే అదీలేదు. పొలాలు మరీ ఎందుకు పనికిరాని ముక్కలు చెక్కలు అయిపోయాయి. పొలంలేని రైతుకూలీలసంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. రైతుల ఋణభారంసంగతికూడా వేరే చెప్పనవసరంలేదు.

అభివృద్ధిపొందుతున్న ప్రతిదేశంలోను 19 వ శతాబ్దిలో వ్యవసాయవృత్తినుంచి అత్యధికంగా త్వరత్వరగా పరిశ్రమలకు మళ్ళుతూవచ్చారు. ఇండియాలో దీనికి కేవలభిన్నంగా జరిగింది. యూరప్‌దేశాలలో నగరాలు విపరీతంగా పెరుగుతూవస్తే ఇండియాలో అలాంటిది జరగలేదు. అక్కడక్కడ కొన్నినగరాలు బయలుదేరినవంటే దానికికారణం బస్తీలు ధ్వంసంకావటమే.

బ్రిటిష్‌వారు ఇండియాకు బయలుదేరటం బయలుదేరటమే యంత్ర నాగరితతోవచ్చారు. 18 వ శతాబ్ది ఉత్తరార్థానికి ఆవిరియంత్రాలు బయలుదేరాయి. బ్రిటన్ ప్రబలయంత్ర పారిశ్రామికదేశంగా తయారైనది. పెట్టుబడిదారీవిధానం బహ్మాండంగా బయలుదేరింది. పెట్టుబడిదారీవిధానం ఎప్పుడూ సరకుల్ని ఎగుమతిచేసి విపరీతలాభాలు సంపాదించటానికి ప్రయత్నిస్తుంది. తనకు పోటీవచ్చే పరిశ్రమలను నామరూపాలులేకుండా చేయటానికి ప్రయత్నిస్తుంది. తమసరకు విడుదలకావలసిన దేశాలలో యంత్రాలు బయలుదేరకుండా పలిమినీ బలిమిని ప్రయత్నిస్తుంది. తన సరకును అమ్ముకొనే సదుపాయాలు సంపాదించటానికి అధికారం సంపాదిస్తుంది. ఆ సంపాదించిన అధికారానికి లక్ష్యం ఒక్కటే. దేశీయ పరిశ్రమలపై పన్నులువేసికొని, ఇతరప్రాంతాలకు ఎగుమతిచేసికాని, అసలు నిషేధించికాని, తమసరకులపై పన్నులు ఏమాత్రం పడకుండాచేసికొని దేశీయ పరిశ్రమలను అరికట్టటమే.

ఇండియాలో అధికార్యం సంపాదించిన బ్రిటిష్‌వారు ధర్మాధర్మాలు, మానుష అమానుషత్వాలు గమనించకుండా ఈపైన పేర్కొన్న పనులన్నీ చేసివేశారు. అప్పటిదాకా భారతీయ గ్రామాలు స్వయంపోషక ఆర్థికవిధానంకలిగి చిన్నచిన్న రిపబ్లిక్ రాజ్యాలుగా ఉంటూ వచ్చాయి. ఆ గ్రామాలకు విదేశీ వ్యవహారాలలో దాదాపు సంపూర్ణ స్వతంత్రాలుగా ఉంటూ వచ్చాయి. ఇలాంటి వ్యవస్థవల్ల ఎంతో స్వాతంత్ర్యం అనుభవిస్తూ నిత్యకల్యాణం పచ్చతోరణంగా ఉంటూవచ్చాయి. ఈవిధానం అంతకుపూర్వం ఎన్నోవందల సంవత్సరాలనుంచి అవిచ్ఛిన్నంగా వస్తూవుంది. మహమ్మదీయులు దండెత్తివచ్చినా, అంతకుముందు మరొకజాతి దండెత్తివచ్చినా ఈ ఆర్థిక రాజకీయవిధానానికి భంగంవాటిల్లలేదు. అందువల్ల ప్రజలకు అంత కష్టమనిపించలేదు.

కాని బ్రిటిష్ ఆక్రమణతో ఈ వ్యవస్థ అంతా తలక్రిందులైపోయింది. వందల సంవత్సరాలనుంచి వస్తున్న జీవనోపాధులు, వృత్తులు, పరిశ్రమలు అన్నీ ఒక్కసారి అంతరించాయి. అంతకుముందు దేశంలో మానవునకు మానవునకు మధ్య ఉంటూవచ్చిన సాంఘిక సంబంధాలన్నీ ఒక్కసారిగా ద్రవ్యస్వరూపం ధరించాయి. కోట్లకొలది ప్రజలు నిరుద్యోగులైపోయారు. జీవితం దుర్భరమైపోయింది.

బ్రిటిష్‌వారు స్వాధీనపరచుకొని తమవిధానం ప్రవేశపెట్టేటంతవరకు భూమి గ్రామస్థుల ఉమ్మడిసొత్తుగా ఉండేది. గ్రామస్థులంతా సహకారపద్ధతిపై వ్యవసాయం సాగించి పండిన పంటలను అనుభవిస్తూ వుండేవారు. అంతేకాని జమీందారులులేరు. భూములెన్నడు వారి సొంత ఆస్తిగా పరిగణించటంకాని, వాటిని వారు ఇష్టంవచ్చినట్లు అమ్ముకోవటానికి అధికారముున్నట్లు భావించటంగాని జరగలేదు. కాని ఇంగ్లండులోఅలాంటి పద్ధతిలేదు. జమీందారీ విధానం ఉండేది. ఇండియాకువచ్చిన గవర్నర్స్ జనరల్ అందరూ జమీందారి పాయవాళ్ళు. అందువల్ల వీరు జమీందారీవిధానం దృష్టిలోఉంచుకొని భూమిశిస్తులను తదితరమైన పన్నులను వసూలుచేయటానికి ఉద్యోగులను నియమిస్తూవచ్చారు. వీరినికూడా త్వరత్వరలో మారుస్తూ వచ్చారు. ఇలాంటి ఉద్యోగులనే క్రమ క్రమంగా జమీందారులుగా తయారుచేశారు. రైతుల పాలిటి యముళ్ళను సృష్టించారు. బెంగాల్ యూపీ జమీందారులంతా ఈ విశ్వామిత్ర సృష్టిలోవారే.

ఈ విధానంవల్ల సమష్టిజీవనం, సహకారపద్ధతి పూర్తిగా అంతరించింది. రైతుల పేదరికం పెచ్చరిల్లింది. ఈవిధానం కేవలం పన్నులు తేలికగా వసూలుచేసుకోటానికి, తమతో సహకారంచేసేవర్గాన్ని నెలకొల్పుకోటానికి, తిరుగుబాటులను తేలికగా అణచివేయటానికి ప్రవేశపెట్టారు. ఈ విషయం గవర్నర్‌జెనరల్ బెంటింక్ 1829 లో వ్రాసినదానినిబట్టి స్పష్టమౌతున్నది.

పెట్టుబడిదారులకు మార్కెట్లు అధికంగాకావటం అవసరం. అందువల్ల విధిగా ఇతర దేశాలపై దండెత్తి తమ అదుపులోకి తెచ్చుకోవటం,అవసరంవున్న దేశాలను కాపాడుకోవటం, వ్యాపారమార్గాలను రక్షించుకోవటం ముఖ్యం. అందుకోసమే బ్రిటన్ భారతీయసైన్యాలతో ఆఫ్గన్, ఆఫ్రికా, పర్షియా, బర్మాలపై యుద్ధాలుసాగించింది. మెడిటరేనియన్ ప్రాంతంలో ప్రబలమైన నౌకాబలాన్ని పెట్టారు. ఈ ఖర్చులన్నీ ఇండియామీద విధించారు. చైనా పర్షియాలో బ్రిటిష్ రాయబారులను ఉంచటానికికూడా ఇండియాయే ఖర్చులు ఇచ్చుకోవలసి వచ్చింది. సామ్రాజ్య రక్షణకొసం, బ్రిటిష్ వర్తకసౌకర్యంకోసం ఇంగ్లండ్‌నుండి ఇండియాకు వేసిన తంతిమార్గానికూడ వ్యయం ఇండియానుంచి వసూలుచేశారు.

ఈవిధంగా పరిశ్రమలను, వాణిజ్యాన్ని సంపూర్ణంగా నాశనంచేసి జమీందారీవిధానాన్ని ప్రవేశపెట్టారు. నిజానికి వ్యవసాయాన్ని అభివృద్ధిచేయటంవల్ల పెట్టుబడిదారీ విధానానికివచ్చే నష్టమేమీలేదు. పరిశ్రమలకు కావలసిన ముడిసరకులు చౌకగా దొరికిఉండేవి. ప్రజల స్థితిగతులు కొంత బాగుపడి బ్రిటిష్ సరకులు మరికొంత విరివిగా అమ్ముడుపోవటానికి వీలుండేది. కాని మరొకప్రయోజనం అర్థించి ప్రవేశపెట్టిన జమీందారీవిధానం దీనికి అడ్డు తగిలిందనవచ్చును. కాని అలాంటి ఆటంకంలేనిచోటకూడా బ్రిటిష్ ప్రభుత్వం ఏమాత్రం తోడ్పడలేదు.

20 వ శతాబ్ది ప్రారంభంవరకు ఇండియా కేంద్ర ప్రభుత్వంలో వ్యవసాయశాఖ అనే పేరైనా లేదు. ఎటుతిరిగి ఈశతాబ్ది ప్రారంభంలో ఒక అమెరికన్ మహాశయుడు భారతీయ

వ్యవసాయాభివృద్ధికని విరాళమిస్తే అదే కేంద్రప్రభుత్వం వ్యవసాయశాఖ నెలకొల్పటానికి ప్రధానకారణమైంది.

ఇలా పచ్చి కసాయివిధానం అవలంబించటంవల్ల దేశంలో కోయని పిలిస్తే దారిద్ర్యం ఓయని పలుకసాగింది. 1770 నుంచి 1900 వరకు గడచిన 130 సంవత్సరాలలోను 22 ఘోరాతి ఘోర క్షామాలు వచ్చాయి.

| సం॥ | ప్రాంతం | మరణించినవారి సంఖ్య |
|---|---|---|
| 1770 | బెంగాల్ | 10,000,000 |
| 1783 | మద్రాసు | |
| 1784 | ఉత్తర హిందూస్థానం | అయోధ్య దాదాపు వల్లకాడైపోయింది. |
| 1792 | మద్రాసు, బొంబాయి | |
| 1803 | బొంబాయి | |
| 1804 | ఉత్తర హిందూస్థానం | |
| 1807 | మద్రాసు | |
| 1813 | బొంబాయి | |
| 1823 | మద్రాసు | |
| 1833 | ,, | ఒక్క గుంటూరుజిల్లాలో 5 లక్షల జనాభాలో 2 లక్షలు నశించింది. మద్రాసు, మచిలీపట్టణం నెల్లూరు పరిసరాలలో అంత్యకర్మలు చేసే వారుకూడ లేక శవాలు కుళ్లాయి. |
| 1837 | ఉత్తర హిందూస్థానం | 8 లక్షలు |
| 1854 | మద్రాసు | |
| 1860 | ఉత్తర హిందూస్థానం | 2 లక్షలు |
| 1866 | మద్రాసు, ఒరిస్సా | ఒరిస్సా 10 లక్షలు అంటే మూడో వంతు జనాభా నశించింది. మద్రాసులో $4\frac{1}{2}$ లక్షలు. |
| 1869 | ఉత్తర హిందూస్థానం | $12\frac{1}{2}$ లక్షలు |
| 1874 | బెంగాలు | |
| 1877 | మద్రాసు | $52\frac{1}{2}$ లక్షలు |
| 1889 | మద్రాసు, ఒరిస్సా | |
| 1892 | మద్రాసు బెంగాలు రాజపుటాన | |
| 1896—7 | ఉత్తర హిందూస్థానం బెంగాలు, మద్రాసు, బొంబాయి | |
| 1899—1900 | ఉత్తర హిందూస్థానం మధ్యరాష్ట్రాలు, బొంబాయి | ఇలాంటి క్షామం కనీ విని ఎరగరు. |
| 1892—7 | బర్మా | |

ఇలాంటి పరిపాలన సాగుతున్నకాలంలో రైల్వేలు, ముద్రణాయంత్రం మొదలైన మూడు నాలుగు మంచిపనులు జరిగాయంటే, అవి అనివార్యంగా, బ్రిటన్‌కు ఇష్టంలేకుండా వచ్చినవే. యంత్రోత్పన్నమైన సరకులను ప్రవేశపెడుతున్నప్పుడు వాటికి సంబంధించిన నాగరికతభావాలు సంస్కృతి కొంత నిషేధించక తప్పదు. అది కాస్త మేలుకూడ జరగకుండా ఉండటానికి బ్రిటిష్‌వారు శాయశక్తుల ప్రయత్నించారు. ఈ క్రిందిసంఘటనవింటే వారు ఎంత భగీరథ, ప్రయత్నంచేసింది స్పష్టమవుతుంది.

హైదరాబాదు నవాబు ఒకసారి యూరపియనుల యంత్రాలను చూడాలనివుందని బ్రిటిష రెసిడింటుతో అన్నాడట. సరేనని అతడు ఒక గాలిపంపు, ముద్రణాయంత్రం తెప్పించి కానుకగాయిచ్చాడు. నవాబు తన కరుణావీక్షణం వాటిమీదవరపి తరవాత వాటిని బహూకృత వస్తుభాండాగారంలో పారవేయించాడు. ఈసంగతి ఎలాగోపొక్కి మెల్ల మెల్లగా కలకత్తాలో ఉన్న కేంద్రప్రభుత్వానికి చేరింది. వెంటనే అది గట్టిగా మందలిస్తూ రెసిడెంటుకు ఉత్తరం వ్రాసింది. "ఎటుదిరిగి చేయిదాటిపోయింది. కేంద్రప్రభుత్వంవాడు ఒప్పుకుంటే నవాబుకు తెలియకుండా ముద్రాణాయంత్రాన్ని పాడుచేయించగల"నని అతడు ప్రభుత్వానికి వ్రాశాడట.

రైలుమార్గాలు వెయ్యటంకూడా తమసరకులను చౌకగా దేశంలోని మూలమూలకు చేరవేయటం, తిరుగుబాటు బయలుదేరితే ఆ ప్రాంతాలకు సైన్యాలను చేరవేయటం ముఖ్యమై వేశారు. ఈ వేయటంలోకూడా ఇండియానుంచి ఎంత పిండటానికి వీలవుతుందో అంతా పిండారు. బ్రిటిష్ కంపెనీలకు నూటికి సాలీన 5 రూపాయలు లాభంచూపించే షరతులో కంట్రాక్టు ఇచ్చారు. ఆ కంపెనీలు ఇందియాలో దొరికేవాటినికూడా బ్రిటన్‌లోనే ఎక్కువ ధరలకుకొని ఇండియాకు పంపించారు.

బ్రిటిష్ ప్రభుత్వం ఇండియా అంతటా వ్యాపించి ప్రభుత్వపత్రాలు మొదలైనవి ముద్రించు కోవటం అవసరమై గత్యంతరంలేక ముద్రణయంత్రం కలకత్తా మద్రాసు బొంబాయివంటి రాష్ట్రకేంద్రాలలో నెలకొల్పింది. వ్యక్తులు, భారతీయసంస్థలు ఈ యంత్రాన్ని వాడకుండా చేయటానికి పెట్టవలసిన ఆంక్షలన్నీ పెట్టారు. కాని రాను రాను మిషనరీలు బయలుదేరి ముద్రణాయంత్రం వ్యాప్తికి తోడ్పడ్డారు. బాప్టిస్టు మిషనరీలు మొట్టమొదటసారిగా ముద్రణా యంత్రం శ్రీరాంపూరులో పెట్టారు. ఇండియాలో మొట్టమొదటి వార్తాపత్రిక ఒక ఆంగ్లేయుడు 1780 లో కలకత్తానుంచి ప్రకటించాడు.

ఆంగ్లవిద్యకూడా ప్రభుత్వం గుమస్తాలను సంపాదించటంకోసమని ప్రవేశపెట్టి విశ్వవిద్యాలయాలను నెలకొల్పింది. అంతకుముందు ఉంటున్న దేశభాషలలో విద్యాప్రదానం ఉచితంగా జరుగుతుండేది. కొన్ని కొన్ని సంస్థలను రాజులు పోషిస్తూవుండేవారు. వాటికి మాన్యాలు ఉండేవి. బ్రిటిష్‌వారికి అధికారం సంక్రమించగానే ఈస్టుఇండియా కంపెనీవారు డబ్బుకు వత్తిడిచేయటంవల్ల ఈ మాన్యాలను చాలవరకు అపహరించటం జరిగింది. ఈ చర్యవల్ల ఎన్నో విద్యాసంస్థలు బెంగాలులో అంతరించాయి. ఇతర ప్రాంతాలలోకూడా దేశభాషలకు తీరని అపకారం జరిగింది. దానితో అవిద్య ప్రబలిపోయింది.

ఈనాడు దేశంలో 601 స్వదేశ సంస్థానాలున్నాయి. ఇందులో ఏ 40 సంస్థానాలోతప, మిగతావన్నీ ఈస్టిండియా కంపెనీ ఇండియాలో అడుగుపెట్టినరోజుల్లో ఏర్పడినవే. 19 వ శతాబ్ది ప్రారంభంలో కంపెనీవారు ప్రజలతో నిమిత్తంలేకుండా యుద్ధసందర్భాలలో చేసుకొన్నసంధులనుబట్టో తరువాత చేసుకొన్న సంధులనుబట్టో యిన్ని సంస్థానాలువచ్చాయి. కంపెనీనుంచి బ్రిటిష్ పార్లమెంటు పుచ్చుకొని ఇండియాను బ్రిటిష్ సామ్రాజ్యంలో చేర్చినప్పుడు బ్రిటిష్ ప్రభుత్వంతో నేరుగా సంబంధాలున్న సంస్థానాలు 40 కంటె ఎక్కువ లేవు. 1857 స్వాతంత్ర్య సమరంవల్లకలిగిన అనుభవంతో బ్రిటిష్‌ప్రభుత్వం ఇండియాలో ప్రాపకం సంపాదించుకోటానికని అంతరిస్తూవున్న సంస్థానాలకు జీవంపోసి, నిలిపింది. ఈవిషయాన్నిగూర్చి వ్రాస్తూ ఎడ్వర్డ్ థామ్సన్ యిలా అన్నాడు :

"అల్లకల్లోలంలో మునిగిపోయిన సంస్థానాధీశ్వరులను పైకిలేవనెత్తి ఈస్టుఇండియా కంపెనీ పదవులలో నిలబెట్టింది. పదవులలో నిలబెట్టేనాటికి ఈ సంస్థానాధిపతులు కేవలం నిస్పృహాయంగా దుర్బలంగా ఉన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం జోక్యంకలిగించుకొని ఉండకపోతే, రాజపుత్ర సంస్థానాలకు వినాశము, మహారాష్ట్ర సంస్థానాలకు విచ్ఛేదం ప్రాప్తించక తప్పేదికాదు. ఇక హైదరాబాదువంటి సంస్థానాలుండటం అనేది కేవలం బోగస్. ఆవతల అండగాఉన్న ప్రభుత్వం గాలిపోసి నిజంగా ప్రాణంవున్నది చూడండని చూపెడుతున్నది."

ఇలా సాంఘికంగా, ఆర్థికంగా బ్రిటిష్ ప్రభుత్వం ఇండియాను తల్లకిందులు చేసివేసింది. దేశంలో రైల్వేలు, ఆంగ్లవిద్య, ముద్రణాయంత్రం, అవిద్య దారిద్ర్యం ప్రబలుతున్నకొలది అసంతృప్తి, బ్రిటన్‌పై విద్వేషం, జాతీయభావం, నూతనవిప్లవభావాలు, ప్రబలంకాసాగాయి. బ్రిటిష్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిర్దాక్షిణ్యంగా అణచివేయసాగింది.

ఇది యిలావుండగా యూరప్‌లో పారిశ్రామికంగా అంతవరకు వెనుకబడివున్న దేశాలు తమ స్వాతంత్ర్యాన్ని వినియోగించుకొని 19 వ శతాబ్ది మధ్యభాగానికి పూర్తిగా పెట్టుబడిదారీ దేశాలయ్యాయి. ఈ దేశాలు దొరికినంతవరకు వలసరాజ్యాలను సంపాదించుకొని కూర్చున్నాయి. పెట్టుబడిదారీవిధానం పెరిగినకొలదికీ మార్కెట్లుకూడా అధికంగాకావాలి. అందువల్ల ఒకరి వలసరాజ్యాలను మరొకరు ఆక్రమించుకోటంకన్నా గత్యంతరంలేదు. అందువల్ల సామ్రాజ్య దేశాలకు పరస్పరయుద్ధం వాటిల్లకతప్పదు. యూరప్‌లో 20 వ శతాబ్ది ప్రారంభంనుంచి జర్మనీ బ్రిటన్ దేశాలకు వైషమ్యాలు ముదరసాగాయి. సామ్రాజ్య దేశానికి దూరంగా ఎక్కడోఉన్న వలసరాజ్యాలను కాపాడుకోవాలంటే వలసరాజ్యాలలో ఆధునిక యుద్ధానికి కావలసిన పరిశ్రమలను అభివృద్ధిచేయటం అవసరం. అక్కడిప్రజల సానుభూతి సహకారాలను సంపాదించటంకూడా అవసరమే. అయితే వలసరాజ్యాలలో పరిశ్రమలను నెలకొల్పటమన్నా, బాధ్యతాయుత ప్రభుత్వం స్థాపించటమన్నా తమ సామ్రాజ్యాన్ని తామే అంతరింపజేసుకోవటం అవుతుంది. తరువాత మరొకవిషయంకూడా గమనించవలసివుంది. పెట్టుబడికి జాతులు, దేశాలు, మతాలు అడ్డురావు. కూలీచౌకగా, లాభం ఎక్కువగా కనిపించేచోటికల్లా అది ప్రవహిస్తుంది.

అందువల్ల బ్రిటిష్‌వారు తమకిష్టంలేకపోయినా ఇండియాలో 20 వ శతాబ్ది ప్రారంభమైన తరువాత పరిశ్రమలు తలఎత్తటానికి కొంచెంగా అవకాశమిచ్చారు. విదేశాలనుంచి యంత్రాలను దిగుమతిచేసికోరాదని 1860 లో ప్రవేశపెట్టిన నిషేధాన్ని రద్దుచేశారు. బెంగాలులో మెల్లగా బ్రిటిష్ పెట్టుబడితో జనపనార యంత్రాలు బయలుదేరాయి. తరువాత మెల్లగా అహమ్మదాబాదు బట్టలుమిల్లులు పొడసూపాయి. 1911 లో జంషెడ్జీ టాటా అయిరన్ అండ్ స్టీల్ వర్క్సు అమెరికన్ నిపుణుల సహకారంతో ప్రారంభించాడు. కాని బ్రిటిష్ ప్రభుత్వం ఎన్నివిధాల అటకాయించాలో అన్నివిధాల అటకాయించింది. దీనితో లిక్విడేషన్‌కు వచ్చేఅంత పరిస్థితి అయింది. దేశంలో అలజడి బయలుదేరటంతో అది ఆగిపోయింది. ఇంతలో ప్రథమ ప్రపంచసంగ్రామంవచ్చి ఆదుకొన్నది.

ఈ ప్రపంచయుద్ధంమూలాన బ్రిటిష్ పెట్టుబడి కొంత నాశనమైపోయింది. స్వదేశంలోని పరిశ్రమలను నూతన పరిశోధనల ననుసరించి సంస్కరించుకోవలసి వచ్చింది. అంటే దాదాపు పరిశ్రమాగారాలన్నిటిలోను సరికొత్త యంత్రాలను నెలకొల్పుకోవలసివచ్చింది. అందువల్ల బ్రిటన్ ఇండియాకు పెట్టుబడి ఎగుమతిచేసి పూర్వంలోలాగా విపరీతలాభాలు సంపాదించే అవకాశం తగ్గింది. ఈ లోటును భర్తీచేసుకోవాలన్న ఉద్దేశంతోను, జపాను మొదలైన ఇతర పెట్టుబడిదారీ దేశాలు అపహరించకుండా ఇండియాను కాపాడుకోవాలన్న దృష్టితోను బ్రిటన్ పారిశ్రామికాధినేతలకు కొలదిగా అవకాశాలు కల్పించింది.

ఈలోపున కాంగ్రెస్ గాంధిజీ నాయకత్వాన బ్రహ్మాండమైన రాజకీయపక్షంగా తయారవుతూ వచ్చింది. కాంగ్రెస్ నాయకుల సింహగర్జనలతో ప్రబోధ శంఖారావాలతో నిద్రాణవుగా ఉంటున్నజాతి నూతనచైతన్యంపొంది 1920, 30 ఉద్యమాలు సాగించింది. ఎందరో దేశభక్తులు అపూర్వత్యాగాలుచేశారు. లక్షలాదిప్రజలు జైళ్ళకువెళ్ళారు. దేశమం దంతటా స్వాతంత్ర్యం స్వాతంత్ర్యమన్న వీరనినాదాలు బయలుదేరాయి.

దీనిఫలితంగా 1935 రాజ్యాంగచట్టం బయలుదేరింది. ఇదికూడా "ఛార్టర్ ఆఫ్ స్లేవరీ" అని జాతీయనాయకులంతా నిరసించారు. ఈ చట్టంతోనే స్వదేశ సంస్థానాలను ఇండియా ప్రభుత్వంక్రిందినుంచి మార్చారు. కొత్తగా పొలిటికల్ డిపార్టుమెంటు అన్న శాఖను ఏర్పరచి సంస్థానాలపై దీనికి ఆధిపత్యం ఇచ్చారు. ఇది నేరుగా వైస్రాయి ఆధిపత్యాన పనిచేస్తుంది. అంటే ఈ శాఖపై వైస్రాయి కార్యనిర్వాహక సంఘానికి ఎలాంటి అధికారం ఉండదు. ఈ కుతంత్రంతో స్వదేశ సంస్థానాలకు కాళ్ళుతెచ్చి ఒకపెద్ద సమస్యను బ్రిటిష్ ప్రభుత్వం సృష్టించింది. జాతీయ ఉద్యమంలో చీలికలుతెచ్చి ప్రాపకం సంపాదించుకోటానికి 1909 లో ప్రత్యేక నియోజకవర్గాలను నెలకొల్పింది. మతనియోజకవర్గాలలోఉన్న ప్రమాదాలను వివరిస్తూ మాంటేగ్‌చలమ్స్‌ఫర్డు నివేదికలో ఇలావ్రాశారు:—"మతాలనుబట్టి, వర్గాలనుబట్టి విభజించటమంటే పరస్పరం దెబ్బలాటకుదిగే రాజకీయపక్షాలను సృష్టించటమౌతుంది. ఈపద్ధతి సంకుచిత దృష్టితో ఆలోచించేటట్లు చేస్తుందికాని, తాను భారతీయ పౌరుడనన్న దృష్టితో ఆలోచించటానికి తావివ్వదు....ఎలాంటి మతనియోజకవర్గాలైనా స్వపరిపాలనా సిద్ధాంత వికాసానికి ప్రబలనిరోధకమవుతుందని మేము భావిస్తున్నాము."


ఇలాంటి కుతంత్రాలతో బ్రిటిష్ ప్రభుత్వం ఇండియాలో తన అధికారాన్ని నిలబెట్టుకోటానికి ప్రయత్నిస్తూవచ్చింది. కాని జాతీయఉద్యమాన్ని ఇవి ఏవీ అరికట్టలేకపోయాయి. ముస్లింలీగ్ బిలిసి కూర్చుంది. సంస్థానాధిపతులు బిర్రబిగుసుకోసాగారు. అయినా కాంగ్రెస్‌పార్టీ నానాటికి ప్రబలతరం కాసాగింది.

ఇంతలో ద్వితీయ ప్రపంచసంగ్రామం ప్రారంభమైంది. బ్రిటిష్ ప్రభుత్వం యుద్ధంలో తన ఆదర్శాలను స్పష్టంగా ప్రకటించనిదే, ఇండియా యుద్ధానికి సహాయంచేయజాలదని కాంగ్రెస్ పట్టుపట్టింది. ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించి జాతీయనాయకులను నిర్బంధంలో ఉంచింది. దానితో ప్రజల్లో విప్లవం బయలుదేరింది. ముందువెనుకలు చూడకుండా ప్రభుత్వం ప్రజలపట్ల ఘోరంగా వ్యవహరించింది. నిర్దాక్షిణ్యంగా అందినంతవరకు సరకులను ఇండియా నుంచి యుద్ధరంగాలకు, బ్రిటన్‌కు చేరవేసుకొన్నది. ఈవిధానం ఫలితంగానే బెంగాల్‌లో ఘోర క్షామంవచ్చింది.

అయితే యీ యుద్ధంవల్ల బ్రిటన్‌కు ఇండియా మొదలైన వలసరాజ్యాలలోని పెట్టుబడులు దాదాపు ముప్పాతికపైగా అంతరించాయి. దానివల్ల లోగడ విపరీతంగా దోచుకొంటువచ్చిన మొత్తాలు చాలవరకు కరిగిపోయాయి. అంతేకాదు ఇండియా జాతీయఋణం తీరిపోవటమేకాక బ్రిటను కొన్నివందల మిలియన్ల పౌనులు అప్పుపడింది. ఈజిప్టు, కెనడా, అర్జెంటైనా, ఆస్ట్రేలియా, అమెరికా మొదలైన దేశాలకు విపరీతంగా బాకీలుపడ్డది. ఈ బాకీలు తీర్చుకోవాలన్నా, బీవరిడ్జి ప్లానులో సూచించినట్లు కాకపోయినా, యుద్ధాత్పూర్వంలోలాగా బ్రతకాలన్నా సరకులు విరివిగా ఉత్పత్తిచేసి అమ్ముకోవాలి. ఉత్పత్తి పెరగాలంటే కార్మికబలం వుండాలి. మార్కెట్లలో సానుభూతి వుండాలి. అందువల్ల ఇతరదేశాలలో వుంచిన అంగబలాన్ని ఉపసంహరించుకొని తద్వారా వలసరాజ్యాల సానుభూతి సంపాదించుకోవాలి. పైగా తమ పెట్టుబడులుపోయి వాటితోపాటు లాభాలు అంతరించిన దేశాలను తమక్రింద వుంచుకోవటంవల్ల ప్రయోజనంలేదు. పైగా ఈ యుద్ధంతో అమెరికా బలవత్తరమై పోటీచేయటానికి సిద్ధంగా వుంది. ఇండియాలో జాతీయపక్షం హుంకరిస్తూవుంది. ఇది యిలావుండగా ప్రపంచ అగ్రరాజ్యాలలో బలవత్తరశక్తిగారాటుతేలిన సోవియట్ రష్యా సామ్రాజ్యవిధానంపై కత్తులు దూస్తూవుంది.

ఇలాంటిపరిస్థితులలో బ్రిటిష్ ప్రభుత్వం విధిలేక ఇండియానుంచి నిష్క్రమిస్తూవుంది. చరిత్రనేర్పిన యీ పాఠాన్ని సమగ్రంగా విశాలదృష్టితో పరిశీలించి అర్థంచేసుకొని వ్యవహరించిననాడు ఇండియాకు ప్రపంచరాజ్యాలలో ఉత్తమస్థానం లభించకమానదు. యుద్ధభయ పరిపద్యమాన ప్రపంచానికి ఇండియా నూతన ఆశాజ్యోతి కాకపోదు.





అలన్ ఆక్టేవియన్ హ్యూమ్
భారతమిత్రుడు, భారత కాంగ్రెస్ వ్యవస్థాపకుడు




అఖిలభారత జాతీయ కాంగ్రెసుచరిత్ర వాస్తవంగా భారతస్వాతంత్ర్య సమరగాధే. ప్రప్రధమ బ్రిటిష్ వ్యాపారనౌక భారతసముద్రతీరాన్ని చేరిన నూటయాభై సంవత్సరాలకు మనదేశం బ్రిటిష్‌సామ్రాజ్య అంతర్భాగమైంది. తరువాత సరిగ్గా ఒకశతాబ్దం పూర్తిఅయ్యేసరికి బ్రిటిష్ ఆధిపత్యాన్ని అంతమొందించడానికి బ్రహ్మాండమైన దేశవ్యాప్త సాయుధవిప్లవం ప్రజ్వరిల్లింది. అయితే అప్పటికి బ్రిటిష్‌వారు దేశంలో బాగా పాతుకుపోయినందువల్ల, విభజించి పాలించేవిధానం పూర్తిగా సఫలమై దేశంలో అంతఃకలహాలు పరస్పరవైషమ్యాలూ తీవ్రంగా పెరిగిపోయినందువల్లా 1857 విప్లవం ఫలప్రదం కాలేదు. కాని ఈ సంఘటన బ్రిటిష్‌వారికి మంచిపాఠం నేర్పింది. కుంపిణీరాజ్యంపోయి బ్రిటిష్‌పార్లమెంటు అజ్మాయిషీన దేశపరిపాలన ప్రారంభమైంది. 1858 వ సంవత్సరంలో విక్టోరియా మనకు మహారాణి అయింది. అంతవరకూ గవర్నరు జనరలుగాఉంటున్న అధికారి రాజప్రతినిధి అయినాడు.

విక్టోరియా మహారాణి పట్టాభిషేక మహోత్సవసందర్భంలో 1858 నవంబరు 1 వ తేదీన అలహాబాద్‌లో దర్బారు జరిగింది. భారతదేశంలో బ్రిటిష్‌విధానాన్నీ, బ్రిటిష్‌లక్ష్యాన్నీ విస్పష్టం చేస్తూ విక్టోరియారాణి చేసినప్రకటనను ఆ దర్బారులో వెల్లడించారు. "భారతీయుల సౌఖ్యం, సౌభాగ్యాలే మనకు బలం; వారు సంతుష్టులైతేనే మనకు క్షేమం; వారి కృతజ్ఞతే మనకు ఉచితమైన, ఘనమైన పారితోషికం. అర్హులైన మనప్రజలకు జాతి, వర్ణవివక్షతను పాటింపక మనకొలువులో సేవచేయడానికి అందరితోబాటు వారికీ సమానమైన అవకాశాలు కల్పించాలనే మన అభిమతం" అని విక్టోరియామహారాణి చరిత్రాత్మకమైన ఆ ప్రకటనలో స్పష్టంచేసింది.

భారతదేశంతో బ్రిటిష్‌వ్యాపారసంబంధం ఎలిజబత్‌రాణి హయాములో ఏర్పడింది. విక్టోరియామహారాణిశకం వచ్చేసరికి ఆసంబంధం పూర్తిగాపోయి రాజకీయసంబంధం ఏర్పడింది. ఈ కొత్తసంబంధం బ్రిటిష్‌వ్యాపార విస్తరణకు, అభివృద్ధికీ బాగా ఉపయోగపడింది. బ్రిటన్‌లో తిరిగి రాణీపరిపాలన, అందులోనూ ఎలిజబెత్‌రాణి పరిపాలన, ప్రారంభం అయ్యేసూచనలు కన్పించేసరికి భారతదేశం పారతంత్ర్యావస్థనుండి బయటపడి బ్రిటన్‌తో సరిసమానస్థాయిని హోదాను పొందింది.

సరిగ్గా 190 సంవత్సరాలక్రితం 1757 వ సంవత్సరంలో ప్లాసియుద్ధం బ్రిటిష్‌వారికి అనుకూలంగా పరిసమాప్తం కావడంతో మనదేశంలో బ్రిటిష్‌పరిపాలన, ఆధిపత్యం స్థిరపడిపోయింది. ఆ తరువాత ఒక శతాబ్దానికి ప్రథమస్వాతంత్ర్య సమరం సాగింది. రెండోశతాబ్దం పూర్తికావచ్చేసరికి భారతదేశం సంపూర్ణస్వాతంత్ర్యాన్ని పొందింది.

సిపాయివిప్లవం విఫలమైనతరువాత అయిదు పుష్కరాలవరకూ చెప్పుకోతగ్గ స్వాతంత్ర్య పోరాటం ఏమీ సాగలేదు. ఈలోపున జాతీయచైతన్యం, స్వాతంత్ర్యతృష్ణ క్రమంగా పెరుగుతూవచ్చింది. ఈ జాతీయవికాసం, రాజకీయచైతన్యం ప్రమాదకరమైనపథాలను అనుసరించకుండా బ్రిటిష్‌వారు తగిన కట్టుదిట్టాలు చేశారు.

శ్రీ పండితారాధ్యుల నాగేశ్వరరావు

ఆయనఉద్దేశం ఏమైనప్పటికీ ఆయనలక్ష్యం ఏమైనప్పటికీ, 1885 వ సంవత్సరంలో రాజప్రతినిధిగాఉన్న లార్డుడఫరిన్ అప్పుడే బ్రిటిష్‌కొలువులో మూడు దశాబ్దాలు పనిచేసి పని మానుకున్న ఎ. ఒ. హ్యూమును సాధనగా ఉపయోగించుకొని ఇప్పటి అఖిలభారతజాతీయ కాంగ్రెసుకు బునాదులు వేశాడు.



డబ్ల్యు. సి.
బెనర్జీ
బొంబాయి :
1885
అలహాబాదు :
1892

బొంబయిలోని గోకుల్దాస్ తేజ్ పాల్ సంస్కృతకళాశాలలో డిసెంబరు 28 వ తేదీన ఉమేశచంద్ర బెనర్జీ అధ్యక్షతను ప్రథమకాంగ్రెసు మహాసభ జరిగింది. ఈ సమావేశానికి ఏర్పాట్లు, కార్యక్రమంఅంతా ఆ క్రితం సంవత్సరం మద్రాసులో జరిగిన దివ్యజ్ఞానమహాసభ సందర్భంలో నిర్ణయమైంది. ఈ కాంగ్రెసుమహాసభను జరపడానికి అవసరమైన సన్నాహాలు చేసేందుకు దివాన్‌బహదూర్ రఘునాధరావు గారిఇంట్లో కొంతమందిచేరి ఒక కమిటీని ఏర్పాటుచేశారు. ఆ కమిటీలో మద్రాసు ప్రతినిధులు ముగ్గురున్నారు. అందులో ఇద్దరు తెలుగువారు. పి. రంగయ్యనాయుడుగారు, పి. ఆనందాచార్యులుగారు. ఆనందాచార్యులుగారు తరువాత కాంగ్రెస్ అధ్యక్షులైనారుకూడా. అప్పటికి, ఇప్పటికీ కాంగ్రెసు అధ్యక్షుడైన తెలుగువాడు ఆయన ఒక్కడే.

★

అరవై సంవత్సరాలక్రితం అతి సామాన్య సాధారణలక్ష్యాలతో ఏర్పడిన కాంగ్రెసు ఇంత శక్తివంతమై, బ్రిటిష్‌సామ్రాజ్యాన్ని లొంగదీసి, అటంబాంబుయుగంలో ఆయుధబలంతో నిమిత్తంలేక, అహింసామార్గాన స్వాతంత్ర్యాన్ని ఇంత కొద్దికాలంలో సంపాదించకలుగుతుందని ఎవ్వరూ కలలోనైనా అనుకొని ఉండరు.

మొదటిసమావేశానికి అధ్యక్షతవహించిన బెనర్జీకాంగ్రెసులక్ష్యాన్ని ఈవిధంగా వివరించారు :

స్వదేశంకొరకు పాటుబడేవారు స్వయంగా ఒకర్నొకరు తెలుసుకోవడానికి ఈ సమావేశాలు ఉపకరించాలి. వివిధప్రాంతాలవారిమధ్య, వివిధవర్గాలవారి మధ్య స్నేహసాంగత్యాలు పెంపొందేటట్లు చేయాలి. జాతి, మత, ప్రాంతీయ దురభిమానాలనుపోగొట్టి జాతీయ ఐక్యభావాలను దిట్టపరచి అధికంగా వికసింపచేయాలి. ప్రధానమైన సాంఘికసమస్యలపై విద్యావంతుల పరిణతాభిప్రాయాలను చర్చించుకొన్నమీదట, ఆ అభిప్రాయాలను లిఖితపూర్వకంగా నమోదుచేసి పై అధికారులకు నివేదించాలి. ప్రజాశ్రేయస్సుకు ఏలాంటి కార్యవిధానాలను అనుసరించుతూ ఉండాలో నిర్ణయించుకొని ఆప్రకారం నడుచుకుంటూ దేశాన్ని నడుపుతూఉండాలి.



దాదాభాయి
నౌరోజీ
కలకత్తా :
1886–1906
లాహోరు : 1893

ఈ సమావేశంలో ఏ విషయాలనుగురించి అయినా మొత్తంమీద తొమ్మిది తీర్మానాలు చేశారు. భారతదేశ వ్యవహారాలవిచారణకు ఒక రాయల్‌కమీషన్‌ను ఏర్పాటు చేయవలసిందనీ, ఇండియా కార్యదర్శి ఉద్యోగాన్ని రద్దుచేయాలనీ, శాసనసభల్లో ప్రజలు ఎన్నుకున్నసభ్యులకు కొంత ప్రాతినిధ్యం ఉండేందుకు

వీలుగా శాసనసభలచట్టాన్ని సవరించాలనీ, ప్రతిసంవత్సరం జమాఖర్చు అంచనాలను శాసనసభలో చర్చకు తీసుకురావాలనీ, అధికారసభ్యుల వివిధవిషయాలపై ప్రశ్నలువేసే అధికారం, హక్కు అనధికారసభ్యులకు కలిగించాలనీ పైవారివి కోరుతూ తీర్మానాలు చేశారు.

ఈ బొంబై సమావేశానికి దాదాపు అన్నిప్రాంతాలనుంచీ 72 మంది ప్రతినిధులు వచ్చారు. ఇందులో ఇద్దరు తెలుగువారున్నారు. పి. ఆనందాచార్యులుగారూ, దివాన్‌బహదూర్ పి. కేశవపిళ్లైగారు. కేశవపిళ్ళైగారు అనంతపురం జిల్లావారు.



బద్రుద్దీన్ తయ్యాబ్జీ
మద్రాసు: 1887

రెండవ కాంగ్రెస్ మహాసభ 1886 వ సంవత్సరంలో దాదాభాయ్ నౌరోజీ అధ్యక్షతను కలకత్తాలో జరిగింది. ఏడాదిలోనే ఈసంస్థ ప్రాపకం, ప్రాబల్యం కొంత పెరిగింది. అన్నిప్రాంతాలనుంచీ 440 మంది ప్రతినిధులు వచ్చారు. వేలాది ప్రేక్షకులూ ఈ సమావేశంలో పాల్గొన్నారు. అప్పటికి బ్రిటిష్ సామ్రాజ్య ఆర్థికవిధాన ఫలితంగా ప్రజలు దరిద్రులైపోయారు. అంచేతనే నౌరోజీ తన అధ్యక్షోపన్యాసంలోనూ, సమావేశం తన తీర్మానాల్లోనూ ఆర్థికవిషయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. సైన్యంలో చేరడానికి భారతీయులకు అవకాశంఇవ్వక జాతిని నిర్వీర్యంచేస్తున్నారనీ, సైన్యానికితగినజాతి, సైన్యానికి తగనిజాతి అనే విచక్షణను రద్దుచేసి సేనలో చేరడానికి భారతీయులు అందరికీ అవకాశం ఇవ్వాలనీ ఆ సమావేశంలోనే రాజారామ్‌పాల్ ఉద్రేకంతో ఉపన్యాసం చేశాడు. స్వచ్ఛందసైనికదళాన్ని కాంగ్రెస్ యాజమాన్యాన ఏర్పాటుచేయాలని ఈయన సూచించాడు.

ఇంచుమించు ఇంత ఉత్సాహ, ఉద్రేకాలతోనూ ఆర్థికపరిస్థితులనుగురించి శాసనాల తయారీనిగురించీ మౌల్వీ సయ్యద్‌షర్ఫుద్దీన్ ఉపన్యసించారు. మన ఆచార వ్యవహారాల, మన సంప్రదాయాల పరిజ్ఞానంగలవారు, మనసంగతి సందర్భాలు తెలిసినవారు, మనలోచేరినవారు మనకు అవసరమైన శాసనాలు చేయాలి. వారి సంకల్పాలు ఎంత ఉన్నతమైనవి, ఉదాత్తమైనవి అయినప్పటికీ పరదేశాలవారు మనకు శాసనాలుచేయడం, మనలను శాసించడంతగదు; కూడదు" అని షర్ఫుద్దీన్ ఘోషించాడు. ప్రజల ఆర్థికస్థితి నానాటికీ అధ్వాన్నమౌతూ ఉందనీ, అందుకు హేతువులను విచారించడానికి, నివారణోపాయాలను సూచించడానికి ప్రజాప్రాతినిధ్యంగల సంఘాలను నెలకొల్పాలని కాంగ్రెస్ తీర్మానించింది. న్యాయశాఖను, ఎగ్జిక్యుటివ్‌శాఖను వేరుచేయాలని వేరొకతీర్మానంకూడా చేసింది. పండిత మదనమోహన మాలవ్యా ఈ సమావేశానికి హాజరైనాడు. గంభీరోపన్యాసంతోటి ప్రజలను ముగ్ధులనుచేశాడు.



జార్జియూ
అలహాబా
1888

అప్పట్లో భారతదేశానికి మూడే రాజధానీనగరాలు ఉండేవి. దేశంకూడా బొంబయి, కలకత్తా, (బెంగాల్) మద్రాసు రాజధానీలుగా ఉండేది. మొదటి



సర్ విల్లియం వెడ్డర్ బరన్

బొంబాయి : 1889

అలహాబాదు : 1910

రెండు సమావేశాలూ బొంబై, కలకత్తా నగరాల్లో జరిగినవి. మూడవ సమావేశం 1887 వ సంవత్సరంలో బద్రుద్దీన్ త్యాబ్జీ అధ్యక్షతను మద్రాసులో జరిగింది. కలకత్తా సమావేశంలో చేసిన తీర్మానాలనే పునరుద్ఘాటించారు. సైన్యంలోని పెద్ద ఉద్యోగాలు అర్హులైన భారతీయులుంటే వారికే ఇవ్వాలని కోరారు సైనికకళాశాలలను స్థాపించవలసిందనీ, భారతయువకులకు సైనికశిక్షణ ఇవ్వాలనీ సూచించారు. అప్పటికే ఈ జాతీయసంస్థనుండి మహమ్మదీయులను వేరుచేయాలనే ప్రయత్నం ప్రారంభమైంది. కాని ఆప్రయత్నం అంత సఫలంకాలేదు. ఆలీ మహమ్మద్ భీమ్జీ ఆయుధశాసనాన్ని రద్దుచేయాలనీ, భారతీయులు ఏలాంటి ఆయుధాలనూ ధరించరాదనీ, వాటిని ఉపయోగించరాదని శాసించడం జాతిగౌరవానికి భంగకరంగా ఉన్నదనీ, ఇలాంటి అవమానకరమైన శాసనం వెంటనే రద్దుకావాలనీ ప్రభుత్వానికి హెచ్చరికచేస్తూ ఉపన్యసించాడు. సాంకేతిక, శాస్త్రవిద్యల అభ్యసించడానికి అవకాశాలు కల్పించాలనీ, దేశీయ పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వాలనీ అధికారులను కోరుతూ మరికొన్ని తీర్మానాలుకూడా మద్రాసు సమావేశంలో చేశారు. కాంగ్రెస్ నియమావళిని తయారుచేయడానికికూడా నిశ్చయించారు. ఈ కాంగ్రెస్‌కు 600 మందికిపైగా ప్రతినిధులు వచ్చారు.

కాంగ్రెస్ క్రమంగా బలపడుతూవచ్చింది. ఈ జాతీయసంస్థ ఇలా శక్తివంతం కావడం అధికారులకు, దేశంలోని ఇతర ప్రతిపక్షాలకూ కన్నెర్ర అయింది. జాతీయశక్తుల విజృంభణాన్ని, జాతీయసంస్థ అభివృద్ధిని అరికట్టడానికి అధికారులు అప్పుడే ఎత్తులువేయసాగారు. ఏదో చదువుకున్న పదిమందిచేరిన చిన్నసంఘం అనీ, అంతగా లెక్కచేయతగింది కాదనీ, అసలు ఈసంస్థ స్థాపనకు కారకుడైన రాజప్రతినిధి లార్డ్ డఫరిన్ అనడం ప్రారంభించాడు. అధికారులవైఖరి పూర్తిగా మారిపోయింది. కనుకనే నాల్గవ కాంగ్రెస్‌ను అల్హాబాద్‌లో జరపడం కొంచెం కష్టమైంది. ఆరాష్ట్ర గవర్నరుకూడా కాంగ్రెస్ అంటే అంత సుముఖంగాలేడు. అయినా సభ జయప్రదంగా సాగింది.



సర్ పి. మెహతా

కలకత్తా : 1890

ఈదఫా కాంగ్రెస్‌ప్రతినిధులను, ఆయా ప్రాంతీయసంఘాలు ఎన్నుకొన్నవి. ఆవిధంగా ఎన్నికైన 1500 మంది ప్రతినిధులలోనూ అలహాబాదుసమావేశానికి 1248 మంది ప్రతినిధులు హాజరైనారు. జార్జి యూల్ అధ్యక్షతవహించారు. రైతుల ఆర్థికస్థితి చాలా దుర్భరంగాఉంది. పన్నుభారం ఎక్కువైంది. భూమిశిస్తు సెటిల్మెంటునుగురించి పూర్తివిచారణజరిపి సమగ్ర నివేదికలను పంపవలసిందిగా అధీనసంఘాలనుకోరుతూ తీర్మానాలు చేశారు. పోలీసులపద్ధతులు చాలా కఠినంగా ఉంటున్నవనీ, పోలీసుపరిపాలనగురించి విచారణ జరిపించాలనీ అధికారులను కోరారు.

ఈవిధంగా కాంగ్రెస్ ప్రజాసమస్యలవిషయమై ప్రత్యేక శ్రద్ధవహిస్తూ జనసామాన్యంలో పలుకుబడి సంపాదించింది. మద్యపానాన్ని నిషేధిస్తూ శాసనం చేయాలనికూడా ఈ సమావేశములోనే తీర్మానించారు.

మరుసంవత్సరం కాంగ్రెస్ తిరిగి బొంబయిలోనే సమావేశమైంది. విలియం వెడ్డర్బరన్ అధ్యక్షతవహించాడు. ఆ సంవత్సరంలో దారుణమైన క్షామంవల్ల ప్రజల్లో తీవ్రఅశాంతి ప్రబలింది. అధికారవర్గంలో అవిశ్వాసం ఏర్పడింది.

ప్రభుత్వం ప్రజల యోగక్షేమాలను విచారించడంలేదనే అసంతృప్తి ఎక్కువై పోయింది. ఈపరిస్థితుల్లో బొంబై కాంగ్రెస్ సమావేశమైంది. బ్రిటిష్ పార్లమెంటులో భారత స్వపరిపాలనకు సంబంధించి ఒకబిల్లును ప్రతిపాదించిన చార్లెస్ బ్రాడ్‌లా ఈ సమావేశానికి హాజరైనాడు. ఆ సంవత్సరానికి తగినట్టే సరిగ్గా 1889 మంది ప్రతినిధులు వచ్చారు. ఇంకముందు కాంగ్రెస్ మహాసభకు ప్రతినిధుల ఎన్నిక ఏపద్ధతిన జరుగవలసిందీ నిర్ణయించారు రెండులక్షల జనాభాకు ఒక ప్రతినిధివంతున పంపవచ్చునని తీర్మానించారు. ఈ సమావేశం బ్రాడ్లా ప్రసంగంతో ప్రసిద్ధి కెక్కింది. ఉత్తేజపూరితమైన ఉపన్యాసంచేశాడు. వివిధప్రాంతాల ప్రతినిధులు తమ తమ ప్రజలతరఫున ఈయనకు సన్మానపత్రాలు సమర్పించారు. తాను ప్రజల మనిషిననీ, ప్రజలకోసరం ప్రాణాలనైనా అర్పిస్తాననీ ప్రకటించాడు. ఈయనపేరనే లాహోరులో ఇప్పటికీ బ్రాడ్లాహాల్ఉంది. పంజాబ్‌రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కార్యాలయం ఈ భవంతిలోనే ఉంటున్నది.



పి. ఆనందాచార

నాగపూరు :

1891

★

ప్రభుత్వం కాంగ్రెస్ అభివృద్ధిని గుర్తించింది. మొగ్గగావుండగానే తుంచి వేయకపోతే మహా వృక్షమైనతరువాత పశ్చాత్తాపంచెంది ప్రయోజనం లేదను కున్నారు అధికారులు. కనుకనే కలకత్తాలో అరవ కాంగ్రెస్ సర్ ఫిరోజ్‌షా మెహతా అధ్యక్షతను సమావేశమౌతూవుంటే సభకు ప్రభుత్వ ఉద్యోగులు ఎవ్వరూ హాజరుకారాదని రాష్ట్రప్రభుత్వం తాఖీదు పంపింది తన తాబేదారులందరికీ. ఈ సమావేశంలో ఒక ముఖ్యమైన తీర్మానంచేశారు. 1892 వ సంవత్సరంలో లండన్లో ఒక భారతీయ ప్రతినిధులసభ జరపాలన్నారు. అప్పటికి బ్రిటన్‌లో కాంగ్రెస్‌తరఫున పనిచేస్తున్న ఒక కమిటీకి కొంతడబ్బు మంజూరుచేశారు. ఈ సమావేశానికి 677 గురుమాత్రమే వచ్చారు.

1906 వ సంవత్సరంవరకూ కాంగ్రెస్ సమావేశాలు ఇదేవిధంగా జరుగుతూ వచ్చాయి. తీర్మానాలు, అధ్యక్ష ప్రసంగాలు అన్నీ వినతులు, విజ్ఞప్తుల ఫక్కీలోనే నడిచినవి. కాని దేశపరిస్థితులుమాత్రం నానాటికీ అధ్వాన్నమవుతున్నవి. కరువులు, అంటువ్యాధులు ప్రజల నిర్జీవప్రతిమలుగా తయారుచేసినవి. ప్రభుత్వంకూడా ఏమీ పట్టించుకోలేదు. 1887 మొదలు 1899 వరకూ అడపా దడపా క్షామదేవతవచ్చి తొంగిచూచిపోతూనేవుంది. 1896 వ సంవత్సరంలో దుర్భిక్షం హద్దు మీరి పోయింది. ప్రజలు సరియైన తిండిలేక వ్యాధిగ్రస్తులైనారు. ప్లేగువ్యాధి దేశాన్ని చుట్టుముట్టింది. అయినా కాంగ్రెస్ సమావేశాలు వరసతప్పకుండా ఏటా జరుగు తూనేవచ్చాయి.



ఆల్‌ఫ్రెడ్ వెబ్

మద్రాసు :

1894



సురేంద్రనాథ్
బెనర్జీ
పూనా :
1895
అహమదాబాద్ :
1902

★



మహమ్మద్
రహింతుల్లా
కలకత్తా :
1896

ఏడవ కాంగ్రెస్ 1891 వ సంవత్సరంలో పి. ఆనందాచార్యులుగారు అధ్యక్షులుగా నాగపూర్‌లో జరిగింది. ప్రజల దుర్భర దారిద్ర్యం, దేశ ఆర్థికదుస్థితి, ఇవే కాంగ్రెస్ అవతరణ హేతువులని ఆనందాచార్యులుగారు తమ అధ్యక్ష ప్రసంగంలో వ్యక్తంచేశారు. కాంగ్రెస్ తీర్మానాలు ఇదేధోరణిలో వున్నాయి.

మరుసటి సంవత్సరం తిరిగి అల్లాబాద్‌లో ప్రథమ అధ్యక్షుడైన హ్యూమ్ అధ్యక్షతను వార్షికసభ జరిగింది. లోగడ కలకత్తా సమావేశంలో చేసినతీర్మానం ప్రకారం 1892 వ సంవత్సరంలో లండన్లో ఒక కాంగ్రెస్ సభను జరుపవలసి వుండెను. కాని ఆ ఏడాది బ్రిటన్‌లో ఎన్నికల కోలాహలం. ఆ సందడిలో భారతీయులమొర నాలకించేవారు వుండరని ఆ సభను వాయిదావేశారు. అయితే అప్పుడే రాజధాని శాసనసభల చట్టాన్ని సవరిస్తూ తాజాగా మరోశాసనం చేశారు. శాసనసభల్లో - బొంబయి, మద్రాసు, కలకత్తాలలో వుంటున్న చట్టసభలు - ఆరేడుగురు ప్రజలచే ఎన్నికైన సభ్యులకు ఇందువల్ల స్థానం లభించింది. అప్పటి వరకూ తమ ఇబ్బందులను నివేదించుకుందామంటే, తమప్రజలగోడును అధికారులకు వినిపిద్దామంటే సరియైన సాధనేలేదు. కాంగ్రెస్‌వారు లండన్లో "ఇండియా" అనే పత్రికను నడుపుతూ భారతదేశ స్థితిగతులను ఆ పత్రికద్వారా బ్రిటిష్‌ప్రజలకు తెలియచెప్తూ వుండేవారు. ఇప్పుడు ఈ శాసనసభలు ప్రజల ఇబ్బందుల తొలగించడానికి ఉపయోగపడకపోయినా, ప్రజల కష్టసుఖాలను చెప్పుకోవడానికైనా వీలుకలిగింది.

కాంగ్రెస్ తొమ్మిదవ వార్షికసభ లాహోరులో దాదాభాయినౌరోజీ అధ్యక్షతను జరిగింది. అప్పటి కీయన బ్రిటిష్ పార్లమెంటులో సభ్యుడైనాడు. భారతీయుడు బ్రిటిష్ పార్లమెంటుసభ్యుడు కావడం ఇదే మొదటిదఫా. మితవాదుల సభలే ఐనా బ్రిటిష్‌ప్రభుత్వపద్ధతులను తీవ్రంగానే విమర్శిస్తూ ఉండేవారు. లాహోరు కాంగ్రెస్ సమావేశంలోనే రాజారాంపాల్ బ్రిటిషువారు భారతదేశాన్ని కేవలంతమ వేటభూమిగా చేసుకొన్నారని ఘోషించాడు.

కాంగ్రెస్‌సంస్థ ఏర్పడి పదేళ్ళయింది. పదవ కాంగ్రెసు ఆల్‌ఫ్రెడ్‌వెబ్ అధ్యక్షతను మద్రాసులో జరిగింది. ఈ సమావేశంలోనే రైతులకు సంబంధించిన రెండు ప్రధానసమస్యలపై తీర్మానాలు చేసింది. ప్రభుత్వంవారు నీటితీరువను ఎకరానికి నాలుగురూపాయిలనుండి అయిదురూపాయిలకు పెంచారు. ఇది అన్యాయం అనీ ఇందువల్ల భారతవ్యవసాయం దెబ్బతినిపోతుందని కాంగ్రెస్ హెచ్చరించింది. భూమిశిస్తునుగురించికూడా ఇలాంటితీర్మానాన్నే చేసింది. ఈ సమావేశానికి 1163 ప్రతినిధులు హాజరైనారు.

సురేంద్రనాథబెనర్జీ అధ్యక్షతను 11 వ సమావేశం పూనాలో జరిగింది. మంచి వక్త, అనువుగా రెండుగంటలసేపు అధ్యక్షపీఠంనుండి దేశకాలపరిస్థితుల సమీక్షిస్తూ అనర్గళంగా ఉపన్యసించాడు. ఈ సమావేశంలో 1584 మంది ప్రతినిధులు

పాల్గొన్నారు. న్యాయవాదులను జిల్లాజడ్జీల తాబేదారులుగా చేయడాన్ని అధిక్షేపిస్తూ ఆ చట్టాన్ని ఉపసంహరించాలని కోరుతూ తీర్మానాలుచేశారు. రైళ్ళల్లో మూడవ తరగతి ప్రయాణీకుల ఇబ్బందులనువివరించి వాటిని తొలగించడానికి కృషిచేయాలనీ ప్రభుత్వం ఈవిషయమై శ్రద్ధవహించాలనీ హెచ్చరించారు. దక్షిణాఫ్రికాలోని భారతీయుల ఇబ్బందులకు విచారంతెలుపుతూనూ, దేశం వెలుపలజరిగే యుద్ధాల ఖర్చును భారతప్రజలపై వేయరాదని హెచ్చరిస్తూనూ మరికొన్నితీర్మానాలనుకూడా చేశారు. అప్పుడే కరువులో అధికమాసం అన్నట్లు ఆఫ్ఘన్ యుద్ధంకూడా ఆరంభమయింది.



సర్ సి. శంకరనాయర్

అమరావతి : 1897

1906 వ సంవత్సరం సూరత్‌లో జరిగిన చరిత్రాత్మక కాంగ్రెస్ సమావేశం వరకూ ఏటా ఇలాగే సమావేశాలుజరుగుతూ ఉంటం, వివిధసమస్యలపై తమ అభిప్రాయాలను ప్రకటించుతూ ఉండటం జరిగింది. కలకత్తాలో 1896లో జరిగిన కాంగ్రెసులో బొంబై, మద్రాసురాష్ట్రాల ప్రభుత్వాల్లో ప్రజాప్రతినిధులకు స్థానం ఇమ్మనికోరుతూ తీర్మానం చేశారు. ఈ సమావేశానికి రహింతుల్లా సయానీ అధ్యక్షుడు.

. 1897 వ సంవత్సరం వచ్చేసరికి దేశపరిస్థితులే పూర్తిగా మారిపోయినవి. ప్రభుత్వ నిర్బంధవిధానం ప్రారంభమయింది. విచారణలు జరుపకుండా రాజకీయ వాదులను నిర్బంధించడం మొదలైంది. ఎవరో వ్రాసినవ్యాసాన్ని తనపత్రికలో ప్రకటించినందుకు లోకమాన్య బాలగంగాధరతిలక్‌పై అధికారులు రాజద్రోహ నేరారోపణచేసి శిక్షించారు. పూనాలో ప్యూనిటివ్ పోలీసులను ఏర్పాటుచేశారు. క్రిమినల్‌లా 124 (ఎ) సెక్షను, 505 సెక్షను సవరణఅయింది. పూర్వంకంటే మరింత కఠినమయినవి. ఈ సంవత్సరం అమరావతిలో జరిగిన కాంగ్రెస్ సంఘటనలన్నింటినీ సమీక్షిస్తూ, నేరారోపణలేక నిర్బంధంలో ఉంచినవారినందరినీ విచారణకు తేవాలని అధికారులను కోరింది. ప్రభుత్వ నిరంకుశవిధానాన్ని తీవ్రంగా విమర్శిస్తూ సురేంద్రనాథబెనర్జీ చాలా ఘాటైన ఉపన్యాసంచేశారు. జాతి, జాతి అంతా విచారగ్రస్తమై, కన్నీరు కాలువలుకట్టేటంతా దుఃఖిస్తున్నదని ఘోషించారు. బ్రిటిష్‌పౌరులుగా భారతీయులకుగల వ్యక్తి స్వాతంత్ర్యానికి భంగం. కలిగించేచర్యలన్నింటినీ కాంగ్రెస్ ప్రతిఘటిస్తుందని హెచ్చరించాడు. చట్టబద్ధమయిన, శాసన సమ్మతమయిన అన్నిమార్గాలా ప్రధానమయిన ఈ వ్యక్తి స్వాతంత్ర్యాన్ని, సాధించడానికి సంరక్షించడానికి కంకణం కట్టుకోవాలని కాంగ్రెసుప్రతినిధులను హెచ్చరించాడు, ఈ సమావేశానికి సర్ శంకరన్ నాయరుగారు అధ్యక్షతవహించారు.



ఆనంద మోహన్ బోస్

మద్రాసు : 1898

పధ్నాలుగో కాంగ్రెసు మద్రాసులో ఆనందమోహనబోసుగారి అధ్యక్షతను జరిగింది. కాంగ్రెసుకు ఒక నియమావళిని తయారుచేశారు. విచారించి అవసరమయిన సవరణలు చేయడానికి ఒక కమిటీని వేశారు. ముందుముందు జరిగిన

అనేక సంఘటనలకూ కాంగ్రెసువిధానం కొంతమార్పు చెందడానికి హేతుభూతుడైన లార్డు కర్జన్ వైస్రాయిగా వచ్చాడు, కాంగ్రెసును ఎలా అణచివేయడం? జాతీయతత్వ విజృంభణాన్ని ఎలా అరికట్టడం అని ఆలోచించాడు, కాంగ్రెసు కొత్తపంధా తొక్కడానికి ఈయన నిర్బంధ నిరంకుశవిధానమే కారణమైంది.



ఆర్. సి. దత్తు

లక్నో:

1889

లక్నోలో జరిగిన పదిహేనవ కాంగ్రెస్‌లో కాంగ్రెస్ లక్ష్యం నిర్వచన తిరిగి జరిగింది. భారత సామ్రాజ్య ప్రజల యోగక్షేమాలను రాజ్యాంగబద్ధ సకల సాధనోపాయాలవల్లనూ పెంపొందించడమే కాంగ్రెస్ లక్ష్యం అన్నారు. కర్జన్ అమలు చేసిన కఠిన శాసనాలను నిరసిస్తూ తీర్మానంచేశారు. 1897వ సంవత్సరంలో కేవలం అనుమానంపైన అకారణంగా అరెస్టుచేయబడిన నాటు సోదరులు విడుదలైనారు. కాని కర్జన్ నిర్బంధ విధానాన్ని యావత్తు భారతదేశమూ గర్హించింది

19వ శతాబ్దం ముగింపుకువచ్చింది. మన పశ్చిమోత్తర సరిహద్దున యుద్ధము ముగిసింది. ఆఫ్ఘనిస్థాన్ భూభాగాన్ని కొంత తమసామ్రాజ్యంలో కలుపుకున్నాడు కర్జన్. ఆ సంవత్సరం చంద్రవర్కార్ అధ్యక్షతను లాహోరులో జరిగిన కాంగ్రెస్ భారతీయులకు సైనిక శిక్షణ ఇవ్వాలనీ, అందునిమిత్తం [illegible] సైనిక కళాశాలను స్థాపించాలనే వెనుకటికోరికను పునరుద్ఘాటించింది.

ఇరవైయ్యవ శతాబ్ది ప్రారంభమైంది. మొదటి కాంగ్రెస్ దిన్షా ఎడుల్జీ వాచా అధ్యక్షతను కలకత్తాలో జరిగింది. ఈ సమావేశానికి గాంధీజీ దక్షిణాఫ్రికానుండి కొంతమంది ప్రతినిధులతో అక్కడ భారతీయులు అనుభవిస్తున్న కష్టాలను నివేదించేనిమిత్తం వచ్చాడు. ప్రజల ఆర్థిక స్థితిగతులు మరీ అధ్వాన్నమైనవి. పరిస్థితులను విచారణచేసి ఒక సమగ్రమైన నివేదికను తయారుచేయడానికి పండిత మదనమోహన మాలవ్యా, బాలగంగాధర తిలక్ ప్రభృతులతో ఒక కమిటీని నియమించారు.



ఎన్. జి.

చంద్రావర్కార్

లాహోరు:

1900

లార్డు కర్జన్ ప్రతీప, నిరంకుశ ధర్మమా అని భారతీయులలో రాజకీయ చైతన్యం, జాతీయవికాసం బాగా వృద్ధి అయింది. భారతీయులకు అక్షరజ్ఞానం కలిగితే ప్రమాదంవుందని భారత విద్యావిధానాన్ని పరిశీలించేందుకు 1901 లో ప్రత్యేకం యూరపియనులతో ఒక సమావేశం సిమ్లాలో జరిపారు. 1902 లో భారత విశ్వకళాపరిషత్తును ఏర్పాటుచేశారు. ఇందులో ఇద్దరుమాత్రం భారతీయ సభ్యులున్నారు. వీరు మెజారిటీ అభిప్రాయంతో ఏకీభవించలేదు. సిమ్లా సమావేశం చర్చలు ఎంత రహస్యంగా ఉంచారో ఈ కమీషను సేకరించిన సాక్ష్యాలూ అంత రహస్యంగా ఉంచారు. ఇందువల్ల దేశంలో చాలా అసంతృప్తి కలిగింది.

అహమ్మదాబాదు కాంగ్రెసులో కర్జను విద్యావిధానాన్ని తీవ్రంగా విమర్శించారు. దేశంలో కరువు కాటకాలు విచ్చలవిడిగా విహారం చేస్తున్నవనీ, మృత్యుదేవత ఎటుచూచినా ప్రత్యక్ష మౌతున్నదనీ అధ్యక్ష పీఠంనుండి సురేంద్రనాథ బెనర్జీగారు

ఘోషించారు. బ్రిటన్‌లో కొత్తరాజు సింహాసనం ఎక్కినా భారత ప్రజానీకం బాధలు యధాతధం కాలేదన్నవన్నారు.

బెంగాల్ జాతీయోద్యమానికి పట్టుగొమ్మఅయిందని రాజ ప్రతినిధి కర్జను గ్రహించాడు. ఆ రాష్ట్రం పనిపట్టాలనుకున్నాడు. రాష్ట్రాన్ని మతస్థుల సంఖ్యను బట్టి విభజించి వేస్తానని ప్రకటించాడు. 1903 వ సంవత్సరంలో లాల్ మోహన్ ఘోష్‌గారి అధ్యక్షతను మద్రాసులో జరిగిన 19 వ కాంగ్రెస్ లో ఈ వంగ విభజన సంకల్పాన్ని నిరసించారు. మరోసంవత్సరం హెన్రీకాటన్‌గారి అధ్యక్షతను బొంబైలో జరిగిన సభకూడా వంగ విభజనకు ప్రతికూలంగా తీర్మానించింది. లార్డ్ కర్జను విధానాన్ని పూర్తిగా నిరసించింది.


డి. ఇ. వాచా
కలకత్తా :
1901

అధికారులు ప్రజాభిమతాన్ని ఆలించే ధోరణిలోలేరు. అప్పటికీ హిందువులనూ, ముస్లింలనూ వేరుచేయడానికి గట్టిప్రయత్నాలు జరిగాయి. "విభజించి పాలించు" సామ్రాజ్య సిద్ధాంతాన్ని లార్డు కర్జన్ అన్నిరంగాలలోనూ, అక్షరాలా అనుస రించాడు. 1905 వ సంవత్సరం అక్టోబరు 16 నుంచీ వంగరాష్ట్ర విభజన ఉత్తరువులు అమలు జరుగుతవని ప్రకటించాడు. హిందువులూ, మహమ్మదీయులూ అంతా చేరి ఈ విభజనను ప్రతిఘటించారు. వంగ విభజన అఖిలభారత సమస్యగా పరిణ మించింది.

కాశీలో గోపాలకృష్ణ గోఖలే అధ్యక్షతను 21 వ కాంగ్రెస్ సమావేశమైంది. 756 గురు ప్రతినిధులు ఈ సభకు వచ్చారు. వంగ విభజన జరిగిపోయింది. ఈ ప్రభుత్వ నిరంకుశవిధానానికి అసమ్మతి తెలిపేందుకు అప్పట్లో భారతదేశానికి రానున్న వేల్సు యువరాజును బహిష్కరించాలని తిలక్, లజపతిరాయ్ ప్రభృతులు సూచించారు. అధ్యతవహించిన గోఖలే, సురేంద్రనాధ బెనర్జీ వర్గంవారు వేల్సు యువరాజుకు స్వాగతం ఇస్తూ తీర్మానంచేయించారు. అయితే వంగరాష్ట్ర విభజనను రద్దుచేయించవలసిందని పైవారిని కోరుతూ తీర్మానాలు చేశారు.


లాల్ మోహన్
ఘోష్
మద్రాసు :
1903

కాంగ్రెస్ ఆదినుంచీ విపరీతమైన ప్రభుభక్తిని ప్రదర్శించుతూ వచ్చింది. ఇందుకు ఒకటి రెండు తార్కాణాలను పేర్కొనవచ్చు.

1914 లో కాంగ్రెస్ మహాసభ మద్రాసులో జరుగుతూఉంది. అప్పటి రాష్ట్ర గవర్నరు లార్డు పెంట్లెండ్ సభ జరుగుతూవున్న పందిట్లోకి వచ్చాడు. తటాల్న అందరూలేచి నిలబడ్డారు. అప్పుడు ఎ. పి. పాత్రోగారు భారతీయ అవసర సైనిక దళంగురించి మాట్లాడుతున్నారు. వెంటనే ఆయనచేత ఉపన్యాసాన్ని మాన్పించారు. పెంట్లెండ్ సమక్షన సురేంద్రనాధ బెనర్జీగారు ప్రభుభక్తిని వెల్లడిస్తూ ఒక తీర్మా నాన్ని ప్రతిపాదించారు. ప్రతినిధులందరూ లేచి నిలబడి తమ ఆమోదాన్ని ప్రకటించారు. 1916 లో జరిగిన లక్నో కాంగ్రెస్‌లోనూ ఇలాంటి సంఘటననే ఒకటి జరిగింది. కాంగ్రెస్ సభ జరుగుతూవుంది. సర్ జేమ్స్ మెస్టన్ సమావేశానికి



సర్
హెన్రీ కాటన్
బొంబాయి :
1904



గోపాలకృష్ణ
గోఖలే
కాశీ :
1905

వచ్చాడు. ఆయనకు స్వాగతం చెప్పడానికి మొత్తం ప్రతినిధులు అందరూ తమ తమ స్థానాల్లో లేచి నిలబడినారు, కాంగ్రెస్ జనకుల భావాలు, 1914, 16 సంవత్సరాల్లోనే ఇలాఉంటే 1905 సంవత్సరంలో ఎలా ఉండేవో విదారించుకోవచ్చును ఈ కాశీ సమావేశంలోనే కాంగ్రెస్ కార్యక్రమం సాగించేందుకు పదిహేనుగురు సభ్యులతో ఒక కమిటీని నియమించారు.

ఇప్పటికి ఒక శకం అయింది. ఇంతవరకూ జరిగిన వ్యవహారకాండను సంస్కరణల శకం అనిగానీ, అర్జీల 'యుగం' అనిగానీ అనవచ్చును. ఓంప్రథమంగా కాంగ్రెస్ వేదికనుండి ఆ సంఘలక్ష్యం స్వరాజ్యం అని 1906 సంవత్సరంలో దాదాభాయ్ నౌరోజీ ప్రకటించాడు. స్వపరిపాలన శకం దీంతో ప్రారంభమైందని చెప్పవచ్చును, గత సంవత్సరం అక్టోబరు 26 వ తేదీ అమలు జరిగిన బెంగాల్ విభజనే ఈ మార్పుకు దోహదంచేసిందని చెప్పవచ్చును. ఈ సమావేశానికిఅధ్యక్షతవహించే నిమిత్తం నౌరోజీ ప్రత్యేకం లండన్‌నుంచి వచ్చాడు. సత్పరిపాలన ఎన్నటికీ స్వపరిపాలకునకు ప్రత్యామ్నాయం కాదనే సత్యాన్ని కాంగ్రెస్ మొట్టమొదటిదఫా గుర్తించింది. ఈ సమావేశంలోనే స్వదేశీ ఉద్యమానికి అంకురార్పణకూడా జరిగింది. విదేశీవస్తువుల, సంస్థల బహిష్కరణ కార్యక్రమం నిర్ణయమైంది. జాతీయవిద్యకు సంబంధించి ఒక బోధనాపద్ధతి, విషయప్రణాళికా తయారు చేయబడింది.

ఈ కార్యక్రమ ఫలితంగా కాంగ్రెస్‌వాదుల్లో రెండు వర్గాలు ఏర్పడినవి. అయితే స్వదేశపరిశ్రమలకు మంచి ప్రోత్సాహం లభించింది. కాంగ్రెస్‌వాదులు లంకషైరు బట్టలను విసర్జించి చేనేత బట్టలనే కట్టుకోవాలని తీర్మానించుకున్నారు. వెంటనే జాతీయపాఠశాలలు దేశమంతటా వెలిసినై. వంగరాష్ట్రంలో గురుదాస్ బెనర్జీ, సతీస్‌చంద్ర ముఖర్జీ, అరవిందఘోష్ ఈ జాతీయ కార్యక్రమాన్ని నడపడానికి నడుములుబిగించారు. మనరాష్ట్రంలో 1908 లో ఆంధ్ర జాతీయకళాశాల ఏర్పడింది. వంగదేశనాయకుడు బాబు బిపిన్‌చంద్రపాల్ దేశం నాలుగుమూలలూతిరిగి ప్రజల్లో జాతీయభావాలను రేకెత్తించాడు. నిద్రాణులైయున్న ప్రజల మేల్కొల్పాడు. పరిస్థితులు చెయిదాటిపోతున్నవని కాంగ్రెస్‌లోని మితవాదబృందం గ్రహించింది. కాంగ్రెస్ అతివాదులవశం అవుతున్నదని భయపడ్డారు. ఆ కారణంగానే 1907 లో నాగపూర్‌లో జరుగవలసిన కాంగ్రెస్‌ను ఆఖరుక్షణంలో సూరత్‌కు మార్చారు. మితవాద శిఖామణిఅయిన సర్ ఫిరోజ్‌షా మెహతాగారు అధ్వర్యంవహించాడు. నాగపూరు అతివాదులకు మంచి అనుకూలమైన నగరం. అయినా అతివాదులు సూరత్‌పోయి తిలక్‌మహాశయుని నాయకత్వాన మితవాదులను స్వగృహంలోనే దీకొన్నారు. సభకు రాష్ బిహారీ ఘోష్‌ను అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఎన్నిక పూర్తికాగానే గల్లంతు ప్రారంభమైంది. అతివాదులకూ, మితవాదులకూ పొత్తు కలిసిందికాదు. పని ఏమీజరక్కుండానే సభ వాయిదాపడింది.

మితవాదులకు మార్గాంతంలేక విడిగాపోయి అల్లాబాదులో సమావేశమై కాంగ్రెస్‌కు వస, పటుత్వంలేని ఒక నియమావళిని తయారుచేశారు. ఈ సమావేశం 1908 ఏప్రిల్ మాసంలో జరిగింది. అదే సంవత్సరం డిసెంబరు మాసంలో రాష్ బిహారీ అధ్యక్షతను మద్రాసులో 23 వ కాంగ్రెస్ జరిగింది. అయితే దీనికి ప్రతిగా జాతీయవాదులు వేరేసభ జరిపారు. మార్లే మింటో సంస్కరణలేవో వస్తాయని అనుకుంటున్న రోజులవి, వాటిస్వరూపంగాని స్వభావంగాని తెలియదు. అయినా వీరు వాటిని హర్షిస్తూ తీర్మానాలుచేశారు.

ప్రభుత్వం జాతీయవాదులపైన, ముఖ్యంగా' తీవ్రవాదులపైన కఠినచర్యలు జరిపింది. 1907 లోనే లజపతిరాయ్‌ని, అజిత్ సింగ్‌ను ప్రవాసం పంపింది. 1908 లో తిలక్‌పై తిరిగి రాజద్రోహనేరం ఆరోపించి, విచారణతంతు నడిపి ఆరేళ్లు కఠినశిక్ష విధించి మాండలే పంపింది. అదే సంవత్సరం వంగరాష్ట్ర నాయకులనుకూడా కొందరిని ప్రవాసం పంపింది. 1908 నుండి 1915 వ సంవత్సరంవరకూ కాంగ్రెస్ మితవాదుల చేతుల్లోనే ఉంటూవచ్చింది.

ఈ మధ్యకాలంలో గుర్తుంచుకోవలసిన సంఘటనలు రెండు జరిగినవి. భారతీయులు పెద్ద ఉద్యోగాలకు తగరని డాన్ మార్లే 1907 జూన్ మాసంలో ప్రకటించాడు.

1908 ఏప్రిల్ 30 వ తేదీన ముజఫర్‌పూర్ జిల్లా జడ్జిని హత్యచేయడానికి ప్రయోగింపబడిన బాంబువల్ల హెన్నెడీ సతి, కుమార్తె మరణించారు.

మితవాదులు ప్రభుత్వ అండను చేరారు. సత్యేంద్రప్రసాద సిన్హాగారిని గవర్నరు జనరల్ కార్యవర్గ సభ్యులుగా నియమించారు. బొంబై, మద్రాసు గవర్నరుల కార్యవర్గంలోనూ ఇద్దరు భారతీయులకు ప్రాతినిధ్యం లభించింది. మితవాదుల ప్రభుభక్తికి అధికారులీవిధంగా వారిని 'గౌరవించారు.' 1915 లో తిరిగి బొంబైలో కాంగ్రెస్ సమావేశమైనప్పుడు సత్యప్రసాద సిన్హాగారే అధ్యక్షత వహించారు.

మార్లే - మింటో సంస్కరణలు 1909 వ సంవత్సరంలో అమలు జరిగినవి. ఆ సంవత్సరం కాంగ్రెసు పండిత మదనమోహన మాలవ్యాగారి అధ్యక్షతను లాహోరులో జరిగింది. కొత్త సంస్కరణలలో ముస్లిలకు ప్రత్యేక నియోజక వర్గాలను కల్పించడం, కొన్నిప్రాంతాల్లో వారికి న్యాయంగా ఉండతగ్గ ప్రాతినిధ్యాన్ని మించి ప్రాతినిధ్యం ఇవ్వడం జరిగింది. ఇతర మతస్థులనుండి ముస్లింలను వేరుచేయడంలో బ్రిటిష్‌వారు ఇందువల్ల కొంతవరకు కృతకృత్యులైనారు. లాహోరు కాంగ్రెస్ ఈ సంస్కరణలఎడ తన అసంతృప్తిని వెల్లడించింది. గాంధీజీ దక్షిణాఫ్రికాలో సాగించే సత్యాగ్రహ ఉద్యమసహాయార్థం ఒక నిధిని ఏర్పాటుచేశారు.



రాస్ బిహారీఘోష్

సూరత్ : 1907

మద్రాసు : 1908

★



మదనమోహన్ మాలవ్యా

లాహోరు : 1909

ఢిల్లీ : 1918

వెడ్డర్‌బర్న్ అధ్యక్షతను అలహాబాదులో మరుసటి సంవత్సరం జరిపిన కాంగ్రెస్ సభలో హిందూ ముస్లిం ఐక్యతను సాధించడానికి మార్గాలను విచారించారు. హిందూ ముస్లింల జాయింటు సమావేశాలు జరపాలని అధ్యక్షుడు సూచించాడు. రాష్ట్ర చట్టసభల కేర్పాటుచేసిన ప్రత్యేక నియోజవర్గాలను స్థానికసంస్థలకు కూడా వర్తింపచేయాలనే ఆలోచన వచ్చింది. జిన్నాగారుకూడా ఈ పద్ధతిని నిరసిస్తూ తీవ్ర ఉపన్యాసంచేశారు. దక్షిణాఫ్రికాలో గాంధిజీ నాయకత్వాన సత్యాగ్రహం ముమ్మరంగా సాగుతూఉంది. సత్యాగ్రహులను అభినందిస్తూ తీర్మానంచేశారు.



బిషన్ నారాయణధర్
కలకత్తా:
1911

కాంగ్రెస్ అవతరించి పావు శతాబ్దమైంది. 1909 లో అయిదవ జార్జి దర్బారు ఢిల్లీలో జరిగింది. రాజుగారి రాకవల్ల రాజకీయవాతావరణం కొంత సడలింది. వంగ విభజన రద్దు అయింది. రాజధాని కలకత్తానుండి ఢిల్లీకి మారింది. గాంధిజీ సత్యాగ్రహంకూడా సఫలమై దక్షిణాఫ్రికాలో 'ఇండెంచర్డ్ లేబర్' పద్ధతి రద్దు అయింది. కాని హేయమైన క్రిమినల్‌లా సవరణచట్టం అలాగే వుంది. "తిలకు మహారాజ్" మాండలె చెరశాలలో మ్రగ్గుతూ ఉన్నాడు. దేశం వీటిని మరచిపోలేకపోయింది.

★

1912 వ సంవత్సరం లో మరో దౌర్జన్యసంఘటన జరిగింది. అప్పుడు రాజప్రతినిధిగావున్న లార్డ్ హార్డింజ్‌పై బాంబుప్రయోగం జరిగింది. ప్రాణాపాయం లేకపోయినా ఈ సంఘటన బ్రిటిష్ విధానమార్పుకు కొంతవరకు కారణభూతమైంది. రాష్ట్రీయ స్వపరిపాలన అమలు జరపడం అవసరం అని పాలకులు గుర్తించారు. ఆ సంవత్సరం ఆర్. ఎన్. మధోల్కర్‌గారి అధ్యక్షతను బాంకిపూర్‌లో సమావేశమైన కాంగ్రెస్ వైస్రాయిపై జరిపిన హత్యాప్రయత్నానికి వగస్తూ ఆయనకు ప్రాణాపాయం తప్పినందుకు భగవంతునికి కృతజ్ఞత వెల్లడిస్తూ తీర్మానాలుచేసింది. కాంగ్రెస్ నియమావళి స్థిరపడింది. తరువాత నవాబ్ సయ్యద్ మహమ్మద్ బహదూర్ అధ్యక్షతను కరాచీలో కాంగ్రెస్ సమావేశమైంది. హిందూ ముస్లిం సఖ్యత కృషికి అంకురార్పణ జరిగింది. అఖిలభారత ముస్లింలీగుకూడా స్వపరిపాలన కోరుతూ తీర్మానించినందుకు ఆ సంఘాన్ని కాంగ్రెస్ అభినందించింది. దక్షిణాఫ్రికా పోరాటంలో భారతీయులు నెగ్గినందుకు గాంధిజీని అభినందిస్తూ వీరు తీర్మానంచేశారు.



ఆర్. ఎన్. మధోల్కర్
బంకిపూరు:
1912

యూరపులో యుద్ధమేఘాలు అలుముకుంటున్న రోజుల్లో కాంగ్రెస్ మహాసభ 1914 వ సంవత్సరం మద్రాసులో జరిగింది. భూపేంద్రనాథ బాసుగారు అధ్యక్షత వహించారు. యూరపు యుద్ధంలో మిత్రమండలి విజయాన్ని ఆకాంక్షిస్తూ బ్రిటన్‌కు అన్నివిధాలా సాయపడేందుకు కాంగ్రెస్ నిశ్చయించుకొన్నది. ఇదే సమయంలో డాక్టరు అనిబిసెంటు "హోంరూలు" ఉద్యమాన్ని ప్రారంభించింది. ఆమె భారత రాజకీయాల్లో విశేషప్రమేయం కలిగించుకోవడానికిదే మొదలు. స్వపరిపాలన

భారతీయుల జన్మహక్కని హెచ్చరించింది. ఒక హోంరూలు బిల్లుకూడా తయారుచేయించింది. భారతీయులను తక్కువగాచూచే దేశాలతో ఏలాంటి వర్తక సంబంధాలనూ పెట్టుకోరాదని ప్రచారంచేసింది.



నవాబు సయ్యద్ మహమ్మద్ బహదూర్

కరాచీ: 1913

1914 లో భారతజాతీయోద్యమంలో నవశకం ఆరంభమైంది. యూరపు యుద్ధంవల్ల కాంగ్రెస్ ఉద్యమంలో మార్పువచ్చింది. జూన్ మాసాంతాన ప్రభుత్వం లోకమాన్యుని విడుదలచేసింది. 1915 ఫిబ్రవరి 19 న మాజీ అధ్యక్షుడు, ప్రతిభాశాలి గొప్ప రాజనీతిజ్ఞుడు అయిన గోపాలకృష్ణ గోఖలే అస్తమించాడు. అదే సంవత్సరం నవంబరులో మరో మాజీ అధ్యక్షుడు సర్ ఫిరోజ్‌షా మెహతా కూడా మరణించాడు.

1914 ఆగస్టు 4 న ప్రారంభమైన ప్రపంచయుద్ధం భారతజాతీయ వికాసానికి బాగా దోహదంచేసింది. తిలక్ తిరిగి నాయకత్వం వహించాడు. భారతస్వాతంత్ర్య చరిత్రలో ఈయుద్ధం 1939 సెప్టెంబరు 3 న ప్రారంభమైన ద్వితీయసంగ్రామం మధ్యకాలమే చాలా ప్రధానమైంది. 1914—45 సంవత్సరాలమధ్య కాంగ్రెస్ జరిపిన పోరాటాలు, చేసిన ఆందోళన ఫలితంగానే ఈనాటికి మనకు స్వాతంత్ర్యం లభించింది. భారతజాతి తిరిగి తన పూర్వప్రతిష్ఠను సంపాదించుకొన అవకాశం కలిగింది.

★

తిలకు మహాశయుడు తిరిగి రాజకీయరంగంలో ప్రవేశించడంవల్ల కాంగ్రెస్ ఐక్యత సాధ్యమైంది. అతివాదులూ, మితవాదులూ అంతా ఏకమైనారు. 1915 నుండి 1917 వరకూ దేశంలో ఎక్కడ వినిపించినా "హోంరూలు" నినాదాలే. తిలకు హోంరూలు లీగును మహారాష్ట్రంలో స్థాపించగా అనిబెసెంటు దేశం అంతటికీ ఒక కేంద్రసంఘాన్ని ఏర్పాటుచేసింది. నూతన రాష్ట్రనిర్మాణం భాషను బట్టి జరగాలని వీరు ప్రచారంచేసినందువల్ల అన్ని ప్రాంతాలా వీరి ఉద్యమం చాలా త్వరగా బలపడింది. భారతరాజకీయ ఉద్యమానికి ఈ హోంరూలు ఉద్యమం బాగా దోహదంచేసింది. హోంరూలు ఉద్యమం బలపడడం గమనించి అధికారులు డాక్టర్ అనిబెసెంట్‌ను ఉదకమండలం పొలిమేరలను దాటడానికి వీలులేదని ఆజ్ఞాపించింది. తిలక్‌నుండి సత్ప్రవర్తనకు ముప్పయివేల రూపాయిలకు పూచీ పుచ్చుకున్నది. తిలకు ఈ ఉత్తరువుమీద హైకోర్టుకు అపీలుచేశాడు. కేసుపోయింది; తిలకు ధరావత్తు కట్టక్కర్లేదని కోర్టువారు తీర్పుఇచ్చారు. దీనితో తిలకు ప్రాపకం బాగా హెచ్చింది.



భూపేంద్రనాథ్ బాసు

మద్రాసు: 1914

1916 లక్నో కాంగ్రెస్ అనేకవిధాల ప్రధానమైంది. హిందూ - ముస్లిం సామరస్య సాధనకు పునఃప్రయత్నం ప్రారంభమైంది. ఉభయమతస్థులకు ఎక్కడాలేని అన్యోన్యం, సామరస్యం ఏర్పడింది. ఈ కాంగ్రెస్‌తోనే కాంగ్రెస్ చరిత్రలో మరో కొత్త అధ్యాయం ప్రారంభమైంది.



సర్ ఎస్. పి. సిన్హా

బొంబాయి:

1915



అంబికాచరణ్

మజుందార్

లక్నో:

1916

మరు సంవత్సరం వచ్చేసరికి ప్రజల్లో రాజకీయ చైతన్యం జాత్యభిమానం విపరీతంగా ఎక్కువైంది. బెసెంట్, తిలక్ ఉద్యమం బాగా వ్యాప్తిచెందింది. అధికారులకు కన్నెర్రయింది.

ఇంతలో అనిబెసెంటు అధ్యక్షతను కలకత్తాలో కాంగ్రెస్ సభ జరిగింది. ఇందు వల్ల కాంగ్రెసూ, హోంరూలు లీగు సన్నిహిత సంస్థలైనవి. ఈ సమావేశంలోనే మొదటిదఫా జాతీయపతాక ప్రస్తావనవచ్చింది. ఇండియా కార్యదర్శిపదవిని అప్పుడే స్వీకరించిన ఎడ్విన్ మాంటెగూ అప్పట్లో చాలా ముఖ్యమైందిగా ఎంచదగ్గ ప్రకటన ఒకటి ఆగస్టు 20 వ తేదీనచేశాడు. అక్టోబరులో భారతదేశం వచ్చాడు. దేశం హోంరూలు ఆందోళనతో గందరగోళంగాఉంది. జాతీయోద్యమాన్ని అణచడానికి తీసుకోతగ్గచర్యల నివేదించేందుకు ప్రభుత్వం సర్ జాన్ రౌలట్ అధ్యక్షతను ఒక కమిటీని స్థాపించింది. ఈ కమిటీ సూచనలప్రకారం ఒక బిల్లు తయారైంది. ఈ రౌలట్ శాసనాన్ని ధిక్కరించడానికి గాంధిజీ 1919 వ సంవత్సరంలో సత్యాగ్రహం ఆరంభించాడు.

1917 లో మాంటెగ్యూ ప్రకటనవల్ల అతఃపూర్వం, తిలక్, బిపిన్ చంద్ర పాల్‌ను దేశంనుండి బహిష్కరించినా, హోంరూలు సేవకులను నిర్బంధించినా దేశం కొంచెం నెమ్మదిగానే ఉంది. పైగా ఆయన మనదేశం రావడానికి నెల ముందుగానే బెసెంట్ ఆమె అనుయాయులిరువుర్ని గవర్నమెంటు విడుదల చేసింది. మాంటెగూ దేశం అంతాతిరిగి బాధ్యతాయుత ప్రభుత్వం అంటే ఏమిటో విశదీకరించి చెప్పాడు. అప్పట్లో బ్రిటన్లోవున్న పరిపాలనాపద్ధతే అని అసందిగ్ధంగా చెప్పాడు. అంటే కాంగ్రెసూ, లీగూకలిసి తయారుచేసిన రాజ్యాంగ పథకాన్ని దాదాపు మాంటేగూ ఆమోదించినట్లే అయింది. కాని 1918 లో వెల్లడి అయిన మాంట్‌ఫర్డు నివేదికకూ ఈయనచెప్పిన కబుర్లకూ ఎక్కడా పొంతనేలేదు. ఈ నివేదికను పరిశీలించేందుకుగాను కాంగ్రెస్ బొంబైలో హసన్ ఇమాం అధ్యక్షతను సమావేశమైంది. సంస్కరణలకు కొన్ని సవరణలను సూచించారు. అదేవిధంగా ముస్లింలీగ్‌వారున్నూ సంస్కరణలను హర్షింపక దాదాపు కాంగ్రెసు సూచించినమాదిరి సవరణలనే సూచించారు. సంపూర్ణ స్వపరిపాలనకు ఏమాత్రం తక్కువైనా భారతీయులు తృప్తిపడరని ఉభయసంఘాలవారూ స్పష్టంచేశారు.

వార్షికసభ ఢిల్లీలో మదనమోహన మాలవ్యా అధ్యక్షతను జరిగింది. అప్పటికి యూరపుయుద్ధం మిత్రమండలికి అనుకూలంగా ముగిసింది. ఈ సమావేశం దండనశాసనాలన్నింటినీ రద్దుచేయాలనీ ప్రపంచశాంతిసభకు పోయే భారతీయ ప్రతినిధులను భారతీయులే ఎన్నుకోవాలనీ తీర్మానించింది. భారత ప్రతినిధులుగా బాలగంగాధర తిలక్‌నూ, హసన్ ఇమాంను, గాంధిజీని సూచించింది. లోగడ నిర్బంధింపబడిన ఆలీ సోదరులను విడుదలచేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ మరో

తీర్మానంచేసింది. వేల్సు యువరాజు దేశానికివచ్చే సందర్భంలో ఆయనకు స్వాగతంచెప్తూ తీర్మానించింది. కాని తీరావచ్చేసరికి పరిస్థితులు మారిపోయినవి. కాంగ్రెస్ ఆయన కార్యక్రమాన్ని బహిష్కరించింది.



డా. అనిబిసెంటు
కలకత్తా :
1917

★

1919 వ సంవత్సరం మార్చి 3 వ వారంలో రౌలట్ బిల్లు శాసనమైంది. బిల్లునుగాని ఉపసంహరింపకపోతే సత్యాగ్రహం సాగిస్తామని స్పష్టంచేసి మార్చి 30 వ దేశంఅంతటా హర్తాలు జరుపమని గాంధీజీ ఆదేశించాడు. ఆఖరుక్షణంలో ఈతేదీని ఏప్రిల్ 6 కు మార్చారు. కాని దేశంఅంతటా మార్చి 30 వ తేదీన హర్తాలు జరిగింది. ఏప్రిల్ 6 వ తేదీన దేశంఅంతటా రౌలట్ శాసన ప్రతికూల ప్రదర్శనలు ప్రారంభమైనవి. 1919 ఏప్రిల్ మాసంలో ఒక కొత్తఘట్టం ప్రారంభమైంది. యావత్తు భారాన్నీ పంజాబే నిర్వహించింది. ఉన్నట్లుండి ఒకరోజు ఉదయం అమృతసర్ జిల్లామేజిస్ట్రేటు ఇద్దరు కాంగ్రెస్ పెద్దలకు కబురంపి తన ఇంటికి పిలిపించుకొన్నాడు. వీరిద్దర్నీ అక్కడ్నుంచి ఎక్కడికో తీసుకు వెళ్ళిపోయారు. తమనాయకులెక్కడున్నారో చెప్పమని ప్రజలు మేజస్ట్రేటు ఇంటిని ముట్టడించారు. కల్లోలం ప్రారంభమైంది. కాల్పులు జరిగాయి. ఈ విధంగా వారంరోజులు గడిచింది. ఏప్రిల్ 13 న జలియన్‌వాలాబాగ్ దురంతాలు. జనరల్ డైయ్యర్ స్వయంగా ఈ హత్యా కార్యక్రమాన్ని నడిపించాడు. అమృతసర్ మేజస్ట్రేటు అరెస్టుచేసిన నాయకులిద్దరూ సత్యపాల్, డాక్టర్‌కిచ్లూ. ఈ పంజాబ్ దురంతాలు దేశాన్ని బాగా కలతపెట్టినై. రవీంద్రనాథ్ టాగూరు తన సర్ బిరుదును వదులుకున్నాడు. మరుసటి సంవత్సరంనుండి ఏప్రెల్ 6 నుండి 13 వరకూ భారతీయులు జాతీయవారంగా పరిగణిస్తూ వచ్చారు.

ఈ పరిస్థితులలో అమృతసర్ కాంగ్రెస్ జరిగింది. పండిత మోతిలాల్‌నెహ్రూ అధ్యక్షత వహించాడు.



సయ్యద్
హసన్ ఇమాం
బొంబాయి
(ప్రత్యేకం):
1918

1915 వ సంవత్సరంనుండే డిటెన్యూలుగా ఉంటున్న మౌలానా ఆజాద్, అలీ సోదరులు యుద్ధం ముగిసిన 13 మాసాలకు అనగా 1919 డిసెంబరులో విడుదలైనారు. జలియన్‌వాలాబాగ్ చిత్రవధకే ఆగ్రహావేశులై ఉన్న ప్రజలు బ్రిటిష్‌వారి ఖిలాఫత్ ద్రోహంతో మరింత ఆందోళన చెందారు. హిందువులూ, ముస్లింలూచేరి ఈ అన్యాయాన్ని అంతమొందించడానికి పోరాటం ప్రారంభింప సంకల్పించారు. 1920 ఏప్రెల్ [illegible] వ తేదీన హిందువులు, ముస్లింలు సమావేశమై ప్రభుత్వంతో సహాయ నిరాకరణం చేయడానికి నిశ్చయించుకొన్నారు. ఆ సంవత్సరం ఆగస్టు 1 వ తేదీన తిలక్ అస్తమించాడు. కాంగ్రెస్ నాయకత్వాన్ని గాంధి స్వీకరించాడు. 1920 సెప్టెంబరులో కాంగ్రెస్ ప్రత్యేక సమావేశం కలకత్తాలో జరిగింది. లాలా లజపతిరాయ్ అధ్యక్షత వహించారు. గౌరవ పదవులు, బిరుదులు, న్యాయస్థానాలు, కళాశాలలు, శాసనసభలను బహిష్కరించాలనే తీర్మానం చేయబడింది. ఈ తీర్మానంతో స్వరాజ్యశకం ప్రారంభమైంది.



పండిత
మోతీలాల్ నెహ్రూ
అమృతసరము :
1919
కలకత్తా :
1928

★



లాలా
లజపతిరాయి
కలకత్తా (ప్రత్యేకం):
1920

1920 డిసెంబరులో సి. విజయరాఘవాచారిగారి అధ్యక్షతను జరిగిన సభలో కాంగ్రెస్ లక్ష్యం మార్పు అయింది. శాంతియుతమైన, శాస్త్రబద్ధమైన మార్గాల స్వరాజ్యాన్ని సంపాదించడమే కాంగ్రెస్ లక్ష్యం అన్నారు. ఆ ఏడాదే ఖద్దరుకు కూడా ప్రాధాన్యంవచ్చింది. కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహం లభించింది. ఈ సమావేశంతో కాంగ్రెస్ పై గాంధిజీ నాయకత్వం స్థిరపడిపోయింది. ఆయన అసహాయోద్యమ కార్యక్రమం కాంగ్రెస్ కార్యక్రమమైంది. భాషానుసారం రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలు ఏర్పాటైనవి. 15 గురు సభ్యులతో కాంగ్రెస్‌కు ఒక కార్యవర్గం కూడా ఏర్పాటైంది.

1921 పోరాట సంవత్సరం. వేల్సు యువరాజు బహిష్కరణ, దక్షిణాదిన మాప్లా తిరుగుబాటు, ఆలీసోదరుల అరెస్టు. ఆంధ్రరత్న నాయకత్వాన చీరాలపేరాల సత్యాగ్రహం, వీటిలో ముప్పయివేలకుపైగా అరెస్టయినారు. తిలకు స్వరాజ్య నిధికి కోటిరూపాయలు వసూలుచేయడానికి తీర్మానమైంది. ఆ సంవత్సరం కాంగ్రెస్ చిత్తరంజన్‌దాసు అధ్యక్షతను అహమ్మదాబాదులో జరగాలి. అధ్యక్షుణ్ని అరెస్టు చేశారు. అందువల్ల అజ్మల్‌ఖాన్ ఆ సమావేశానికి అధ్యక్షత వహించాడు. ఉద్యమం నడిపేందుకు గాంధిజీకి సర్వాధికారాలు ఇచ్చారు. బార్డోలీ సత్యాగ్రహానికి సన్నాహాలు జరుగుతూవున్నై. కాని సంయుక్త రాష్ట్రంలో చౌరీ చౌరా దౌర్జన్య చర్యలు గాంధిజీ కార్యక్రమాన్నే తారుమారుచేసినై. పన్నుల నిరాకరణ ఉద్యమాన్ని గాంధిజీ విరమించాడు. గుజరాత్‌లో అంతవరకూ చెల్లింపబడకుండాఉన్న పన్నుల మొత్తం దాదాపు 20 లక్షలున్నట్లు అంచనావేశారు. ఉద్యమాన్ని విరమించిన తరువాత ప్రభుత్వం గాంధిజీని అరెస్టుచేసింది. 124 (ఎ) క్రింద కేసుపెట్టింది. ఆయన తన మతాన్ని అనుసరించి అన్సరుపెట్టలేదు. జడ్జి ఆరేళ్ళు ఖైదువిధించాడు. ఆ సందర్భంలో గాంధిజీ చరిత్రాత్మకమైన ప్రకటనచేశాడు.

గాంధిజీ ఉద్యమ విరమణ ఫలితంగా కాంగ్రెస్‌లో తిరిగి చీలికలు ఏర్పడినై. 1922 లో గయా కాంగ్రెస్ జరిగింది. సి. ఆర్. దాస్‌గారు అధ్యక్షతవహించారు. గాంధీజీ జెయిలుకు వెళ్ళడంతో శాసనోల్లంఘన ప్రయోజనాలను గురించి కొన్ని శంకలు బయల్దేరినవి. విచారణనిమిత్తం ఒక కమిటీనివేశారు. ఈ కమిటీ దేశ సంచారం ముగించుకొని నివేదిక వ్రాయవలసి వచ్చేసరికి సభ్యులలోనే ఏకాభిప్రాయం లేకపోయింది. శాసనోల్లంఘనాన్ని బలపరచారు కొందరు. మరికొందరు శాసనసభల ప్రవేశాన్ని ఆమోదించారు. ఈ విషయాలు విచారించేందుకు ఢిల్లీలో 1923 సెప్టెంబరులో ప్రత్యేక కాంగ్రెస్ సమావేశం జరిగింది. అబ్దుల్‌కలాం ఆజాద్ అధ్యక్షతవహించి కాంగ్రెస్ వాదులలో చీలికలు రానివిధంగా సమస్యను పరిష్కరించాడు. శాసనసభల ప్రవేశాన్ని కాంగ్రెస్ ఇంచుమించు ఆమోదించిందనే చెప్పవచ్చును.



ఆ ఏటి వార్షికసభ కాకినాడలో మహమ్మదాలీ అధ్యక్షతను జరిగింది. 6188 మంది ప్రతినిధులు వచ్చారు. అదే సంవత్సరం షౌకత్ అలీ అధ్యక్షతను ఖిలాఫత్ సభ జరిగింది. అలీ సోదరుల తల్లి కాంగ్రెస్ బహిరంగసభలో విభేదాలను విస్మరించమని విజ్ఞప్తి చేసింది. ఢిల్లీ ప్రత్యేకసభ చేసిన తీర్మానాన్ని కాకినాడ కాంగ్రెస్ ఆమోదించింది.



సి. విజయరాఘవా

నాగపూరు :


1920

1924 ఫిబ్రవరి 5 న గాంధిజీ విడుదలైనాడు. బెల్గాం కాంగ్రెస్‌వారిఅధ్యక్షతను జరిగింది. తిరిగి సత్యాగ్రహం ప్రారంభించే ధోరణిలోలేదు దేశం. 1925 లో చిత్తరంజన్‌దాస్ మరణించాడు. సరోజినీదేవి అధ్యక్షతను కాన్పూరులో జరిగిన కాంగ్రెస్‌సభ కౌన్సిల్ కార్యక్రమాన్ని ఆమోదించింది. అయితే కాంగ్రెస్‌లో రెండుపక్షాలు ఏర్పడిపోయినవి. నిర్మాణ కార్యక్రమంలో నమ్మకం గలవారంతా ఒకపక్షం, శాసనసభలకు పోదామనుకొనేవారంతా, ఒకపక్షం అయినారు. అయితే ఈ రెంటవపక్షంవారికి శాసన సభలపై మోజు, నమ్మకం ఎంతోకాలం ఉండలేదు. ఈపక్షానికి నాయకుడైన మోతీలాల్ నెహ్రూయే కాంగ్రెస్‌వారు శాసనసభల సభ్యత్వానికి రాజీనామాఇచ్చి బయటికివచ్చివేయాలని హెచ్చరించాడు. 1925 లోనే శ్రద్ధానందుని హత్యజరిగింది.

★

శ్రీనివాస అయ్యంగార్ అధ్యక్షతను గౌహతీలో కాంగ్రెస్‌సభ జరిగింది. 27 అక్టోబరున ఆయన అధ్యక్షతనే ఐక్యసాధనా సమావేశం జరిగింది. అప్పుడే మనదేశ రాజ్యాంగ వ్యవహారాలను విచారించేందుకు సైమన్ కమీషన్ ఒకటి దస్తుందని ప్రకటన జరిగింది.

అన్ని పక్షములవారూ 'ఈ కమిషన్‌ను బహిష్కరించడానికి తీర్మానించారు.



హకిమ్

అజ్మల్‌ఖాన్

అహమ్మదాబాదు

1921

1927 కాంగ్రెస్ మద్రాసులో డాక్టర్ అన్సారీ అధ్యక్షతను జరిగింది. సైమను కమీషన్ను బహిష్కరించాలనే తీర్మానంచేసింది. ఈ సంవత్సరం అత్యంత ప్రధానమైన సంఘటనాలు మూడు నాలుగు జరిగినవి. అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసిన నెహ్రూ కమిటీవారు రాజ్యాంగ విధానంగురించి నివేదిక తయారుచేశారు. బార్డోలీ సత్యాగ్రహం రైతాంగానికి అనుకూలంగా ముగిసింది. లాఠీ దెబ్బలకు గురియై లజపతిరాయ్ మరణించాడు.

సంవత్సరం లోపుగా భారతదేశానికి అధినివేశ ప్రతిపత్తి నివ్వాలని మోతీలాల్ నెహ్రూ కలకత్తా కాంగ్రెస్ అధ్యక్ష పీఠంనుంచి హెచ్చరించాడు. కాని 1929 వరకూ ఏమీ జరగలేదు. వైస్రాయి లార్డ్ ఇర్విన్‌తో గాంధీజీజరిపిన సంప్రతింపుల పర్యవసానం ఏమీ తేలలేదు, అందువల్ల 1929 డిసెంబరు 31 న పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ అధ్యక్షతను లాహోర్లో సమావేశమైన కాంగ్రెస్ మహాసభ

సంపూర్ణ స్వాతంత్ర్యతీర్మానం ఆమోదించింది. అప్పట్నుంచీ ప్రతిఏటా జనవరి 26 న భారతప్రజలు స్వాతంత్ర్యదిన ఉత్సవాలు జరుపుతూవచ్చారు.



సి. ఆర్. దాసు
గయ :
1922

లాహోరు కాంగ్రెస్‌లో పూర్ణ స్వరాజ్యయుగం ప్రారంభమైంది. సంపూర్ణ స్వాతంత్ర్యమే కాంగ్రెస్ లక్ష్యమయింది. పోరాటం ఏం లేకుండా స్వాతంత్ర్యం సంప్రాప్తంకాదు. వెంటనే ఉప్పు సత్యాగ్రహం, పన్నుల నిరాకరణ ఉద్యమం ప్రారంభమయినది. ఎనిమిది మాసాలు ఈ పోరాటం సాగింది. దేశం ఇలా ఉండగా బ్రిటన్‌లో భారత రాజ్యాంగవ్యవహారాలు చర్చించడానికి 1930 డిసెంబరులో ప్రథమ రౌండ్ టేబిల్ సభ జరిగింది. ప్రజా ప్రతినిధులనదగ్గవా రెవ్వరూ పోలేదు. అందువల్ల బ్రిటిష్ ప్రధాని రామ్సే మాక్డొనాల్డు కాంగ్రెస్‌తో రాజీకి రావలసి వచ్చింది. 1931 జనవరి 26 వ తేదీన గాంధిజీ మరి 26 గురు కాంగ్రెస్ పెద్దలు విడుదలైనారు. సప్రూ, జయకర్‌గార్ల మధ్యవర్తిత్వం ఇందుకు కొంత ఉపయోగపడింది. గాంధిజీ వైస్రాయి లార్డ్ ఇర్విన్‌తో సంప్రతింపులు జరిపారు. అప్పటికింకా 60 వేలమంది కాంగ్రెస్‌వారు కారాగారాల్లోనే ఉన్నారు. వీరి సంప్రతింపులు ఫలించి మార్చి 5 వ తేదీన ఒడంబడిక జరిగింది. పోలీసుల అత్యాచారాల విషయమయి విచారణ జరపమని కోరకుండుటకు బార్డోలీలో చెల్లుబడికాకున్న మొత్తాన్ని దాదాపు 20 లక్షల రూపాయలు, చెల్లు అయేటట్లు చూడడానికీ కాంగ్రెస్ అంగీకరించింది. కాని ఒడంబడిక ఎంతోకాలం అమలులో ఉండలేదు. వైస్రాయి లార్డు ఇర్విన్ ఇండియా వదలిపోగానే అధికారులు తిరిగి నిర్బంధ విధానాన్ని అనుసరింప నారంభించారు.



అబుల్ కలామ్
ఆజాద్
ఢిల్లీ (ప్రత్యేకం) :
1923
రామఘర్ :
1940—45

1931 వ సంవత్సరం కాంగ్రెస్ సమావేశం కరాచీలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ అధ్యక్షతను జరిగింది. రెండవ రౌండ్ టేబిల్ సమావేశానికి గాంధిజీని కాంగ్రెస్ ప్రతినిధిగా పంపడానికి తీర్మానించారు. బార్డోలీలో హట్సన్ సాగించిన అక్రమ చర్యలచూచి గాంధిజీ లండన్ ప్రయాణాన్ని విరమించుకుంటానని ప్రకటించాడు. తరువాత విచారణలు జరిపిస్తామని హామీ ఇవ్వగా గాంధిజీ లండన్ ప్రయాణమైనాడు. రౌండ్ టేబిల్‌సభ ఒక నాటకంగా తయారైంది. హిందూ - ముస్లిం విభేదాలను పెద్దచేయడానికే బ్రిటిష్‌వారు దీన్ని ఉపయోగించుకొన్నారు. గాంధిజీ హతాశుడై భారతదేశానికి తిరుగుప్రయాణంకట్టాడు. గాంధిజీ ఇంకా దారిమధ్యలోనే ఉన్నాడు. భారతదేశంలో నిర్బంధవిధానం ఆరంభమైంది. సరిహద్దు రాష్ట్రంలో గఫార్ ఖాన్‌ను, సంయుక్తరాష్ట్రాల్లో పండిట్ జవహర్లాల్ నెహ్రూనూ అరెస్టుచేశారు. బెంగాల్‌లో ఆర్డినెన్సు పరిపాలన అమలులోకి వచ్చింది. గాంధిజీ బొంబైలో దిగగానే వైస్రాయి లార్డు విల్లింగ్‌డన్‌ను చూడగోరాడు. కాని వైస్రాయి చూడనన్నాడు. తిరిగి శాసనోల్లంఘనం, సత్యాగ్రహం ప్రారంభమయింది. ఈ దఫా లక్ష ఇరవై వేలమంది జైళ్ళకు వెళ్ళారు. మార్చి 1932 లో మాక్డొనాల్డు మత పరిష్కారాన్ని ప్రకటించాడు. హిందూ సంఘవిచ్ఛిత్తి కిది దారితీస్తుందనీ, హరిజనులను హిందువులనుండి వేరుచేసేప్రయత్నాలను ప్రతిఘటిస్తానని గాంధిజీ



మహమ్మదాలి
కాకినాడ :
1923

చెప్పాడు. ఆ మరణప్రాయోపవేశం చేస్తాననిగాని గాంధీజీ అప్పటి ఇండియా కార్యదర్శి సర్ శామ్యుల్‌హోరుకువ్రాశారు. ఆమరోజుల్లో మతపరిష్కారం సవరింపబడింది. అయితే అది గాంధీజీ ప్రాయోపవేశం ప్రారంభించిన తరువాతనే జరిగింది. ఇదే 'పూనా పాక్టు'.

1932–33 సంవత్సరాల్లో నిర్బంధవిధానం అతి దారుణంగావుంది. గాంధీజీ జెయిల్లోనుంచే హరిజనప్రచారం చేస్తానన్నాడు. ఆయనకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. అందువల్ల గాంధీజీ తిరిగి ప్రాయోపవేశం చేస్తానన్నాడు. ప్రాయోపవేశం చేస్తుండగానే ఆయన్ను విడుదలచేశారు. అప్పట్నుంచీ తన జీవితాన్ని హరిజనాభివృద్ధికి అర్పిస్తానని దీక్షబూనాడు. 1934 ఏప్రెల్‌లో గాంధీజీ శాసనోల్లంఘన ఉద్యమాన్ని విరమించారు. పాట్నాలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశం ఈయన నిర్ణయాన్ని ఆమోదించింది. ఇందువల్ల లార్డు విల్లింగ్‌డన్ కాంగ్రెస్‌ను అణచివేశానని భ్రమించాడు. ఆవిధంగా ప్రగల్భాలూ కొట్టాడు. 1934 వ సంవత్సరం బొంబైలో రాజేంద్రప్రసాదుగారి అధ్యక్షతను సమావేశమయిన కాంగ్రెస్ వెల్లింగ్‌డన్‌కు సమాధానంఇవ్వ నిశ్చయించింది. కేంద్ర అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొని అఖండ విజయాన్ని సాధించి వైస్రాయి వెల్లింగ్‌డన్‌కు కాంగ్రెస్ తన బలాన్ని చూపకలిగింది.

కాంగ్రెస్ చరిత్రలో మరో కొత్త అధ్యాయం ప్రారంభమయింది. 1935 ఇండియాప్రభుత్వం చట్టాన్ని అమలుచేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం నిశ్చయించింది. కాంగ్రెసూ, ముస్లింలీగూ సంస్థానాధీశ్వరులు ఫెడరల్ భాగాన్ని ప్రతిఘటించారు. అందువల్ల రాష్ట్ర రాజ్యాంగానికి సంబంధించిన భాగమే అమలు జరిగింది. ఎన్నికల్లో పాల్గొనడానికి కాంగ్రెస్ తీర్మానించింది. ఆరు రాష్ట్రాల్లో బ్రహ్మాండమయిన విజయాన్ని సాధించినది. 1937 ఫిబ్రవరిలో ఎన్నికల ఫలితాలు వెల్లడైనవి. 1936 కాంగ్రెస్ జవహర్లాల్ అధ్యక్షతను లక్నోలో జరిగింది. మంత్రిపదవులను స్వీకరించడంగురించి అక్కడేమీ నిర్ణయం జరుగలేదు. అంతవరకూ పట్నాల్లో జరుగుతూవచ్చిన కాంగ్రెస్ అదిమొదలు గ్రామాల్లో సమావేశమౌతూ వచ్చింది. 1937 కాంగ్రెస్ ఫైజ్పూరులో జరిగింది. దీనికి నెహ్రూయే అధ్యక్షుడు. అప్పటికి కాంగ్రెస్ గవర్నరులనుండి హామీ పుచ్చుకొని మంత్రి పదవులను స్వీకరించింది. 1938, 1939 కాంగ్రెస్‌లకు సుభాస్ బోస్ అధ్యక్షుడుగా ఉన్నాడు. హరిపురా కాంగ్రెస్‌కు గాంధీజీఆశీర్వాదాలతోనూ, త్రిపురికాంగ్రెస్‌కు గాంధీజీని ఎదిరించి అధ్యక్షుడైనాడు. అప్పటికే యుద్ధమేఘాలు క్రమ్ముతూ వస్తున్నయి. యుద్ధం ప్రారంభం అయితే కాంగ్రెస్ ఆ అవకాశాన్ని ఉపయోగించుకొని స్వాతంత్ర్య సంపాదనకు పోరాటంసాగించాలని సూచించాడు. కాని త్రిపురి కాంగ్రెస్‌లో ఆయన విధానాన్ని అఖిల భారత కాంగ్రెస్ కమటీ నిరాకరించింది. అస్వస్థులుగా ఉండీన్నీ ఆయన హాజరైనాడు. గాంధీజీ రాజకోట వ్యవహారాల్లో చిక్కుకొని ఈ సమా



సరోజినీదే

కాన్పూరు

1925



ఎస్. శ్రీని

అయ్యంగా

గౌహతీ:

1926



డా. అన్సా


మద్రాసు

1927

వేశానికి హాజరుగాలేదు. అయినా అంతా ఆయన అభిమతాన్ని అనుసరించే జరిగింది. సుభాస్ బోసు అధ్యక్షపదవికి రాజీనామా ఇచ్చాడు. మళ్ళీ కాంగ్రెస్‌సమావేశం అయ్యేవరకూ రాజేంద్రప్రసాద్ అధ్యక్షుడుగా పనిచేశాడు. 53 వ కాంగ్రెస్ సభ రామ్‌ఘర్‌లో మౌలానా ఆజాద్ అధ్యక్షతను సమావేశమయింది. అప్పటికే యూరపు యుద్ధం ప్రారంభమైంది. కాంగ్రెస్‌కూ బ్రిటిష్‌వారికీ రాయబారాలు సాగినవి. అవి విఫలమయినవి. కాంగ్రెస్ గాంధీజీ ఆజ్ఞానుసారం వ్యక్తి శాసనోల్లంఘనాన్ని సాగించింది. 1939 నవంబర్‌లోనే కాంగ్రెస్‌వారు మంత్రి పదవులకు రాజీనామా ఇచ్చారు. క్రమంగా 1942 వచ్చేసరికి పరిస్థితులు విషమించాయి. భారత సమస్యా పరిష్కారానికి అప్పటికి రెండు ప్రయత్నాలు జరిగినవి. లిన్లిత్గో ఆగస్టు ప్రతిపాదనలను, క్రిప్స్ 1942 ప్రతిపాదనలనుకూడా కాంగ్రెస్ తిరస్కరించింది. క్విట్ ఇండియా ఉద్యమం 1942 ఆగస్టు 10 న ప్రారంభమయింది. నాయకులను నిర్బంధించడం దేశంలో నిర్బంధ విధానాన్ని అమలుచేయడం 1945 వరకు సాగింది. జెయిల్లోనే కస్తూరిబా గాంధి, మహదేవ్ దేశాయ్ మరణించడంజరిగింది.

జపాన్ యుద్ధం ముగింపుదశకురాగా కాంగ్రెస్ నాయకులను విడుదలచేశారు. వైస్రాయి లార్డు వేవెల్ సిమ్లాసభ జరిపారు. అది విఫలమయింది. 1946 మార్చిలో బ్రిటిష్ అమాత్య రాయబారవర్గం వచ్చింది. రెండుమాసాలు అందరితోనూ సంప్రతించి మే 16 పథకాన్ని తయారుచేశారు. ఈకాలంలో ఆజాద్ రాజీనామా ఇవ్వగా నెహ్రూ రాష్ట్రపతిగా ఎన్నికైనాడు. బొంబై అఖిలభారత కాంగ్రెస్ కమిటీలో వీరు అధికారం స్వీకరించారు. గత ఏడాది మీరట్‌లో 54 వ సమావేశం జరిగింది. కృపలానీ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికైనాడు. ఈలోపున బ్రిటిష్ ప్రభుత్వం భారతవిధానం పూర్తిగా మారిపోయింది. ఈ ఫిబ్రవరి 20 న 1948 లోగా తాము భారత దేశంనుండి వైదొలుగుతామని బ్రిటిష్ ప్రధాని ప్రకటించాడు. అన్నదానికంటే ముందుగానే అధికారం అప్పగింతపెట్టి పోతున్నారు 1947 ఆగస్టు 14 అర్ధరాత్రి భారత రాజ్యాంగపరిషత్తు అధికారాన్ని అప్పగింత పెట్టుకుంది. 1885 మిట్టమధ్యాహ్నం కాంగ్రెస్ ప్రథమ సమావేశం జరిగింది. అర్ధరాత్రి లక్ష్యాన్ని సాధించింది. ఇది స్థిరంగా ఉండి పోగలదని జోస్యులు అంటున్నారు.

అర్ధరాత్రి ముహూర్తం చాలా మంచిదట, కనుక భారతదేశం అనతికాలంలోనే తిరిగి వెనుకటి ఔన్నత్యాన్నిపొంది అఖిలాసియాకూ నాయకత్వంవహించి ప్రపంచ శాంతిస్థాపనకు, రక్షణకు తనశక్తిని, ప్రాబల్యాన్ని వినియోగించి పరిషత్తు లక్ష్యతీర్మానాన్ని సార్థకం చేసుకుంటుంది, సందేహంలేదు.





పండిత జవహర్‌లాల్ నెహ్రూ
లాహోరు: 1929—లక్నో: 1936
ఫైజ్‌పూర్: 1937—బొంబాయి: 1946



సుభాష్ చంద్రబోస్
హరిపురా : 1938
త్రిపురి : 1939



వల్లభాయి పటేల్
కరాచి: 1931



నెల్లి సేనుగుప్త
కలకత్తా : 1933



బాబు రాజేంద్రప్రసాద్
బొంబాయి: 1934, 39



ఆచార్య కృపాలినీ
మీరట్: 1946


# అమరమూర్తులు


"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అని ఆదికవి చెప్పిన ముక్క వైషమ్యాలలోనూ అంతఃకలహాలలోనూ పడి మరిచిపోయి, మన మాతృదేశాన్ని బానిసత్వం పాలుచేశాం. అనేకజాతుల వారూ, తెగలవారూ మనదేశంమీద దాడి చేశారు, మనని జయించారు, పరిపాలించారు. మనలో కలిసిపోయారు. కాని మనకు పరాధీనత అంటగట్టినవారు పాశ్చాత్యులు, సామ్రాజ్యవాదులు. వీరిలో వీరికి అంతఃకలహాలూ, పోటీలూ జరిగినా అవి మనకు ఉపకరించలేదు. ఆఖరుకు మనం బ్రిటిషువారి పాలపడ్డాం. బ్రిటిషువారి పరిపాలనకింద మన సర్వస్వమూ కోల్పోయాం — ఆర్థికంగా, సాంస్కారికంగా, నైతికంగా, రాజకీయంగా మనజాతి అధమస్తపుస్థితికి రావటానికి బ్రిటిషువారు సాయపడ్డారు.

కాని ఈ హేయస్థితిని, ఈ పారతంత్ర్యాన్ని మనం మౌనంతో శిరసా వహించి ఊరుకోలేదు. అనేకసార్లు అనేకకారణాలవల్ల మనదేశంలో అనేక ప్రాంతాల్లో, మన దేశీయులలో అనేక తెగలవారు బ్రిటిషువారి పెత్తనంమీద తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటు చేసినవారి అసమర్థత అయితేనేమి, వారి పద్ధతుల్లో లోపం ఉండటం చేతనైతేనేమి, వారిలో కొందరు విద్రోహకులుగా పరిణమించటంవల్ల నైతేనేమి, ఆ తిరుగుబాటును దేశప్రజలు అర్థం చేసుకుని బలపరచని కారణాల అయితేనేమి ఈ ప్రయత్నాలు తాత్కాలికంగా విఫలమయాయి. అయినప్పటికీ కాలక్రమాన స్వాతంత్ర్యకాంక్ష భారతీయులలో ప్రజ్వరిల్లిందేగాని కొడిగట్టిపోలేదు. ఒక్కొక్క తిరుగుబాటే విఫలమవుతున్నకొద్దీ ప్రజల చైతన్యం హెచ్చింది.

నిజానికి కాంగ్రెసునడిపిన జాతీయోద్యమానికీ ఈ తిరుగుబాట్లకూ పోలికలేదు. కాని ఈ తిరుగుబాట్లు సాగించినవారు జాతీయవీరులు, మాతృదేశంకోసం ప్రాణాలర్పించిన దేశభక్తులు, త్యాగమూర్తులు. వీరిని భారతదేశం ఎన్నటికీ మరవలేదు.

వీరికిదేమాశ్రద్ధాంజలి.





**1857**లో జరిగిన సిపాయీల తిరుగుబాటు బ్రిటిషపరిపాలనకు మొదటిదెబ్బకాదు. అంతకుపూర్వం - 1764 లోనే-30 మంది సిపాయిలు తిరుగుబాటు చెయ్యటంవల్ల వాళ్ళను ఫిరంగులయెదట నిలబెట్టి కాల్చటం జరిగింది. 1824లో 47 బెంగాలు కాల్బలదళం బర్మాలో యుద్ధంచేయ నిరాకరించినందువల్ల వారిని బ్రిటిషు సైనికులు తీవ్రంగా శిక్షించి ఉపసంహరించవలసివచ్చింది. 1826-27 లో ఉమాజీ నాయక్ నాయకత్వాన పూనాలో పెద్ద తిరుగుబాటు జరిగింది. 1831-33 లో బీహారులో జరిగిన తిరుగుబాటు అణచటానికి. ఘోర యుద్ధం జరిగింది. 1844లో 7 బెంగాలీ దళాలు తిరుగుబాటుచేశాయి. బ్రిటిషు పరిపాలనమీద తిరుగుబాటు చేసినవారిలో లద్వా. అంగుల్ సంస్థానాలప్రభువు ఉన్నారు, హైద్రాబాదు, తిరువాన్కూరు, కొచ్చిన్ దివాను ఉన్నారు. (వారు ఇప్పటి దివానులవంటి దివానాలుకారు.) 1848లో కాంగ్రా, జాస్వర్, [illegible]ర్ ప్రభువులూ. మూల్సారు వజీరు [illegible]సవారు, గురునానక్ వంశీయుడైన [illegible] విక్రమసింగ్ ఆశీర్వాదంతో బ్రిటిషపరిపాలన అంతమైందని ప్రకటనచేశారు.

1857లో సిపాయీలు తిరగబడడానికి కారణాలు చాలాఉన్నాయి. తాము ఏమిచేస్తున్నదీ తెలియకుండా భారతీయ సైనికులు బ్రిటిషువారికి భారతభూమిని గెలిచిపెట్టారు. వారికి దేశంలో బలం చేకూర్చారు. బ్రిటిషు వారిబలం హెచ్చినకొద్దీ సైనికులయెడ వారి ప్రవర్తన నీచంగా పరిణమించింది. భారతీయ సైనికాధికార్లకు ప్రమోషనులులేవు. వారు సైనికుల అభిమానాన్ని చూరగొన్నపక్షంలో వారిని వెంటనే ఉద్యోగంనుంచి తొలగించి ఇంత డబ్బిచ్చి పంపేసేవారు. తెల్ల అధికార్లు నల్లసైనికులను పశువులకన్న హీనంగా చూసేవారు. బ్రిటిషువారి జండా దూరం విస్తరించినకొద్దీ సైనికులు తమస్వస్థానాలకు దూరమైపోవటం జరిగేది. దీనికి వేరే బత్తెం ఉండేదికాదు. అంతేకాదు వీరిని అధికారులు దేశాంతరాలుకూడా వెళ్ళమనేవారు. సైనికులు నిరాకరించేవారు. 1824లో బెంగాలీసైన్యం చేసిన తిరుగుబాటు ఇందుకే. సైనికులిటువంటి పేచీ పెట్టటానికి వీలుండకుండా 1856 లో గవర్నరు జనరలు ఒకచట్టం అమలులోకి తెచ్చాడు. సైనికుడుగాచేరే ప్రతివాడూ ఎక్కడికి వెళ్ళిపొమ్మన్నా సంసిద్ధుడుగా ఉండాలి. అదివరకు దేశీయసైన్యాలుగా ఉన్నవి ఒక్క కలంపోటుతో సామ్రాజ్యసైన్యాలుగా ఇట్టే మారాయి.

బ్రిటిషు పరిపాలన భారతీయులజీవితంలో ఉన్న సంప్రదాయాలనూ, సంస్కారాన్నీ, వేషభాషలనూ, చిన్నలకూ పెద్దలకూ మధ్య ఉండే పారస్పర్య సౌహార్ద్రాలనూ పూర్తిగా మార్చివేస్తున్నట్టు స్పష్టమయింది. నానా సాహెబుగాని, అయోధ్యా బేగమ్‌కాని ప్రభువులుగా ఉండటంలోనూ, ఈ తెల్లదొరలు ప్రభువు లనుకోవటంలోనూ హస్తిమశకాంతరం కనిపించింది సైనికులకు.

దీనికితగ్గట్టే మరొకటికూడా జరిగింది. తెల్లవాళ్ళు దేవుడికొడుకులనీ, అజేయులనీ, నల్లవాళ్ళమీద పెత్తనం చెయ్యటానికి దేవుడే స్వయంగా వారిని పంపాడనీ భారతీయులలో



నానాసాహెబ్

ఒక అభిప్రాయం ఉండేది. అఫ్ఘనుయుద్ధంలో బ్రిటిషువారికి జరిగిన పరాభవమూ, పంజాబుయుద్ధాలలో సిక్కులు వారిని ప్రతిఘటించటమూచూసినాక ముఖ్యంగా సైనికులలో ఈ మూఢవిశ్వాసం అంతరించింది. ప్లాసీ యుద్ధానంతరం ఒక శతాబ్దంవరకే బ్రిటిషు పరిపాలనఉంటుందనే జోస్యం వ్యాప్తిలోకి వచ్చింది. ఆ జోస్యంప్రకారం 1857 తో బ్రిటిషువాడిబావుటా దిగిపోవాలి. బ్రిటిషుసైనికులసంఖ్య భారతీయసైనికులసంఖ్యలో ఐదోవొంతుకూడాలేదు. తిరుగుబాటుచేసిన మరుక్షణం దేశంలో తెల్లపురుగులేకుండా చెయ్యవచ్చు. కావలసిందల్లా ఏమంటే సైనికులంతా కలిసి నిలబడటం.

తూటాలకు ఆవుకొవ్వూ, పందికొవ్వూ పూశారనీ, అది హిందూముస్లిము సిపాయిల మతాభిమానాన్ని రెచ్చగొట్టిందనీ, ఆకారణంగా సిపాయిలు తిరుగుబాటుచేశారనీ చెప్పటం భావ్యంకాదు. సిపాయిలకు చాలా క్రోధకారణాలుండవచ్చు. కాని వారిప్రయత్నంమటుకు దాస్యవిమోచనమే. సిపాయిలేకాదు సామాన్య ప్రజలుకూడా స్వాతంత్ర్యోద్యమపు పిలుపుకోసం ఆత్రంగా వేచిఉన్నారు. ఈపిలుపు ప్రజలకు అతిగోప్యంగా, సాంకేతికంగా వచ్చింది. ఎక్కడినుండో చపాతీలువచ్చేవి. చపాతీలందిన ఇంటివాళ్ళు చపాతీలుచేసి నలుదిక్కులా తిరిగిపంపించాలి. కొన్నిచోట్ల ఎర్రకలువలు అందించబడ్డాయి. వీటి అంతరార్థం ఎవరికీ స్పష్టంగా తెలియదుగాని, ఏదో జరగనున్నదనీ, దానిలో అందరూ పాల్గొనాలనీ మటుకేతెలుసును. ఈ తిరుగుబాటులో చనిపోయిన వారిలో సగానికి సగం ప్రజాసామాన్య మున్నారు. అదీకాక సైనికులు తిరుగుబాటుచేసి దళాలుగా నడిచినప్పుడు ప్రతిదళమూ ఒక భ్రష్టప్రభువు బావుటాకింద నడిచింది. ఆరోజుల్లో అంతకంటె విస్తృతమైన ప్రజావిప్లవం సాధ్యంగాదు.

1857 తొలిమాసాల్లో బారక్‌పూరులో తిరుగుబాటు ప్రారంభమై శరవేగంతో విస్తరించింది. దీనినిబట్టి విప్లవకారులైన సైనికులకు ప్రజలసహకారం బాగా లభించిందని మనం ఊహించవచ్చు. అలీఘర్, మీరట్ వంటి ప్రదేశాల్లో ప్రజలే సిపాయీలను ఉద్రేకపరచటంకూడా జరిగింది. బ్రిటిషు పక్షంవహించిన ప్రజలు వెలిగా చూడబడ్డారు. బ్రిటిషు అధికారాన్ని ప్రతిఘటించలేనివారు సహాయనిరాకరణం చేశారు. అందుచేతనే బ్రిటిషుసైనికులు నదులు దాటటానికి తెప్పలు దొరకలేదు. కాన్పూరులో బలాత్కారంగా బ్రిటిషువారి సేవకు నియమించ బడినవారు రాత్రివేళ చీకటిమాటున పరారి అయినారు. బ్రిటిషుప్రభుత్వం ఓడినప్రదేశాల్లో ప్రజలు యోధులుగా సైన్యంలో చేరారు. వీరు చేజిక్కిన స్థానాలను సంరక్షించుకోవటానికి కూడా పనిచేశారు.

ఈఉద్యమాన్ని అణచటానికి బ్రిటిషువారు జాతివైషమ్యాలు రేకెత్తించటానికి ప్రయత్నించారు. కాని ఆప్రయత్నాలు ఏమాత్రమూ సాగలేదు. అనేకమంది ముస్లిముప్రభువులు హిందూ సానుభూతికొరకు గోవధ మాన్పించారు. ఢిల్లీలోఉన్న మొగలాయీ చక్రవర్తి స్వదస్తూరితో జయపూరు, జోద్పూరు, బికనీర్, అళ్వారుసంస్థానాధిపతుల కొక లేఖ పంపాడు, హిందూసంస్థానాలవారు తనతో చేతులుకలిపి బ్రిటిషువారిని వెళ్లగొట్టితే తాను సామ్రాజ్యత్యాగంచేసి భారతదేశాన్ని సామం

తులకూటమి పరంచేస్తానని ఆలేఖలో బాదుషా రాశాడు. హిందూరాజులుకూడా ముస్లిముల సఖ్యతకోరారు. కాన్పూరులో నానాసాహెబు తన జెండాతోపాటు ముస్లిము జెండాకూడా ఎగరవేశాడు. ఈ ఉద్యమంనుంచి గమనించ వలసిన మరొక అంశమేమంటే బ్రిటిషు అధి కారులు సిపాయీల తిరుగుబాటు కన్నప్రజల తిరుగుబాటునుచూసే అధికంగా భయపడ్డారు, అందుచేతనే కానింగుప్రభువు తిరుగుబాటులో పాల్గొన్న సామాన్యప్రజను శిక్షించినంతగా సైనికులను శిక్షించలేదు.

1857 మే 10 న మీరటులో ఉన్న సైనికులు ఢిల్లీపై దండయాత్ర ఆరంభించారు. కలకత్తా మొదలు ఢిల్లీవరకూఉన్న బెంగాలు సైన్యాలన్నీ తిరుగుబాటు చేశాయి. సిపాయిలు తిరుగుబాటు చెయ్యనిచోట ప్రజలుకూడా శాంతంగానే ఉన్నారు. మద్రాసు సేనలూ, హిందూస్థానీదళాలు మినహాగా బొంబాయి సేనలూ బ్రిటిషువారియెడల విశ్వాసంగా ఉండిపోయాయి. ఢిల్లీ, మీరట్, రోహిల్ ఖండ్, ఆగ్రా, బెనారెస్, అలహాబాద్, పట్నా, ఛోటానాగపూర్, నీముచ్, అజ్మేర్ప్రాంతాలలో మార్షల్‌లా ప్రకటించబడింది. పంజాబు అయోధ్యలలో మార్షల్‌లా ప్రకటించనప్పటికీ అధికారులు ప్రకటించినట్టే ప్రవర్తించారు. వీటినిబట్టి తిరుగుబాటు జరిగినప్రదేశంయొక్క విస్తృతి తెలుస్తుంది. జూన్ నెలకల్లా అయోధ్యలో 25 వేలమందీ, ఢిల్లీపరిసరాలలో 30 వేలమందీ, మధ్యరాష్ట్రాలలో 50 వేలమందీ తిరుగుబాటుదార్లున్నారు. ఢిల్లీ, అయోధ్య, రోహిల్‌ఖండ్, బుందేల్‌ఖండ్ ప్రాంతాలలో బ్రిటిషుపరిపాలన అంతమయింది. బ్రిటిషు వారు పంజాబుకూ ఢిల్లీకీవెళ్లే మార్గాలన్నీ మూసివేయబడ్డాయి. ఈప్రాంతాలలో సైనికుల తిరుగుబాటుతోపాటు ప్రజల తిరుగుబాటు కూడా జరిగి బ్రిటిష్‌పరిపాలన అంతం కావటానికి కొద్దిగంటలే పట్టింది. ఇక్కడ భారతీయ రక్తబిందువు రాలలేదు.

ఈ తిరుగుబాటు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది ఢిల్లీముట్టడి. దీనికి కావలసిన నాయకత్వాన్నీ, జెండానూ సిపాయీలు తమంతటతామే ఏర్పాటుచేసుకొని అతి సాహసంతోపోరి ఢిల్లీ వశపరుచుకున్నారు, ఢిల్లీ పతనం సిపాయీల తిరుగుబాటుకు రాజకీయ ప్రాముఖ్యం ఇవ్వటమేగాక సైనికులకు కావలసిన ఆయుధాలనుకూడా అందజేసింది. తిరిగి బ్రిటిష్‌వారు ఢిల్లీని పట్టుకొనటానికి చాలా శ్రమఅయింది. పట్టణంలోనిప్రజలు చాలా మొండిగా పోరాడారు. బ్రిటిష్‌సేనలు పట్టణం ప్రవేశించినాకకూడా అడుగడుగునా, వీధివీధినా దొమ్మియుద్ధం జరిగింది. ఢిల్లీలో యుద్ధం అణగారిపోయినా చుట్టుపక్కగ్రామాల్లో సాగుతూనేవచ్చింది.



బీహార్ కేసరి కువర్ సింహ

ఈ తిరుగుబాటు బ్రిటిష్‌వారి ఖ్యాతికి చాలా హాని కలిగించింది. వారికి ఎప్పుడూ అండగా ఉండే పంజాబులోకూడా వారి పరపతి తగ్గిపోయింది. తిరుగుబాటును అణచటానికి ప్రభుత్వానికి 60 కోట్ల రూపాయలు వ్యయం అయింది. తిరుగుబాటుమూలంగా ప్రభుత్వానికి కలిగినష్టం 20 కోట్లు. ఈ సంఘర్షణలో చనిపోయిన భారతీయులసంఖ్య 2 లక్షలు. బ్రిటిష్‌వారు భారతదేశాన్ని జయించటానికి చేసిన యుద్ధాలలో నిహతులయిన భారతీయులసంఖ్య ఇందులో నాలుగోవంతుమాత్రమే. ఇదినిజంగా భారతస్వాతంత్ర్యసమరమే.



తాంతియా టోపే

## దీనికి నాయకులు

ఇది అకస్మాత్తుగా దానంతట అదే బయలు దేరిన ఉద్యమంకాదు. దీనివెనక చాలా పెద్ద ఏర్పాట్లు లేకపోలేదు. ఈ ఏర్పాట్లు చేసినవారిలో చెప్పుకోతగ్గ నాయకులు నానా సాహెబు, అజిముల్లాఖానులని చెప్పవచ్చు. వీరు తిరుగుబాటుకుముందు ఉత్తర దేశమంతా సంచారంచేసి పరిస్థితులు తెలుసుకున్నారు.

ఇంగ్లీషువారి దృష్టిలో నానాసాహెబు విలాసపురుషుడూ, నిర్లిప్తజీవీనూ. 1856లో కూడా అతను తెల్లవాళ్ళకి బ్రహ్మాండమైన విందులు చేస్తూనే ఉన్నాడు. కాని రాబోయే విప్లవంసంగతి ఎరిగుండి నానాసాహెబు తనకు ప్రభుత్వం దగ్గిరఉన్న సెక్యూరిటీలన్నీ అమ్మేసి 50 లక్షల రూపాయల రొఖ్ఖం పోగుచేసి ఉంచాడు. అతని ఉద్దేశం బ్రహ్మకు తెలీదు. నేడో రేపో తిరుగుబాటు జరుగుతుం దనగాకూడా నానాసాహెబును కాన్పూరుపిలిచి అక్కడి కలెక్టరుదొర ప్రభుత్వ ఖజానా కాపాడేభారం ఆయనిమీద వేయడం జరిగింది.

నానాసాహెబు కుడిభుజ మనదగిన అజీ జుల్లాఖాను విచిత్రవ్యక్తి. అతను ఒకప్పుడు వంటమేస్త్రీ. ఈ వృత్తిలోఉండి అతను ఇంగ్లీషు ఫ్రెంచిభాషలు నేర్చాడు. ఈ స్థితి నుంచి అతను నానాసాహెబు సలహాదారుడై పీష్వా తరపున వాదించటానికి ఇంగ్లండు పంపబడ్డాడు. లండను నాగరికస్త్రీలు అతన్ని చూసి మురిసిపోయారు. ఇంగ్లండులో ఉన్న కాలంలో అతను బ్రిటీషువారి లోతుపాతులు కనుక్కొన్నాడు. అక్కడనుండి క్రైమియా యుద్ధభూమికి వెళ్ళి వారి యోధశక్తి తెలుసు కున్నాడు. వస్తూవస్తూ దారిలో టర్కీ, అఫ్ ఘనిస్తాను దేశాల సహకారం అర్థించాడు బ్రిటీషువారిని పడగొట్టటానికి.

ఫైజబాదుకు చెందిన మౌల్వీ అహ్మద్‌షా గొప్ప నిర్వహణశక్తి గలవాడు, వక్త, ప్రతిభావంతుడైన నాయకుడు. అయోధ్యను రెచ్చగొట్టి మంటలు కురిపించినవా డితనే. బ్రిటీషువారిచేత చిక్కి మరణశిక్ష విధించబడిన ఇతనిని తిరుగుబాటు సైనికులు రక్షించారు.

తిరుగుబాటు సైనికులకు నాయకులు అహ్మద్‌షా, కుంవర్‌సింగ్, తాంతియాటోపే, ఝాన్సీ లక్ష్మీబాయి. వీరు గరిల్లా యుద్ధంలో నేర్పరులేకాని బహిరంగయుద్ధంలో ఆరితేరిన బ్రిటీషు సేనానులకు చాలలేదు. ముఖ్యంగా 80 ఏళ్ళ వృద్ధు, కుంవరసింగు గరిల్లా యుద్ధంలో సాటిలేనిమేటి.

తాంతియాటోపే నానాసాహెబుకు ఆబాల్య స్నేహితుడు. శివాజీ పరాక్రమ చాతుర్యాల కతను వారసుడు. యుద్ధనిపుణుడు. అతను తిరుగుబాటు సైన్యాలను క్లిష్టపరిస్థితులనుండి అనేకమార్లు రక్షించాడు. గ్వాలియరుదుర్గాన్నీ, ఖజానానూ, ఆయుధాగారాన్నీ తిరుగుబాటు దార్లు పట్టుకొన్నది అతని ప్రజ్ఞవల్లనే. తన సైన్యాన్ని నర్మదదాటించి ఇతను దక్షిణ దేశంలో అడుగుపెట్టించి తన వెంటపడిన బ్రిటీషు సేనలను తొమ్మిది మాసాలపాటు ముప్పుతిప్పలుపెట్టి మూడు వేలమైళ్ళు పరిగెత్తించాడు. అతని పతనానికి అతని అనుచరాధము డొకడు కారణభూతుడైనాడు.

అందరికన్న ప్రజల హృదయాలను ఈనాటికీ కదిలించి చరిత్రకెక్కిన వ్యక్తి ఝాన్సీరాణి లక్ష్మీబాయి. ఈమె 23 సంవత్స

లాలుమాత్రమే జీవించింది. కాని భారత వీరులలో ఈమె అసమానతార. తిరుగుబాటు మేఘాలలో ఈమె మెరుపులా మెరిసింది. తిరుగుబాటు జరగగానే ఈమె రణరంగంలోకి ఉరికింది. ఈమె డాలు పారేసి కత్తిపట్టిందని అన్నారు. ఆమె అపజయం ఎరగదు. ఝూన్సీ పడిపోయినాక ఒక్క రోజులోపల బ్రిటిషు సైనికులతో యుద్ధంచేసి తప్పించుకుంటూ 102 మైళ్ళు స్వారీచేసింది. మగదుస్తులు ధరించి, గుర్రం ఎక్కి, చేత కత్తిపట్టి యుద్ధంచేస్తూ లక్ష్మీబాయి వీరమరణం పొందింది. ఈమెనుగురించి ఒకదొర, "మన విరోధులలోకల్లా ప్రజ్ఞావంతుడు," అని రాసుకున్నాడు.

## దారుణాలు

ఈ తిరుగుబాటులో ఇరుపక్షాలవారికీ రక్త దాహం పెరిగింది. బ్రిటిషువారు భారతీయుల రక్తదాహంగురించే వర్ణిస్తారు. కాని వారిపక్షాన తక్కువైన దేమీలేదు.

తెల్లవాళ్ళను హతమార్చటం విప్లవకారుల కార్యక్రమంలోఉంది. అనేకచోట్ల సైనికులు తెల్లవాళ్ళని ఊచతరిగారు. ఇటువంటి సంఘటనలు కాన్పూరులోనూ ఢిల్లీలోను దారుణంగా జరిగాయి. కాని బ్రిటిషు అధికారులు సిర్దాక్షిణ్యంగా ప్రవర్తించకపోతే అటువంటి దారుణసంఘటనలు జరక్కపోను. భారతీయ సైనికులను నరహంతకులన్న తెల్లవాళ్ళు ప్రతి తెల్లప్రాణానికీ అనేకవందలభారతీయులను బలి పుచ్చుకున్నారు. బ్రిటిషు అధికారులను కొరత వేయటమూ, ఇతర తెల్లదొరలను చంపి వెయ్యటమూ, కొంతవరకు అవసరమై ఉండవచ్చు. కాని తిరుగుబాటుదార్లు తెల్లస్త్రీలను పిల్లలనూకూడా హత్యచెయ్యటం భారత చరిత్రలో మాయని మచ్చ.

కాని నాగరికులైన బ్రిటిష్‌వారు ఝాన్సీలో చచ్చిన 75 మంది తెల్లప్రాణులకుగాను



ఝూన్సీ లక్ష్మీభాయి

5 వేల భారతీయులను హత్యచేశారు. ఊరంతా సిపాయీలచేత వారంరోజులు కొల్లగొట్టించారు. ఢిల్లీలో కొద్దిమంది తెల్లవాళ్ళు చనిపోయినందుకు 26 వేల ప్రజలను కాల్చారు, పొడిచారు, ఉరితీశారు. తిరుగుబాటుదార్ల జండా ఎగరవేసినందుకు పసికందులను ఉరితీశారు.

లాహోరులో ఇద్దరు తెల్లవాళ్లు చచ్చినందుకు అమృతసరు డెప్యూటీకమిషనరు ఫ్రెడ్రిక్ కూపరు 237 గురిని ఉరితీశాడు. మరో 45 మంది ఇరుకుకొట్లో ఊపిరాడక చచ్చారు.

పన్నెండుగురు మనుషులు బ్రిటిష్‌సైనికులనుచూసి పెడమొహాలు పెట్టినందుకు అందర్నీ అక్కడే చెట్లమీద ఉరితీశారు; ఒక బ్రిటిష్‌సైనికదళం అందిన ప్రతిభారతీయుణ్ణీ చంపింది. ఈదళం ఒక్క అలహాబాదులో 6 వేలమందిని ఆహుతి పుచ్చుకుంది. దీని నాయకుడు నీల్‌దొర.

ఇదంతా చాలక ముస్లిములను పంది చర్మా లలో కుట్టి నదులలోపారేశారు. పంది కొవ్వు వారిశరీరాలకు పట్టించి ఉరితీశారు. ఫతేగడ్ దివాన్ నోట పందిమాంసంకుక్కి ఉరితీశారు. హిందువులకు బలాత్కారంగా ఆవుమాంసం పెట్టారు. బ్రిటిష్‌వారి ఈపైశాచిక ప్రవర్తనకు కారణం పగమాత్రమే కాదు, జాత్యహం కారం.

## తిరుగుబాటు విఫలమైనకారణాలు

1857 లో సిపాయీల తిరుగుబాటు జరిగే సమయానికి క్రైమియాలోనూ, చైనాలోనూ యుద్ధాలుముగిసి బ్రిటిష్ సైనికులు తిరుగుబాటు అణచటానికి భారతదేశం రాగలిగారు. పై పెచ్చు వారు మంచి యుద్ధానుభవంతో ఇక్కడ దిగారు. వారు స్వేచ్ఛగా రావటానికి అను కూలంగా రేవులన్నీ బ్రిటిష్‌అధికార్ల చేతి లోనే ఉండిపోయాయి. మొత్తం బ్రిటిష్ సైన్యంలో సగంభాగం—లక్షపై చిల్లర సైని కులు—తిరుగుబాటు అణచటానికి ఉపయో గించబడ్డారు. వారి ఆయుధాలు తిరుగుబాటు దార్ల ఆయుధాలకన్న ఎంతో ఉత్తమమైనవి. తిరుగుబాటుదార్ల చేతిలోఉన్న ఆయుధాలలో కత్తే ప్రధానమైనది. బ్రిటిష్‌సైనికులు ఎన్ఫీల్డు రైఫిల్స్ తెచ్చారు. తిరుగుబాటుదార్ల చేతిలో కనీసం మర తుపాకులున్నప్పటికీ జయించి ఉండేవారు.

బ్రిటిష్‌వారిచేతిలో టెలిగ్రాఫుకూడా ఉంది. అది తిరుగుబాటు నణచటానికి బాగా ఉపక రించింది.

ఇంతా అయినప్పటికీ తిరుగుబాటుదార్లు ఒక్కసారిగాలేచి శరవేగంతో పనిచేసినట్ట యితే బ్రిటిష్‌వారిఆట కట్టిఉండేదే. జూను 22న ప్రారంభంకావలసిన తిరుగుబాటు మీర టులో మే 10 నే ప్రారంభమయింది. అది విస్తరించటానికి వ్యవధి పట్టింది.

సంస్థానాలవారు బ్రిటిషును ఎదిరించలేదు. "సింధియామహారాజు తిరుగుబాటులో చేరితే నేను మూటాముల్లె సర్దుకోవచ్చు" అన్నాడు గవర్నరు జనరల్‌కానింగ్. కాని సంస్థానాల వారు ఎదురుతిరగలేదు. ఒకకారణం ఏమం టే, వారి వారసత్వాలు నిర్ణయించేహక్కు బ్రిటిష్‌వారిచేతిలో ఉంటూవచ్చింది. మరొక విషయమేమంటే పర్మెనెంటు సెటిల్మెంటు మూలంగానూ, సంస్థానాల మూలంగానూ బ్రిటిష్‌వారు తమరాబడి 60 కోట్ల రూపా యీలలోనూ సగం సంస్థాలకోసం పో జార్చారు. అంత ఖరీదుగా అమ్ముడుపోయిన బ్రిటిష్‌వారికి అదనులో అండగా నిలిచింది పాలకవర్గం.

సిపాయీలు కర్షకవర్గానికి చెందినవారు. వారు తిరుగుబాటుచేసినచోట ప్రజలు వారి వెంట లేచారు. కాని ఇతరచోట్ల సాగిన విప్ల వంలో కర్షకవర్గానికి స్థానంలేదు. వారికి పిలుపులేకపోగా విప్లవం విజయవంతమైనట్ట యితే జమీందారీవర్గం మరింత బలపడి వారి స్థితి మరింత అన్యాయమయేటట్టు కనపడింది. ఇటువంటిచోట్ల సాగినపోరాటం జమీందారీ సంస్కృతితో నడిచింది. తిరుగుబాటునాయకుల కి విజ్ఞానం లేకపోయింది.

సిపాయీలుకూడా మధ్యమార్గాలనుండి అధికంగా వచ్చినచోట తిరుగుబాటుచేశారు. (బెంగాలు, అయోధ్య, బెనారెస్, బుందేల్ ఖండ్) సిపాయీలు తక్కువ వర్గాలనుంచీ, కులాలనుంచీ వచ్చినచోట బ్రిటిషువారికి అండగా నిలిచారు. ముఖ్యంగా మద్రాసులోనూ బొంబాయిలోనూ ఈ సిపాయీలను సకుటుం బంగా సైనికాదరణలలో నివసించనివ్వటం బ్రిటిషువారికి ఉపకరించింది. 1857 లో దేశంలోఉన్న హీనజాతులకు సహితం పిలుపు వెళ్ళిఉన్నట్టయితే ఆనాడే మనకు స్వాతంత్ర్యం లభించిఉండేది.

# ఆలీపూర్ కుట్ర కేసు

సిపాయీల తిరుగుబాటు అనంతరం బెంగాలులో విప్లవాగ్ని బాగా చల్లారిపోయింది. ఇది తిరిగి 1905 లో బెంగాలు విభజన జరిగినప్పుడు మహోజ్వలంగా ప్రజ్వరిల్లింది. దాదాపు 8 కోట్ల ప్రజ గల విస్తీర్ణమైన రాష్ట్రాన్ని రెండుగా విభజించేసరికి బెంగాలులో ఉన్న కవులూ, మేధావులూ, ప్రజానాయకులూ, యువకులూ ఒక్కసారిగా బ్రిటిషు విద్వేషులయిపోయినారు. సాంఘికంగా స్వదేశ ఉద్యమమూ, విదేశవస్తు బహిష్కరణోద్యమమూ తీవ్రంగా విజృంభించాయి. హిందూ మతావేశంకూడా ప్రబలింది. వివేకానందస్వామి ఈ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. రాష్ట్రమంతటా రామకృష్ణ మఠాలు నెలకొన్నాయి. ఈ వాతావరణంలో యువకులలో విప్లవాగ్ని రగుల్కొన్నది.

యువక విప్లవకారులకు ముఖ్యనాయకుడు శ్రీ అరవిందయోగి తమ్ముడు వారీంద్రుడు. ఇతను 1904 బెంగాలు విభజన నిర్ణయం జరుగుతూండగానే - బెంగాలులో అన్ని ప్రాంతాలూ పర్యటనంచేసి ప్రతిజిల్లా కేంద్రంలోనూ ఒక వ్యాయామ మందిరం ఏర్పాటుచేశాడు. ఈ మందిరాలలో మామూలు వ్యాయామంతోపాటు కుర్రవాళ్ళకు రాజకీయోపన్యాసా లివ్వబడుతూ ఉండేవి. కాలక్రమాన రాజకీయాలతోబాటు ఈ వ్యాయామ మందిరాలలో ఆధ్యాత్మిక చర్చలుకూడా ప్రారంభమైనాయి.

వారీంద్రుడు 1905 లో స్వదేశీ ఉద్యమంలో బాగా పనిచేశాడు. వివేకానందుడి సోదరుడైన భూపేంద్రనాధదత్తు, అవినాశ భట్టాచారీ, దేవవ్రత్ మొదలైన వారితో 50 రూపాయిల పెట్టుబడితో "యుగాంతర్" పత్రిక ప్రారంభించాడు. ఇతనిచుట్టూ చాలా మంది అనుచరులు చేరారు.

"యుగాంతర్" పత్రిక కొద్దిమాసాలలోనే వెయ్యినుంచి 20 వేల కాపీలకు అభివృద్ధి అయింది. అందులో రాజకీయ విమర్శలు అతినిశితంగా ఉండేవి. ప్రభుత్వగూఢచారులు దానిమీద కన్నువేసి ఉంచారు. దీని అసలు సంపాదకుడెవరో ప్రభుత్వానికి తెలియలేదు. భూపేంద్రనాధుని ఎరెస్టుచేశారు. అతనికి మేజిస్ట్రీటు కింగ్స్‌ఫోర్డు ఒక సంవత్సరం శిక్షవేశాడు. ఇది మొదలు "యుగాంతర" సంపాదకులు ఒక్కొక్కడే జైలుకు వెళ్ళసాగారు.

మానిక్తలా బాగ్‌లో వారీంద్రుడు ఒక విప్లవకేంద్రం స్థాపించాడు. నవశక్తి సంపాదకుడు దేవవ్రతుడూ, బాంబులుచేయటం తెలిసిన హేమచంద్రదాసువంటివాళ్ళు ఈ



మానవేంద్రనాథ (ఎం. ఎన్.) రాయ్ 14 వ ఏటనే విప్లవకారుడైనాడు. 1914 లో దేశాన్ని వొదిలి వెళ్లాడు. 1917 లో రష్యన్ విప్లవంలో పాల్గొన్నాడు.

కేంద్రంలో చేరారు. 1907 లో బాంబులు చేయ నారంభించారు. రాష్ట్రమంతటా "అనుశీలనసమితులు" ఏర్పడ్డాయి. వీటిలో ఒకటి పైకివచ్చింది. దీనికి తూర్పుబెంగాలులోనూ పశ్చిమ బెంగాలులోనూకూడా కేంద్రాలున్నాయి. దీనికి రాష్ట్రంలో 500 శాఖలు. వీటిన్నిటికీ ఆశయం ఒకటే: బ్రిటిషు పరిపాలన అంత మొందించటం. ప్రభుత్వ దమననీతి ప్రజలకు హేయంగానూ, దుర్భరంగానూ ఉంది. బెంగాలు లెఫ్టినెంటుగవర్నరు ఆండ్రూఫ్రేజరునూ, కింగ్స్‌ఫోర్డునూ తుదముట్టించాలని యువకులు సంకల్పించారు. ఫ్రేజరును చంపటానికి మూడు ప్రయత్నాలు జరిగాయి. ఒకటీ ఫలించలేదు.

హూగ్లీతీరానచంద్రనాగోరులో కనయలాల్ దత్తు అనే అతని ఇంటో మరొక కేంద్రం స్థాపితమయింది. ఇది ఫ్రెంచివారి కిందఉన్న ప్రదేశం. ఇక్కడ బాంబులుచేయాలంటే అక్కడి మేయరుచేసినశాసనం అడ్డొచ్చింది. మేయరును చంపాలని ప్రయత్నించారు కాని ప్రయత్నం విఫలమయింది.

పోతే కింగ్స్‌ఫోర్డు ఒకడు మిగిలి ఉన్నాడు. ఇతనిమీద ఇంకా ప్రయత్నం జరగలేదు. ఇతనిప్పుడు ముజఫర్‌నగరు సెషన్సు జడ్జీగా ఉన్నాడు. విప్లవకారులు కింగ్స్‌ఫోర్డుకు బాంబులు పుస్తకాల రూపంలో కట్టి పంపారు. అతను అవి అందుకున్నాడు గాని ఏకారణంచేతనో విప్పలేదు.

కింగ్స్‌ఫోర్డుమీద స్వయంగా బాంబువెయ్యటానికి ప్రఫుల్ల చంద్రచాకీ అనే యువకుడూ, మేదినీపూరు వాడైన ఖుదీరాంబోసు అనే కుర్రవాడూ బయలుదేరి ముజఫర్‌పూరు వచ్చారు. కింగ్స్‌ఫోర్డుకు అంగరక్షలు బాగా ఉన్నాయి. 10, 12 రోజులపాటు అతడు వీరికి దొరకనేలేదు. సాయంకాలంపూట కింగ్స్‌ఫోర్డు క్లబ్బునుంచి కారులో ఇంటికి వచ్చే సమయంలో చంపుదామనుకున్నారు. కాని దురదృష్టవశాత్తూ మరొక కారునుచూసి అది కింగ్స్‌ఫోర్డుదని పొరబడి, బాంబుతో ఆ కారులోఉన్న ఇద్దరు స్త్రీలను హత్యచేశారు. ఇది జరిగినది 1908 ఏప్రిల్ 30 రాత్రి 8-30 గంటలకు. ఈపనిచేసి చాకీ, ఖుదీరాంబోసులు చెరొక దిక్కుగానూ పారిపోయినారు. మే 1న ఖుదీరాం దొరికిపోయినాడు. చాకీకూడా దొరికిపోయినాడు కాని అతను తనను ఎరెస్టుచేయ వచ్చిన ఇన్స్పెక్టరును కాల్చటానికి ప్రయత్నించి విఫలుడై తన్ను తానే కాల్చుకున్నాడు.

ఖుదీరామును స్పెషల్ జడ్జిఎదట విచారించి ఉరిశిక్ష విధించారు. 1908 ఆగస్టు 11న అతను ఉరితీయబడ్డాడు. అతని శరీరాన్ని బ్రహ్మాండమైన ఊరేగింపుతో శ్మశా

నానికి తీసుకుపోయి దహనం చేశారు. అతని అస్తికలు దంతపు డబ్బాలలోనూ, వెండి బంగారు డబ్బాలలోనూ పట్టుకుపోయారు.

ఇదిజరిగిన కొద్దిరోజులకే 1908 మే నెలలో వారీంద్రుడునడిపే కేంద్రాలు తొమ్మిదింటిమీద పోలీసుదాడి జరిగింది. వారీంద్రుడితోసహా 25 మంది పట్టుబడ్డారు. (ఇందులో 12 మందిని విచారణానంతరం వదిలేశారు.) మరో రెండువారాలకు ముద్దాయిల సంఖ్య 32 కు పెరిగింది. 18 వ తేదీన విచారణ సాగినాక మరికొంతమంది ఎరెస్టయినారు. అందరికీ జైలు విధించబడింది. జైలుశిక్ష పొందినవారిలో నిర్దోషులు చాలామంది ఉన్నారు. వారిని విడిపించటానికిగాను వారీంద్రుడున్నూ మరో ఇద్దరు అనుచరులున్నూ హత్యా ప్రయత్నాలనేరం పూర్తిగా తమమీదనే వేసుకుని ఏశిక్షఅయినా పొందటానికి సిద్ధపడ్డారు కాని ప్రయోజనం లేకపోయింది.

ఇంతలో అకస్మాత్తుగా నరేంద్రనాథ్ గోస్వామీ అనేవాడు ప్రభుత్వసాక్షిగామారి జైలువిడిచి బయటికివెళ్ళాడు. అతన్ని అధికారులు ఆస్పత్రిచేర్చి, అక్కడ తెల్లవాళ్ళ అంగరక్షణ ఇచ్చారు. సత్యేంద్రకుమార్, కనయిలాల్ అనేవాళ్ళిద్దరూ గోస్వామి అంతుకనుక్కోవాలని ఏదో మిషమీద ఆసుపత్రికి మార్పించుకున్నారు. సత్యేంద్రుడు తానుకూడా ప్రభుత్వ సాక్షి అవుతాననీ, గోస్వామితో సంప్రదించాలనీ కబురుచేశాడు. ఈ విధంగా చేరి వాళ్లు అప్రూవరు గోస్వామినిచంపి ఆ నేరానికిగాను ఉరితీయబడ్డాయి.



రాసవిహారీబోస్ (రాసూదా)

బెంగాల్ విప్లవోద్యమానికి పట్టుకొమ్మ. 1914 లో ప్రభుత్వానికి చిక్కకుండా జపాను పారిపోయి అక్కడే ఉండిపోయి 1942 లో భారత స్వాతంత్ర్యసమితి (సింగపూర్) కి అధ్యక్షుడైనాడు.

---

ఈకేసు విచారణ ఆలీపూరు హైకోర్టులో జరిగింది. ముద్దాయిల తరఫున చిత్తరంజన్ దాసు డబ్బుపుచ్చుకోకుండా వాదించాడు. వారీంద్రుడికీ, మరొకరికీ ఉరిశిక్ష విధించారు. మిగిలినవారికి ద్వీపాంతరవాసం లగాయితు శిక్షలు విధించారు. వీటిమీద అపీలు చేయగా అపీలు విచారణ 1910 ఫిబ్రవరీవరకు నడిచింది. చివరకు వారీంద్రుడున్నూ మరో తొమ్మిదిమందితోబాటు ద్వీపాంతరం పంపబడ్డాడు.



## లాహోరు కుట్రకేసు ముద్దాయిలు



వి. జి. పింగలే



కర్తార్ సింగ్



జగత్ సింగ్



రహమత్ అలీ షా



కేహర్ సింగ్



కాశీరామ్



అమీర్ చంద్



జీవన్ సింగ్



సోహన్‌లాల్

# లాహోరు కుట్ర కేసు

ఇది 1915లో జరిగింది.

అమెరికానుండి భారతదేశానికి వచ్చిన గదర్‌పార్టీ సభ్యులు తమతమ ప్రాంతాలకు వెళ్ళి అక్కడి సైనికులతో కలిసి మాట్లాడి, వారిలో తిరుగుబాటుప్రేరేపించి తద్వారా స్వాతంత్ర్యం తీసుకురావాలని నిర్ణయించుకున్నారు. సైనికులు తిరుగుబాటుచేస్తే పరప్రభుత్వం పడిపోయేటట్టు కనిపించింది, తేదీ నిర్ణయించితేవాలు సైనికులు తిరుగుబాటు చేసేటట్టు కనిపించారు.

విప్లవం అంత సులభసాధ్యమైతే ప్రపంచంలో దాస్యమే ఉండదు. దేశంలో బ్రిటిషువారి గూఢచారులూ మాతృద్రోహానికి ఒడిగట్టే భారతీయాధములూ ఉన్నారు. వీరే బ్రిటిషువారికి సరిఅయినబలం, సైనికుల తిరుగుబాటుకు జరిగే ప్రయత్నాలన్నీ అధికారులకు తెలుస్తూనేఉన్నాయి. కర్తార్‌సింగు, పింగళే అనే విప్లవకారులు చేసేప్రచారం వారికి తెలుస్తూనేఉంది. తిరుగుబాటు ఏర్పాట్లు పూర్తి అయ్యే సమయానికి సైనికాధికారులు తిరుగుబాటుచేసే సైనికులనుపట్టుకుని రహస్యంగా కాల్చేశారు.

ప్రసిద్ధమైన ఈ లాహోరు మొదటి కుట్ర కేసులో 65 గురు విచారించబడ్డారు. జైలు వార్డులో విచారణ.విచారణకు ముగ్గురు జడ్జీలు. అందులో ఒకడు భారతీయుడు. కోర్టుకు ప్రజలను రానివ్వలేదు. ముద్దాయి లిచ్చిన వాఙ్మూలాలు ప్రకటితంకాలేదు. ప్రభుత్వం పంపిన వార్తలుమాత్రమే పత్రికల్లో పడ్డాయి. ముద్దాయిల తరపున వాదించటానికి వారు కోరిన ప్లీడర్ల నివ్వలేదు. అనుభవంలేని అసమర్థులను ఏడుగురినిచ్చారు. ముద్దాయిలలో 9 మంది అప్రూవర్లుగా మారారు.1915మార్చిలో విచారణ జరిగింది.

ముద్దాయిలు న్యాయానికి ఆశించలేదు. విచారణ విషయంలో నిర్లక్ష్యంగా ప్రవర్తించారు. వారిలో గదర్‌పార్టీ యావజ్జీవసభ్యులు 15 మంది ఉన్నారు. అందు ఏడుగురు నేరభారం తమమీదనే వేసుకుని భారతీయ విప్లవానికి ప్రతినిధులుగా నిలబడాలనుకొన్నారు. కర్తార్‌సింగు దొమ్మిలో పాల్గొన్నాడు. ఆ దొమ్మిలోజరిగినహత్యకు బాధ్యత తనమీదే వేసుకున్నాడు. అతని ధైర్యానికి జడ్జీలు నివ్వెరపోయినారు.

విచారణ అయిపోయి తీర్పులో 25 గురికి మరణశిక్ష విధించారు. 20 మందిని ద్వీపాంతరం పంపారు. మిగిలినవాళ్ళకి వివిధశిక్షలిచ్చారు. ఉరిశిక్షపడ్డవారిలో ఖూనీ కేసుకు సంబంధించినవారు ముగ్గురే. 15 మంది ఓడలోనే ఎరక్కయినవాళ్ళు. ఉరిశిక్ష విధించిన వారిలో పృధ్వీసింగూ, భాయీ పరమానంద కూడా ఉన్నారు. ఉరిశిక్షమీద వైస్రాయికి అప్పీలుచేయగా 7గురికి ఉరి ఖాయమయింది. అందులో కర్తార్‌సింగూ, పింగళే,జగత్సింగూ మొదలైనవాళ్ళున్నారు. మిగిలినవారి ఉరిశిక్ష ద్వీపాంతరశిక్షగా మార్చబడింది. భారతదేశంలో బ్రిటిషువారి పరిపాలన నాలుగు కాలాలపాటు ఉండడానికి ఇటువంటి హాస్యాస్పదమైన విచారణలకు మన స్వాతంత్ర్య యోధులు గురికావలసివచ్చింది.

# గదర్‌పార్టీ నాయకులు



సఖా సింగ్



కేసర్ సింగ్



నిధాన్ సింగ్



జ్వాలా సింగ్



ప్యారా సింగ్



సోహన్ సింగ్



ఉద్ధమ్ సింగ్



ఇంద్ర సింగ్



మంగళ్ సింగ్



పృధ్వీ సింగ్



జగత్ రామ్



ప్రొఫెసర్ పరమానంద్

# గదర్ పార్టీ

గదర్‌పార్టీ పుట్టింది అమెరికాలో. అమెరికా స్వతంత్రదేశం. బ్రిటిషువారితో పోరి స్వాతంత్ర్యం సంపాదించుకుని ప్రజాస్వామ్య సిద్ధాంతాలమీద రాజ్యాంగంనిర్మించుకొన్నది. అందుచేత అమెరికాచేరిన భారతీయులలో ఒక నూతన స్వాతంత్ర్య కాంక్ష మొలకెత్తింది. అదీకాక అక్కడి భారతీయులు చైనాలోనూ, టర్కీ పర్షియాలలోనూ రేగిన ప్రజా ఉద్యమాలనుగురించి తెలుసుకున్నారు. భారతదేశాన్నికూడా బానిసత్వం నుంచి తొలగించి స్వాతంత్ర్యం నెలకొల్పాలని అమెరికాలోని భారతీయులు నిశ్చయించుకుని గదర్‌పార్టీ స్థాపించి గదర్ పత్రికను 1911లో శాన్ ఫ్రాన్సిస్కో నుంచి వెలువరించారు.

గదర్ ఉద్యమాన్ని ప్రారంభించినవారు జ్వాలాసింగ్, సోహన్‌సింగ్, జేర్‌సింగ్, ఉద్దామ్‌సింగ్, కర్తార్‌సింగ్, జగత్‌రామ్ అనేవారు. గదర్ పత్రికకు లాలా హర్దయాల్ సంపాదకుడు. అది స్వంతప్రెస్‌లో అచ్చువేయబడేది. అక్కడి భారతీయులు దాని కొరకు కనకవర్షం కురిపించారు. గదర్ పత్రిక అమెరికాలోని భారతీయులలో మంచి చైతన్యం తెచ్చింది.

స్వర్గానికిపోయినా వడేకులు తప్పనట్టు, ప్రజలందరికీ సమాన ప్రతిపత్తిగల అమెరికాలోకూడా భారతీయులు తమ బానిసబుద్ధిని విడవలేక బ్రిటిషువాడు కనిపించగానే గులాములైపోయేవారు. బ్రిటిషువాళ్ళు అవకాశం దొరికిందేచాలునని భారతీయులమీద అజమాయిషీ చేస్తూండేవాళ్ళు. గదర్‌పత్రిక ఈ పరిస్థితిని తారుమారుచేసేసింది. తమపై అధికారం చెయ్యటానికి ప్రయత్నించిన బ్రిటిషువాళ్ళకు భారతీయులు దేహశుద్ధి చేయసాగారు.

ఈవిధంగా గదర్‌పార్టీ అమెరికాలోని భారతీయులలో జాగృతి కల్పిస్తూ ఉండటం చూసి బ్రిటిషురాయబారి అమెరికాప్రభుత్వాన్ని ఒత్తిడి చెయ్యసాగాడు. పార్టీకి ముఖ్యనాయకుడూ, మేధావీ అయిన హర్దయాలును అక్రమంగా ఎరెస్టుచేసి స్వదేశానికి పంపించి, పార్టీని ధ్వంసంచెయ్యటానికి పూనుకున్నారు. తెలివిగల వేగులవాళ్ళను పంచమాంగదళంగా పార్టీలో ప్రవేశపెట్టారు. ఈ వేగులవాళ్ళు

పార్టీలో ఉన్నతస్థానాలు సంపాదించారు. సరిఅయిన నాయకత్వం లేక కార్యక్రమం లేకుండా ఉండిపోయింది గదర్ పార్టీ.

ఈరోజులలో కెనడాలో వలసఉన్న భారతీయులు మాతృదేశాన్నుండి తమవారిని రప్పించటానికి ప్రయత్నాలు చేశారు. కాని కెనడా ప్రభుత్వం వారికేమీ సహాయం చేయలేదు. అప్పుడు గదర్ పార్టీ సభ్యుడైన బాబా గుర్దీత్‌సింగ్ అనేఆయన "కొ మ గా టా మారూ" అనే స్టీమరును మాట్లాడి అందులో 400 మంది భారతీయులను కెనడా రప్పించాడు. వీరు చాలాభాగం సిఖులు, కాని కొంత మంది పంజాబీ ముస్లిములుకూడా ఉన్నారు. ఈస్టీమరు కెనడాలో వాన్కూవరుపట్టణం చేరింది. కాని భారతీయులు ఓడదిగటానికి ప్రభుత్వం అనుమతించలేదు. అందుచేత స్టీమరు వెనక్కుతిరిగి పోవలసివచ్చింది. ఈ ప్రయాణీకులలో కొందరు హాంకాంగులో ఎక్కారు. అయినప్పటికీ హాకాంగులోకూడా వీరిని దిగనివ్వలేదు. అందుచేత పడవ కలకత్తావెళ్ళి బడ్జి-బడ్జిరేవులో ప్రయాణీకులను దింపింది. ఈ సంఘటనలన్నీచూసి ప్రయాణీకులు కోపోద్దీపితులై పోయినారు. గదర్ పార్టీ వారిప్రబోధం వారిమీద బాగా పనిచేసింది. తమ బానిసత్వం వారు చవిచూచారు.ఇండియా ప్రభుత్వంవారు ఈ ప్రయాణీకుల వైఖరి చూసి భయపడి వీరిని స్వేచ్ఛగా గ్రామాలకు వెళ్ళనివ్వక వీరందరినీ పంజాబు చేర్చటానికి ఒకరైలు ఏర్పాటుచేసి అందులో ఎక్కమన్నారు. వీరు నిరాకరించి అధికారులను ఎదిరించారు. ఈ సంఘర్షణలో 18 మంది సిక్కులు చనిపోయారు. గుర్దీత్‌సింగ్‌తోసహా 29 మంది తప్పించుకుపోయారు. అధిక సంఖ్యాకులు అరెస్టుచేయబడి అందులో 31 మంది ఖైదుచేయబడ్డారు.

"కొమగాటా మారు" ఉదంతాన్నిగురించి గదర్ పత్రిక ప్రత్యేకసంచిక ప్రకటించింది. దీనిఅనంతరం అమెరికాలోని వలసభారతీయ లొకచోట సమావేశమై 100 మందీ స్వాతంత్ర్యసైనికులను ఎన్నుకొని వారి ద్వారా భారతీయవిప్లవం సాగించటానికి నిర్ణయించారు. ఈ 100 గురూ 1914 అగస్టు 5 తేదీన స్టీమరులో స్వదేశానికి ప్రయాణమైనారు. వీరిలో పృధ్వీసింగుకూడాఉన్నాడు.

ఈ స్వాతంత్ర్యయోధులకు ఆశయమే తప్ప సరిఅయిన కార్యక్రమంలేదు. ఇందులో ఆవేశపూరితులు ప్రభుత్వంతో వ్యష్టి యుద్ధానికి సిద్ధపడినప్పటికీ నాయకు లాపద్ధతినామోదించలేదు. వీరు హాంకాంగు చేరి "టోసా మారూ" అనే స్టీమరులో కలకత్తాకు వచ్చారు. ఈ ఓడలోదిగిన 173 మంది సిఖ్కులలోనూ 100 మందిని రేవులోనే ఎరెస్టు చేసేశారు. గదర్‌పార్టీసభ్యులు కొద్దిమంది తప్పించుకు పారిపోయారు.

ఆటుతరువాత భారతదేశానికి తిరిగివచ్చిన గదర్‌పార్టీసభ్యులు మొదటివారుచేసిన పొరపాట్లుచేయక క్షేమంగాచేరారు. భారతదేశంలో విప్లవకారులసమావేశాలు జరిగాయి. మొదటి ప్రపంచయుద్ధానంతరం కలిగిన భీకరపరిస్థితులు కాంగ్రెసు ముస్లింలీగు సంస్థలలో రాజకీయచైతన్యాన్ని పెంపొందించితే విప్లవ కారులలోవిప్లవచైతన్యాన్ని పెంపొందించాయి. ఈ విప్లవకారులకూ ప్రభుత్వానికీ కలిగిన ఘర్షణలమూలంగా లాహోరు కుట్రకేసుల పరంపరసాగింది.

# కాకోరీ రైలుకేసు

లాహోరు కుట్రకేసు అనంతరం భారతీయ విప్లవకారులు అష్టకష్టాలూపడి తమ పార్టీని నడుపుకుంటూవచ్చారు. వీరు ప్రభుత్వానికి విశ్రాంతిగాని పోలీసులకు విరామంగాని ఇవ్వలేదు. కాన్పూరులో ఒక వ్యాయామకేంద్రంపెట్టి అందులోకి యువకులను తీసుకుని క్రమంగా వారిని ఉద్యమంలోకి తీసుకుంటూవచ్చారు.

ఈవిప్లవోద్యమానికి నాయకులలో ఒకడు చంద్రశేఖర ఆజాద్. ఇతను అతి సాహసవంతుడూ, భయంకరుడూను. అతని పేరు వింటేనే పోలీసులకు హడలుగా ఉండేది. విద్యావంతుడుకాడు కాని గొప్ప గురికాడు. 1925లో ఇతడు కాకోరీ రైలుదోపిడి జరిగించాడు. ఈదోపిడి అనంతరం అనేకసోదాలు జరిగాయి. పోలీసులు విప్లవకారులవేట ప్రారంభించారు. విప్లవకారుల పార్టీ చెల్లాచెదరై పోయినంత పని జరిగింది.

ఉరిస్తంభం ఆజాద్‌కోసం ఎదురుచూస్తూ ఉంది. అయినా అతను లక్ష్యంచెయ్యక భగత్సింగ్ సుఖదేవులతో కలిసి పార్టీని పునర్నిర్మించాడు. ఆజాద్ ధైర్యసాహసాలూ, పట్టుదలా, నేర్పరితనమూ అతని అనుచరులకు పెద్దబలంగా ఉండేవి. అతను వేసిన ఎత్తు పారకపోవటమంటూ ఉండదని వాళ్ల దృఢవిశ్వాసం. కాకోరీ ఉదంతంలో అతను పోలీసులకు దొరకనేలేదు. 1929లో తిరిగి విప్లవకారులమీద పోలీసుదాడి జరిగి ఎసెంబ్లీ బాంబుకేసు నడిచినప్పుడుకూడా పోలీసులు ఆజాద్‌కోసరం పెద్దవలేవేశారు. కాని ఆజాద్ దొరకలేదు. ఛిన్నాభిన్నమైన పార్టీని అతను మళ్ళీ కూడగట్టాడు. 1929 డిసెంబరులో వైస్రాయి ఎక్కిన రైలు బాంబుచేసినప్పుడు పోలీసులకీసంగతి స్పష్టమయింది. ఆజాద్ పోలీసుశాఖకు ఊపిరి సలుపనివ్వడని తెలిసిపోయింది.

రెండో లాహోరు కుట్రకేసు ముద్దాయీలను విడిపించటానికి ఆజాద్ అతి సాహసయుతమైన ప్రయత్నం తలపెట్టి లాహోరు వచ్చాడు. ఆ ప్రయత్నం భగ్నమై ఆజాద్ దొరికినంతపనీ అయింది. కాని కళ్ళుతెరిచి చూసేలోపుగా ఆజాద్ ఢిల్లీలో సాయుధ సంఘర్షణ సాగిస్తున్నట్టు పోలీసులకు వార్త వచ్చింది.

ఆపైన పంజాబు వివిధజిల్లాలలో బాంబులు పేలటమూ అనేకమంది పోలీసు అధికార్లు నిహతులవటమూ జరిగింది. అతని మీద పోలీసు నిఘా జాస్తి అయింది. అయినా ఆజాద్ పోలీసులను తప్పించుకుంటూ తన పార్టీని కూడగట్టసాగాడు.

ఆజాద్ తన అనుచరులతోపాటు ఒకటి ఆశించాడు: తమ హింసాయుతమైన విప్లవకార్యాలమూలంగా భారత జాతీయోద్యమం తమమార్గానికి తిరుగుతుందనుకున్నాడు. కాని కాలక్రమాన ఆ ఆశ సన్నగిల్లింది. కొద్దిమంది విప్లవకారులు, యువకులు, సాయుధ సమరం సాగించినంతమాత్రాన జాతీయోద్యమం విప్లవచైతన్యం సంపాదించదని అతనికి తోచింది. తనవంటి శూరులు వెనక ఉండి సాయుధసమరం సాగిస్తున్నప్పటికీ తన అనుచరులు ప్రజాబాహుళ్యంలోకి, కార్మిక కర్షకుల మధ్యకివెళ్ళి వారిలో విప్లవచైతన్యం తీసుకురావటం అవసరమని అతను భావించాడు. ప్రజాబాహుళ్యానికి ఆయుధాలు ఉపయోగించటం నేర్పాలనుకున్నాడు. ఈ పద్ధతుల మీద ముందుముందు పార్టీని నడపాలనుకున్నాడు. కాని మృత్యువు అతనికోసం ఎదురు చూస్తూఉంది. ఒక విద్రోహి ఇచ్చిన వార్తల ఆధారంమీద ఆజాద్‌ను పోలీసులు అలహాబాదులోని ఆల్ఫ్రెడ్‌పార్కులో చుట్టుముట్టారు. ఆజాద్ వీరుడల్లే పోరి ఇద్దరు పోలీసు అధికారులను బలంగా గాయపరచి మరణించాడు.




స్వర్గీయ చంద్రశేఖర ఆజాద్



జతీన్ దాస్



బటుకేశ్వర దత్తు

# ఎసెంబ్లీ బాంబుకేసు



స్వర్గీయ సర్దార్ భగత్‌సింగ్

**1928**నుండి భారత విప్లవకారుల సంఘం హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషనుగా మారింది. ఈ సంఘానికి సోషలిస్టు దృక్పథం ఇచ్చినవాడు భగత్సింగ్. భగత్సింగూ, చంద్రశేఖర ఆజాదూ దీనికి ముఖ్యనాయకులు. ఈ సంఘానికి కేంద్ర, రాష్ట్ర, జిల్లా సంఘాలు ఏర్పడ్డాయి. కార్యక్రమం: అవసరాన్నీ అవకాశాన్నీబట్టి ప్రభుత్వంమీద దెబ్బలుతీస్తూ ఉండటమూ, అవకాశం లభించి ప్రజాఉద్యమం ప్రారంభమయితే దాన్ని సోషలిస్టుమార్గంలో నడుపుతూ నాయకత్వం వహించటమూను. ఈ కార్యక్రమం కొనసాగితే భారతదేశం స్వతంత్రం అవుతూనే సోషలిస్టుకూడా అవుతుంది.

ఈసమయంలో భారతదేశానికి సైమన్ కమిషను వచ్చింది. ఈ శ్వేతముఖ బృందాన్ని కాంగ్రెసూ, లీగూ, మితవాదులు కూడా బహిష్కరించారు. దేశమంతటా హర్తాళాలు జరిగాయి. "తిరిగిపో, సైమన్" అని జండాలు చూపారు సైమమ కమిషనుకు. ఈ సందర్భంలో జరిగిన నిరసన ఊరేగింపులపై పోలీసులు ప్రయోగించబడ్డారు. లాహోరులో లాలా లజపతిరాయి నడిపిన ఊరేగింపుపైబడి పోలీసులు క్రూరంగా కొట్టారు. ప్రఖ్యాత నాయకుడైన లజపతిరాయికి దారుణంగా దెబ్బలు తగిలాయి.అటువిమ్మట కొద్దిరోజులకే ఆదెబ్బలతో ఆయన మరణించాడు.

లజపతిరాయి మరణం దేశమంతా శోకంలో ముంచింది. విప్లవకారులు ప్రతిక్రియ జరపాలనుకున్నారు. 1928 నవంబరులో లాహోరు పోలీసుఠాణా బయట సాండర్సు అనే పోలీసు ఉద్యోగి కాల్చి చంపబడ్డాడు. లజపతిరాయి నడిపిన ఊరేగింపును లాఠీచార్జి చేయించినది వీడే; సాండర్సు దుర్మరణానికి దేశమంతా సంతోషించింది.

విప్లవకారుల కీదినాలు చాలాఅనుకూలంగా కనిపించాయి. 1928లో కలకత్తాకాంగ్రెసులో ఒక తీర్మానం జరిగింది: ఒక సంవత్సరంలో భారతదేశానికి అధినివేశప్రతిపత్తి లభించని పక్షంలో సంపూర్ణ స్వాతంత్ర్య సమరం ప్రకటించాలని. మళ్ళీ ఒక బ్రహ్మాండమైన ఉద్యమం బయల్దేరే సూచనలు కనిపించాయి.



శివరామ రాజగురు

విప్లవకారులకు వేడెక్కింది. వారు కలకత్తానుంచే జతీన్‌దాసును పిలిపించి అతని ద్వారా బాంబులుచెయ్యటం నేర్చారు. దీని ఫలితంగా, 1929 ఏప్రిల్‌లో దేశమంతటా ఉండిన కార్మికుల నాయకులనూ, కమ్యూనిస్టులనూ ప్రభుత్వం ఎరెస్టుచేసినఅనంతరం, కార్మికవర్గానికి వ్యతిరేకంగా ఒక బిల్లు పాసయినరోజున ఢిల్లీ కేంద్ర శాసనసభలో బాంబులుపడ్డాయి. దత్తూ, భగత్సింగూ తమకు తామై దొరికిపోయినారు. విచారణానంతరం వారిద్దరికీ ద్వీపాంతరం విధించారు.

ఇంతలో దురదృష్టవశాత్తూ లాహోరులో ఉన్న బాంబు ఫాక్టరీ ఆచోకీ పోలీసులకు తెలిసిపోయింది. సుఖదేవ్, కిశోరీలాల్ వగైరాలు పట్టుబడ్డారు. జైగోపాల్, హన్సరాజ్ వోరాలు అంతా చెప్పేశారు. దీంతో పంజాబులోనూ, బీహారులోనూ, సంయుక్త పరగణాల్లోనూ ఉన్న విప్లవకారులు కొందరు దొరికిపోయినారు. మిగిలినవాళ్ళు దాక్కున్నారు. పోలీసులు పెట్టే హింసలు భరించలేక ఎరస్టయినవారిలో 7 గురు అప్రూవర్లుగా మారారు. ఇందులో ఇద్దరు కేంద్ర కమిటీసభ్యులు :

బాంబు ఫాక్టరీ సందర్భంలో ఎరెస్టయిన వారు 13గురూ జైలులో దత్తు భగత్సింగులను కలుసుకున్నారు. అదివరకే వారిద్దరికీ యావజ్జీవ ద్వీపాంతరవాసం వేసినప్పటికీ వారినిప్పుడీ కొత్తకేసు ముద్దాయిలతో చేర్చారు. భగత్సింగును జైలులో ఎన్నోరకాల హింసలు పెట్టి అతని అనుచరులు గుర్తుపట్టరాకుండా చేసేశారు.

జైలులోఉన్న విప్లవకారులు ఆత్మరక్షణార్థం విచారణలోపాల్గొనదలచలేదు. కాని విచారణను వినియోగించుకుని బ్రిటిషువారి దుష్ట పరిపాలననుగురించీ విప్లవం గురించీ సమగ్రంగా ప్రచారంచేద్దామనుకున్నారు. ఇందుకుగాను మొట్టమొదటి ఎత్తుగా మిగిలినవారంతా దత్తు భగత్సింగులు సాగించిన నిరసన వ్రతంలో పాల్గొన్నారు.

ఈ భయంకరమైన నిరశనవ్రతం 63 రోజులు సాగింది. దానికి జతిన్‌దాసు బలి అయినాడు. నిరశనవ్రతం పదిరోజులు సాగిన తరవాత జైలు అధికార్లు ఖైదీలకు బలాత్కారంగా ఆహారం ఇవ్వాలని ప్రయత్నించారు. ఈ ప్రయత్నం సాగలేదు. ఆ తరవాత ప్రతికొట్టులోనూ మంచినీటికి బదులు ముంతల్లో పాలుపోసి పెట్టారు. ఖైదీలు ముంతలు పగలగొట్టారు. జతిన్‌దాసు న్యూమోనియాతో బాధపడుతూ చికిత్సపొంద నిరాకరించాడు. ఆఖరుకు నిద్రపట్టే మందుకూడా తాగలేదు. వీరి ధైర్యసాహసాలుచూసి సాటి ఖైదీలు సానుభూతి నిరశనం ప్రారంభించారు. దేశమంతటా వీరినిగురించి సానుభూతి సభలు

జరిగాయి. కొద్దిరోజులకు మీరట్ కుట్రకేసు ముద్దాయీలుకూడా నిరశనం ఆరంభించారు. ఈ వార్తలు దేశాంతరాలలోకూడా అలజడి రేపాయి. భారతదేశపు జైళ్ళలోఉన్న భీకర పరిస్థితులను గురించి ప్రపంచం తెలుసుకున్నది. ఈ గడబిడిలో విప్లవకారుల విచారణ వాయిదాపడింది.

తిరిగి కేసు విచారణ ఆరంభమయింది. మేజిస్ట్రేటు కోర్టులో తొమ్మిదినెలలు విచారణ జరిగి ప్రభుత్వసాక్షులైనా అందరూ బోనెక్కాక మునుపే వైస్రాయి ఒక వింత ఆర్డినెన్సు ప్రకటించాడు. ఈ ఆర్డినెన్సు ప్రకారం విచారణ రహస్యంగా జరగాలి. ప్లీడర్లవసరం లేదు. సాక్షు లవసరంలేదు. ముద్దాయీల వాఙ్మూలా లవసరంలేదు. వారు కోర్టుకురానవసరంకూడా లేదు. ఈ కోర్టు ఉరిలగాయతు ఏ శిక్షయినా విధించవచ్చు. ఈ శిక్షలమీద అప్పీలు చేసుకోవటానికి లేదు. ఫాసిస్టు పశుపరిపాలనను స్ఫురింపజేసే ఈ ఆర్డినెన్సు భారతదేశంలో బ్రిటిషు పరిపాలన సాగటానికి అత్యవసరమయింది.

ఈఆర్డినెన్సు ప్రయోగించటానికి బలమైన కారణాలు లేకపోలేదు. విప్లవకారులు విచారణను ప్రచారసాధనంగా ఉపయోగించసాగారు. సాండర్స్ హత్య జరిగినప్పు డక్కడ ఉన్న ఫార్న్ అనే పోలీసు అధికారి భగత్సింగును గుర్తించలేక పోయినాడు. ఆపైన ప్రభుత్వం తరఫు సాక్షులు విచారణ రేపిన ఆవేశంలోపడి ప్రభుత్వానికి పెడదిరగ సాగారు. అప్రూవర్లుగా మారినవారిలో ఇద్దరు తమ సాక్ష్యాన్ని ఉపసంహరించుకున్నారు.



సు ఖ దే వ్

మేజిస్ట్రేటు కోర్టులోనే జరిగితే ఈ విచారణ మరోవిధంగా పరిణమించేటట్టు కనపడింది. స్పెషల్ ట్రిబ్యునల్లోకూడా ముద్దాయీలను పోలీసులు జడ్జీలఎదటనే పెట్టే హింసలు చూసి ఓర్చలేక జడ్జీలలో ఒకరైన అగా హైదరీ విరసన ప్రకటన చేశాడు. వెంటనే ఆయనను ట్రిబ్యునలులోనుంచి తొలగించారు.

1930 అక్టోబరులో, అయిదునెలల విచారణ అయినాక, తీర్పుచెప్పారు. భగత్సింగ్, రాజగురు, సుఖదేవులకు ఉరిశిక్ష విధించబడింది. మరి ఏడుగురికి ద్వీపాంతర శిక్ష ఇచ్చారు, ఇతరులకు రకరకాల శిక్షలిచ్చారు. కొందరిని వదిలేశారు. ఉరిపడ్డ ఖైదీలతో కాంగ్రెసుకు సానుభూతి ఉన్నప్పటికీ వారు హింసావాదులనే కారణంచేత గాంధీ ఇర్విను ఒడంబడికలో ఉరిశిక్ష ఉపసంహరించటం ఒక షరతుగా చేర్చబడలేదు. 1931ఏప్రిల్‌లో కరాచీ కాంగ్రెసు జరగనుండగా భగత్సింగు ప్రభృతులు ఉరితీయబడ్డారు. చనిపోయ్యేనాటికి భగత్సింగు 24 ఏళ్ళవాడు.



అనంతసింగ్



లోకనాధబాల్



అర్ధేందువికాస దస్తీదార్ (16 సం॥)



మనోరంజన్ సేన్ (16 సం॥)



దేవీ గుప్త (17 సం॥)



హరిగోపాల్ బాల్ (టేగ్రా) (18 సం॥)

# చిటగాంగ్ ఆయుధాగార దోపిడి

బెంగాల్ ఆర్డినెన్సుకింద ఖైదుచేయబడిన సూర్యసేన్, అనంతసింగ్, గణేశ్‌ఘోష్ మొదలైన చిటగాంగ్ విప్లవ నాయకులు 1928 లో విడుదల అయేనాటికి విప్లవ కారుల విశ్వాసాలన్నీ తారుమారై ఉన్నాయి. పర ప్రభుత్వ సహకారంవల్లగాని, కొద్దిమంది అధికారులనూ, తెల్లవాళ్ళనూ, పోలీసులనూ హత్యచెయ్యటంవల్లగాని విప్లవంసాగే ఆశ అడుగంటింది. ప్రభుత్వ ఆయుధాగారాల్లో ఆయుధాలున్నాయి. వాటిని చేజిక్కించుకుంటే విప్లవకారులు ప్రభుత్వంతో ముష్టా ముష్టి తలపడవచ్చు. స్థానిక ప్రభుత్వాధికారులు పైనుంచి సహకారం పొందకుండానూ, తిరుగుబాటు వార్తలు పైకి వెళ్ళకుండానూ చేయటానికి టెలిగ్రాపు తీగెలు తెంపెయ్య వచ్చు. ఈవిధంగా విప్లవం క్రమేణా బలం చేకూర్చుకోవచ్చునని వారికి తట్టింది.

ఒకవారంరోజులు చిటగాంగును వశపరచు కుని తరవాత ప్రభుత్వంసాగించే యుద్ధంలో ప్రాణాలు కోల్పోయినా ఈగాధ దేశాన్నంతా ఉత్తేజపరిచి తీరుతుంది.

1930ఏప్రిల్ 1తేదీ రాత్రి పదిగంటలకు టెలిగ్రాపు ఆఫీసుమీదా, ఆయుధాగారంమీదా, పోలీసు శిబిరంమీదా ఒక్కసారిగా దాడి జరి గింది. రెండుప్రాంతాల రైలుపట్టాలు తొల గించబడ్డాయి. గాంధీజీ ఇచ్చిన శాసనోల్లం ఘన ప్రణాళికప్రకారం దేశద్రోహ శాసనం ఉల్లంఘించ బడుతోందని కరపత్రాలు పంచి పెట్టబడ్డాయి. ఇండియన్ రిపబ్లికన్ ఆర్మీ తాలూకు చిటగాంగుశాఖ ఏర్పడినట్టూ, దానికి మాస్టరుదా (సూర్యసేన్) అధ్యక్షుడైనట్టూ మరో కరపత్రం వేయబడింది.

ఆయుధాగారంవద్ద మేజర్‌ఫెరోలున్నూ, పోలీసు శిబిరాలవద్ద ఇద్దరు పహరావాళ్ళున్నూ చంపబడ్డారు. ఈరెండూ విప్లవకారుల వశ మయాయి. అక్కడికివచ్చిన జిల్లా మేజిస్ట్రే టుకు వెంట్రుకవాసిలో ప్రాణందక్కింది. అతను శీఘ్రంగా హార్బరుకువెళ్ళి, వార్త వైర్లెస్‌ద్వారా ప్రసారించి, అక్కడి ఆయుధా గారంలో ఉన్న ఆయుధాలిచ్చి సిబ్బంది పంపాడు. విప్లవకారులు ఆక్రమించిన ఆయుధాగారాని కెదురుగా కొండమీదఉన్న జలాశయం మాటుపెట్టుకుని ప్రభుత్వసిబ్బంది యుద్ధంప్రారంభించారు. విప్లవకారులకిది ఒనరుగా లేనప్పటికీ ప్రభుత్వసిబ్బంది కాలికి బుద్ధిచెప్పవలిసివచ్చింది.

కాని ఆప్రాంతాల తడవుచేయటం విప్లవ కారులకు క్షేమంకాదు. మోయకలిగినన్ని ఆయుధాలుపట్టుకుని మిగిలినవి దగ్ధంచెయ్య సంకల్పించారు. కాని అప్పటివరకూ ఏ నష్టమూ ఎరగని విప్లవకారులకు పెద్ద ఇక్కట్లు సంభవించినవి. ఆయుధాలు దగ్ధం చేసేసమయంలో హిమాంశుసేన్ వొంటికి నిప్పంటుకుని వొళ్ళంతా కాలిపోయింది. నలుగురు సహచరు లతన్ని రహస్యంగా ఊళ్ళోచేర్చిదాచారు. మూడురోజుల అనం తరం అతను చనిపోయినాడు. ఈ అయిదు గురూ వెళ్ళిపోగా మిగిలినవారు పట్టణాన్ని దాడిచెయ్యటానికి ప్రయత్నాలు చేశారు.

ఏప్రిల్ 22 సాయంకాలం 4-30 కి జలాలాబాద్ కొండవద్ద విప్లవకారులూ సన్నిద్ధమైన బ్రిటిషుసేనలూ తలపడటం జరిగింది. జలాలాబాదు కొండమీద విప్లవ కారులున్నారు. ఎదటికొండమీద సేన లున్నాయి. చీకటిపడేవరకూ తీవ్రమైన యుద్ధంసాగింది. రెండుపక్షాలా విరివిగా

కల్పనాదత్తు



ప్రత్యక్ష పోరాటంలో చనిపోయిన చిటగాంగు వీరులు.

ప్రాణనష్టం కలిగింది. చివరకు ప్రభుత్వ సేనలు తిరోగమించాయి. సేనల మొదటి తాకిడిలోనే 11 గురు విప్లవకారులు కూలారు. నలుగురికి గాయాలయాయి. అర్ధేందు దస్తిదార్ గాయపడి శత్రువులకు దొరికాడు. అతన్ని పోలీసులు యమచరపెట్టి చంపారు. అంబికా చక్రవర్తి చచ్చిపోయినట్టు ప్రభుత్వం ప్రకటించిందిగాని అతను చావలేదు. తనలాగే గాయపడిన మరి ఇద్దరు అనుచరులతో అతను తప్పించుకుపోయినాడు, ప్రభుత్వ పక్షాన ఎంతనష్టం కలిగిందీ స్పష్టంగా తెలియదు. 64 గురు చచ్చినట్టు ఒకదొర బయటపెట్టాడు. 150 వరకూ చచ్చారని ఒక వదంతి.

జలాలాబాదు ఉదంతం జరిగాక విప్లవకారులు పట్టణంమీద దాడిచెయ్యటం అసాధ్యమయింది. ప్రభుత్వాన్ని ఇంతటితో వొదలరాదనీ గరిల్లాపద్ధతిని చాటుయుద్ధం సాగించాలనీ నిర్ణయించబడింది. అజ్ఞాతవాస కష్టాలూ, చాటుయుద్ధప్రయాసా భరించలేనివాళ్ళూ, పోలీసుల అచోకీలోకి రానివాళ్ళూ క్షేమంగా ఇళ్ళకు పంపివెయ్యబడ్డారు.

రెండురోజుల అనంతరం అమరేంద్ర నందీ అనేకుర్రవాడు పోలీసులకు దొరికి, వారితోపోరి, చనిపోయినాడు. అది ఈవిధంగా జరిగింది. హిమాంశుసేన్ వొళ్ళు కాలిపోయినప్పుడు అతనివెంట అనంతదా అనే విప్లవ నాయకుడు ఊళ్ళోకి వెళ్ళాడు. అటుపైన సూర్యసేన్ (మాస్టర్‌దా)కూ అనంతదాకూ మధ్య వార్తలందలేదు. అందుకని సూర్యసేన్ ఈ నందీ అనే కుర్రవాణ్ణి ఊళ్ళోకి పంపాడు. నందీ తనపని ముగించుకునివస్తూ ఉండగా అతనికి జలాలాబాద్ ఉదంతం తెలిసింది. ఆ కారణంచేత అతను పట్నం వదిలిపోసాగాడుకాన్నీ ఆతనికి తన అనుచరుల ప్రాణాలకు బదులు పుచ్చుకోవాలనిపించింది. అతన్ని పోలీసులు సదర్‌ఘాటువద్ద ఒక ఖాళీఇంటోచూసి శంకించారు. పోలీసువాసన తగలగానే నందీ రెండోఅంతస్తు కిటికీలోనుంచిదూకి వరిగెత్తిపోయి ఒక వీధివంతెన కింద దాక్కుని పోలీసులతో తుపాకీ యుద్ధమారంభించాడు. త్వరలోనే అతని తూటాలయి పోయాయి. ఎదురుగా వస్తున్న సైనికులతన్ని కాల్చేశారు.

మాస్టర్‌దాను కలుసుకోవటానికి అనంతదాకు సాధ్యంకాలేదు. జలాలాబాద్ సంఘటన విని అతనుకూడా అనుచరులతో పట్నం వదలి పోసాగాడు. ఫేనాస్టేషనువద్ద అనుమానంమీద పోలీసులతని బృందాన్ని నిర్బంధంలో ఉంచారు. కాని విప్లవకారులు కాపలావాళ్ళపై తుపాకులుపేల్చి తప్పించుకు పారిపోయినారు.

మాస్టర్‌దా (సూర్యసేన్) తన అనుచరులను పల్లెపట్టులకుచేర్చి ప్రభుత్వాన్ని వేధించే కార్యక్రమం ఆలోచించాడు. నదీతీరాన యూరోపియనుల బంగాళా లున్నాయి. వాటిమీద దాడిచెయ్యటానికి ఆరుగురు బయల్దేరారు. ఈ ప్రయత్నంలో విఫలులై తిరిగి వస్తుండగా కాలార్‌పోల్‌వద్ద సాయుధ పోలీసులు వారికి తటస్థపడ్డారు. ఈ సంఘర్షణలో నలుగురు మరణించారు. సుబోధ్ చౌధురీ, ఫణీనంది అనేవాళ్ళు గాయపడి పట్టుపడ్డారు.

కాలక్రమాన అనేకమంది కుర్రవాళ్ళు సంఘర్షణల్లో పట్టుబడ్డారు. కొందరు ఇళ్ళలో అరెస్టయినారు. చిటగాంగు మిలిటరీ ఆక్రమణ కిందికివచ్చింది. కర్ఫ్యూ విధించబడింది. తన అనుచరులను పోలీసులుచేసే ఒత్తిడిచూసి వారిలో ఎవరూ అప్రూవరుగా మారకముందే అనంతదా (అనంతసింగు) పోలీసుకు దొరికి పోయినాడు.

1930 లో 30 మంది ముద్దాయీలతో చిటగాంగు ఆయుధాగారకేసు స్పెషల్ ట్రిబ్యునల్ క్రింద నడిచింది. సెప్టెంబరు 1 న గణేశ్ ఘోష్, ఆనందగుప్తా, లోకనాధ్ బాల్ అనే వారిని చంద్రనాగోరులో ఎరెస్టుచేసి చిటగాంగు తెచ్చారు. వీరి ఎరెస్టులతో విచారణ మొదలయింది. రోజూ ఎవరో ఒకరు ఎరెస్టవుతూనే ఉన్నారు. విప్లవకారుల ఆచోకీలు తీయటానికి పోలీసులు చేసే అత్యాచారాలు చూసిసూర్యసేన్ (మాస్తర్‌దా) ప్రభృతులకు మండిపోయింది. ఎరెస్టుకోసం నిరీక్షించి లాభంలేదని, ఏదో ఒకటి సాగించాలని నిశ్చయించారు. డిసెంబరు 30 న రామకృష్ణ బిశ్వాస్, కాళీపాద చక్రవర్తి అనేవాళ్ళు పోలీసు ఇన్స్పెక్టరు జెనరల్ క్రేగ్‌ను చంపటానికి పూనుకుని పొరపాటున ఇన్‌స్పెక్టరు తారిణీ ముఖర్జీని చంపారు.

జూను 1931 లో చిటగాంగు మందుగని బయటపడింది. ఆయుధాలూ, ఎలక్ట్రిక్ తీగెలూ, పేలుడుమందూ, బాకులూ మొదలైనవి జైలులోనూ, బయటా దాచబడినాయి. విచారణ స్థానంలోనూ పట్టణంలో ముఖ్య ప్రదేశాల్లోనూ డైనమైట్ పాతిపెట్టబడ్డట్టు బయటపడింది. ఈ విస్తృతమైన ఏర్పాట్లు చూసి ప్రజలుకూడా చకితులైనారు. ఎనిమిది




ప్రత్యక్ష పోరాటంలో చనిపోయిన చిటగాంగు వీరులు.

మంది ముద్దాయీలతో డైనమైటు కుట్రకేసు వేరే ట్రిబ్యునలు సమక్షంలో ఆరంభమయింది. ఈ విచారణలో ప్రభుత్వం అనంతదాతో రాజీపడింది. ముద్దాయీ లందరూ నేరాలు ఒప్పుకొనేటట్టూ వారిని ప్రభుత్వంకొద్ది శిక్షలతో పోనిచ్చేటట్టూ సంధిజరిగింది. ముగ్గురికి మాత్రం మూడేసిఏళ్లు శిక్షపడింది. మిగిలిన వారు కొద్దిమాసాలతో తప్పించుకున్నారు.

ఈ కేసు సందర్భంలో ఇన్స్పెక్టరు అసనుల్లా చాలా ఘోరంగా ప్రవర్తించాడు. ప్రజల కతనిమీద పగగాఉంటూ వచ్చింది. 1931 ఆగస్టులో హరిపాద భట్టాచార్యఅనే 14 ఏళ్లకుర్రాడు అసనుల్లాను తుపాకితో తూట్లు తూట్లుగా కాల్చిచంపేశాడు. ఆ కుర్రాడు తక్షణమే పోలీసులకు దొరికాడు కాని అతని మీద నడిపినకేసులు సాక్ష్యం రాక కింది కోర్టులో కొట్టివేశారు. ప్రభుత్వం అపీలుచేసి పై కోర్టులో ఈ కుర్రవాడికి ద్వీపాంతరవాస శిక్ష వేయించింది.

ఆయుధాగారం దొమ్మికేసు తీర్పు 1932 మార్చి 1 న చెప్పబడింది. 16 గుర్ని వొదిలివేసి బెంగాలు ఆర్డినెన్సు కింద తిరిగి ఎరెస్టుచేశారు. అనంతదాతో చేర్చి 13 గురికి ద్వీపాంతరంవేశారు. మిగిలినవారికి తక్కువశిక్షలు వేయబడ్డాయి.

# మధురస్మృతి



స్వర్గీయ నాగేశ్వరరావు పంతులుగారు, ప్రకాశం పంతులుగారు
1930 వ సం॥ మద్రాసులో ఉప్పు సత్యాగ్రహంచేయటానికి బయలుదేరుతున్న దృశ్యం.
ఈ ఉద్యమం నడిపిన కీర్తీ, కష్టాలూ ఆంధ్రులవి; ఫలితం అందరిదీ!



స్వర్గీయ నాగేశ్వరరావు పంతులుగారి సమక్షాన
గుమ్మిడిదల దుర్గాబాయమ్మగారు ఉప్పు తయారుచేస్తున్న దృశ్యం.




# స్వతంత్ర భారత వీధులు

ఆజాద్ హింద్‌ఫౌజు నిర్మాణానికీ, "జై హింద్" నినాదానికీ పైకి కనుపించే కారణం రెండవ ప్రపంచ సంగ్రామమే అయినప్పటికీ అట్టడుగునవున్న కారణాలు బ్రిటిషవారి దుష్ట అసమర్థ వైఖరీ, దూరప్రాచ్యంలో వారి తొలి పరాజయమున్నూ, బర్మా,మలయా ప్రాంతంలో వారు అధికారం చలాయించి దేశీయులను హేయంగా చూచినదానికిన్నీ ఆపత్సమయంలో వారు ప్రకటించిన అసమర్థ స్వార్థానికి ఏమీ పోలిక లేదు.

ఆ ప్రాంతంలోవున్న 7 లక్షల భారతీయులను తెల్లవాళ్ళు శత్రువులకన్న హీనంగా చూశారు. ధరలు పెరుగుతుంటే పనివాళ్ళ జీతాలు పెంచలేదు. పనిలోకిఛానివాళ్ళనికాల్చిం చారు. భారతీయులను యుద్ధభయంనుంచి తప్పించటానికి రక్షించటానికి ఎటువంటి ప్రయత్నమూ చెయ్యకపోగా వారిని నడిసముద్రానవదలి పరారీ అయారు. అక్కడికివచ్చే భారతీయ పత్రికలమీద సెన్సారుషిప్ పెట్టారు. అన్నిటికన్నా అర్థంలేనిపని ఏంచేశారంటే జపాను ఫాసిజాన్ని ఎదుర్కొనటానికి భారతీయులు సైన్యంలో చేరతామని ముందుకువస్తే తెల్లవాళ్ళు నిరాకరించారు.

ఈ కారణాలవల్ల భారతీయులకు బ్రిటిషవారిపట్ల తీవ్రమైన ద్వేషం బయల్దేరింది. దానికి తగ్గట్టే బ్రిటిషవారి తిరోగమనాలు చూస్తే వారి అపజయం తధ్యంగా కనిపించింది. ఈరెండు విశ్వాసాలలోనుంచీ బ్రిటిషవారిని తుదముట్టించి భారతదేశాన్ని విముక్తం చేసుకోవాలనే కాంక్ష దూరప్రాచ్య భారతీయులకు కలగసాగింది.

1942 మార్చిలో టోకియోలో రాసవిహారీ బోస్ ఒక భారతీయ ప్రతినిధుల సమావేశం జరిపాడు. తూర్పుఆసియా వివిధప్రాంతాల నుండి భారతీయ ప్రతినిధులీ సమావేశానికి వచ్చారు. భారతీయ స్వాతంత్ర్యోద్యమం ప్రారంభంకావాలని ఈ సమావేశం తీర్మానించింది. భారతీయ నాయకత్వంకింద ఒక భారతస్వాతంత్ర్యసేన ఏర్పడి, ఇదే భారతదేశంమీద దండెత్తి బ్రిటిష పరిపాలనను విధ్వంసం చెయ్యాలన్నారు. ఇందుకు జపానువారి సహాయం పొందుదామనుకున్నారు.



జూన్‌లో తిరిగి బాంగ్కాక్‌లో మరో సమావేశం జరిగింది. ఆ సమావేశానికి భారతీయ ప్రజాప్రతినిధులేకాక, యుద్ధంలో జపానువారికి చిక్కిన భారతీయ సైనికుల ప్రతినిధులుకూడా వచ్చారు. ఈ సమావేశంలో భారత స్వాతంత్ర్య సమితి ఏర్పాటుచేయ



కెప్టెన్ షానవాజ్

తీర్మానం జరిగింది. భారతస్వాతంత్ర్యం విషయమై జపాను వైఖరి విస్పష్టీకరించవలసిందని కోరడానికి తీర్మానం జరిగింది.

భారతస్వాతంత్ర్య సమితికి అధ్యక్షుడు రాసవిహారీబోస్. ముఖ్యకేంద్రం సింగపూరు. తూర్పుఆసియా దేశాలన్నిటిలోనూ దీని శాఖలు ఏర్పాటయాయి.

మనదేశంలో 1942 ఆగస్టు పోరాటంతోపాటు ఆజాద్‌హింద్‌ఫౌజ్, కెప్టెన్ మోహన్‌సింగ్ నాయకత్వాన ఉద్భవించింది. దీనిలోకి భారతీయులు తండోపతండాలుగా వచ్చి స్వచ్ఛంద సైనికులుగా చేరారు.

భారతస్వాతంత్ర్య సమితినీ వారి కార్యక్రమాన్నీ అభ్యుదయపథంనుంచి తప్పించాలనీ, తమ సామ్రాజ్య విస్తృతికి ఉపాంగంగా చేసుకోవాలనీ, అది సాధ్యం కాకపోతే దానికి విద్రోహంచేయాలనీ కూడా జపాను యుద్ధాధికారులు ప్రయత్నించారు. ఈప్రయత్నాలలో రాసవిహారీబోసు వారికి సహాయపడ్డట్టు కనిపిస్తుంది.

1943 జులైలో సుభాషబోసువచ్చి భారత స్వాతంత్ర్యసమితికి అధ్యక్షుడు కాగానే ఈ చిక్కులన్నీ తీరిపోయాయి. 1943 అక్టోబరులో సింగపూరులో స్వతంత్రభారత ప్రభుత్వం ఏర్పడింది. దీనికి అధ్యక్షుడూ, ప్రధాని, యుద్ధ విదేశాంగమంత్రీ సుభాష్. తదితర శాఖలవారుకూడా ఏర్పడ్డారు. దీనికి ప్రధాన సలహాదారు రాసవిహారీబోసే. ఈ ప్రభుత్వాన్ని ఫాసిస్టు రాజ్యాలేగాక తూర్పు ఏసియా రాజ్యాలన్నీ ఆమోదించాయి. జపానువారు తమ కిందికివచ్చిన అండమాను, నికోబారు దీవులను ఈ ప్రభుత్వాని కిచ్చివేశారు. ఈ ప్రాంతాల పన్నులు విధించి ప్రభుత్వ ఖర్చులు గడిపారు.

సుభాష్ ఆజాద్ హిందుఫౌజును బలిష్ఠంగా తయారుచేయటానికి ఉపక్రమించాడు. వారికి సరి అయిన శిక్షణ ప్రారంభమయింది. మలయాలో నాలుగు శిక్షణకేంద్రాలలో 7 వేల మంది తరిఫీదు పొందారు. ఝాన్సీదళంలోని స్త్రీలకు మలయాలోనూ, రంగూనులోనూ శిక్షణ ఇచ్చారు. ఈ సేనలో అందరూ స్వచ్ఛంద సైనికులే. రంగూన్ జూబిలీ హాలులో సుభాష్‌బోస్ ఉపన్యాసానంతరం ఉత్తేజితులై అనేకమంది మాతృదేశవిముక్తికి



కెప్టెన్ సెహగల్

రక్తంతో సంతకాలుచేశారు. వీరిలో అనేక మంది స్త్రీలుకూడా ఉన్నారు.

1943 ఆగస్టులో సుభాస్‌బోస్ ఆజాద్ హిందుఫౌజుకు నేతాజీ అయినాడు. ఈసైన్యం "జై హింద్", "చలో ఢిల్లీ" నినాదాలు సృష్టించింది.

1944 జనవరిలో ఆజాద్ హింద్ ప్రభుత్వం బర్మాకు మార్చబడింది. జులైలో రంగూనులో నేతాజీ ఉత్సవాలు జరిగాయి. సైనిక ప్రదర్శనాలు జరిగాయి.

ఈ సైన్యంలో సుభాష్‌దళం, గాంధీ దళం, నెహ్రూదళం, ఆజాద్‌దళం, ఝాన్సీ దళం మొదలైనవి ఉన్నాయి. ఈ దళాలన్నీ యుద్ధంలో వేర్వేరురంగాల్లో పాల్గొన్నాయి. ఇవి ఇంఫాల్, అరకాన్‌రంగాల్లో పోరాయి. వీరికి విమానాలులేవు, లారీలుకూడాలేవు.

1944 మార్చి 18 న ఈ సేన బర్మా సరిహద్దుదాటి ఇండియాలో అడుగుపెట్టింది. జపాను సైన్యం ఇంఫాలు ముట్టడించినప్పుడు ఆజాద్‌హింద్ సైన్యాలుకూడా ముట్టడిలో పాల్గొన్నాయి. కాని వర్షాలమూలంగా ఈ ముట్టడి ఎత్తివేయవలసివచ్చింది. ఆహారం లేకా, జాడ్యాలవల్లా సైనికులు తీవ్రకష్టాలకు లోనైనారు. అనేకులు చచ్చిపోయారు. జపా



కర్నల్ లక్ష్మి



లెఫ్టినెంట్ ఢిల్లాన్

నుకు వశమైన భారతీయ ప్రాంతానికి చటర్జీని గవర్నరుగా నియమించారు.

కాని బ్రిటిషువారు బర్మాదండయాత్ర ప్రారంభించగానే ఆజాద్‌హింద్ సైన్యం క్లిష్టపరిస్థితులలో పడింది. అనేకమంది ఆజాద్ హిందుసైనికులూ, సైనికాధికారులూ బ్రిటిషువారి పక్షం వచ్చేశారు. రంగూనునుంచి జపానువారు తిరిగిపోయే సమయంలో, 1945 ఏప్రిల్ 24 న ఆజాద్ హిందు ప్రభుత్వానికి చెందినవారితో సుభాష్ బాంగ్‌కాక్ వెళ్ళిపోయాడు. ఇదే బోసుచేసిన ఆఖరుప్రయాణం.

బ్రిటిషు సైనికాధికారులు మొదట రంగూనులో అడుగుపెట్టినప్పుడు భారతస్వాతంత్ర్య సమితినిగాని ఆజాద్‌హింద్ ప్రభుత్వాన్నిగాని విద్రోహకులవలె చూడలేదుకాని కొద్దిరోజులకే వారి వైఖరి మార్చుకుని ఈ ప్రభుత్వానికి సేనకూ సంబంధించిన వారినందర్నీ

ఎరెస్టుచేయ నారంభించారు. ఆజాద్‌హింద్ ఫౌజు సైనికులచేత పనులుకూడా చేయించారు.

ఈ సైన్యంలో ప్రధానపాత్రలు నిర్వహించిన పురుషులు కెప్టెన్ షానవాజ్, కర్నల్‌ఇనయత్, కర్నల్‌జుల్మాద్‌సింగ్, గుర్బక్షసింగ్. స్త్రీలు:కర్నల్‌లక్ష్మి, దేవిస్‌సతి రాఘవన్‌సతి, మీనన్‌సతి మొదలైనవారు. ఆజాద్ హింద్‌ప్రభుత్వంలో ప్రముఖపాత్ర నిర్వహించినవారు ఎస్. ఏ. అయ్యర్, ఏ. సి. చటర్జీ, అజీజ్ అహ్మద్, ఎన్. ఎస్. భగవత్, భాన్‌స్లే, గుల్జార్‌సింగ్, లోకనాథన్ మొదలైనవారు.

ఆజాద్ హింద్ ప్రభుత్వం సాంఘికంగా బర్మాలో చాలా సేవచేసింది. ఒక బాంకు నడిపింది. అనేక ఆస్పత్రులూ, పాఠశాలలూ నడిపింది. కనుకనే బ్రిటిషువారు వచ్చేసరికి బర్మాలో పరిస్థితులు అరాచకంగాలేవు.

## భారతీయవైఖరి

ఆజాద్ హింద్‌ఫౌజ్ విచారణ మన దేశంలో ఆందోళన కలిగించటంలో ఆశ్చర్యం లేదు. సుభాష్‌బోసు ఫాసిస్టులతో చేరటంలోని వివేకావివేకాలమాట ఎట్లావున్నా, ఆయన దేశాన్ని చిరకాలం సేవించినవాడు. విదేశీయులకు స్వార్థంకోరి తల్లిని అమ్ముకునే మాతృద్రోహికాదు. ఈవిషయం ప్రతి భారతీయుడూ విశ్వసించాడు. రాజకీయ విజ్ఞానమూ, యుద్ధగమనమూ తెలియని సామాన్య ప్రజలు బ్రిటిషువారి పతనాన్ని వాంఛించి జపాను విజయం కోరినమాటకూడా అబద్ధంకాదు. అందుకు బాధ్యత బ్రిటిషువారి దుష్ట పరిపాలనదే.

కాంగ్రెసుసంస్థ బోసును సమర్థించి ఉండటం సాధ్యంకాదు. ఎందుచేతనంటే స్వాతంత్ర్యసమరాన్ని కాంగ్రెసు విడనాడలేదు. యుద్ధంపట్ల కాంగ్రెసు తన వైఖరిని వేరువేరు సమావేశాలలో తీర్మానాల రూపంలో వెల్లడిచేస్తూ వచ్చింది. కాంగ్రెసు వైఖరికీ, తీర్మానాలకూ బోసు దృక్పథం అనుకూలంగా లేదు. కాని బోసునుగాని, ఆజాద్ హిందు సైనికులనుగాని దేశద్రోహులుగా నిరూపించి శిక్షించటం కాంగ్రెసు కెంతమాత్రమూ సమ్మతిలేదు. బ్రిటిషుపాలకులకుగాని సైనికశాఖకుగాని నైతికంగా ఆజాద్ హిందుసైనికులను విచారించి శిక్షించే హక్కులేదని కాంగ్రెసు నమ్మింది.

1945 బొంబాయి సమావేశంలో కాంగ్రెస్ ఈ క్రిందివిధంగా ఈ విషయమై తీర్మానం జరిపింది: ఆజాద్ హింద్‌ఫౌజుకు చెందిన సైనికులను యుద్ధానంతరం బేషరతుగా వొదిలిపెట్టాలి. వీరి శిక్షను దేశం సహించలేదు. వీరిని స్వాతంత్ర్య నిర్మాణానికి ఉపయోగించుకునే అవకాశం ఎంతయినా వుంది. కాదనీ వీరిని ప్రభుత్వం శిక్షించదలిస్తే బ్రిటను ఇండియాలమధ్య విభేదాలు మరింతగా పెరిగితీరుతాయి.

ప్రజాభిప్రాయమూ, పరిస్థితులూ, తమ నైతిక దౌర్బల్యమూ కలిసి పనిచేసి బ్రిటిషు అధికార్లు ఆజాద్ హింద్ ఖైదీలయెడ తీవ్ర వైఖరి అవలంబించటానికి లేకుండాపోయింది. రెడ్‌ఫోర్టు విచారణ, భూలాభాయి దేశాయి వకాలతు చరిత్ర ప్రసిద్ధవిషయాలు.



# ఆగస్టు విప్లవ జ్వాల

ఉబికుబికొచ్చే ఉద్రేకంలో, రాలిపోయినై రత్నాలెన్నో !
ఉరకలువేసే ఉత్సాహంలో. కూలిపోయినై హృదయాలెన్నో !
ఉవ్విళ్లూరే ఉబలాటంలో, మంటగలిసినై ప్రాణాలెన్నో !

వీరభారత యువకుల్లారా,
విజయోత్సాహిత మూర్తుల్లారా,
విన్నారా మన వీరులచరితం ?
కన్నారా ఆగస్టు విప్లవం ?

ప్రాణంపోతే పోయిందీ, మన భారతమాతకు స్వాతంత్ర్యం !
భుగభుగమంటూ భూమ్యాకాశాల్, అలముకున్న యావిప్లవజ్వాలలు !
యువతీ యువకులు, పిన్నలు పెద్దలు, బలియై పోయారా జ్యోతుల్లో

వీరభారత యువకుల్లారా,
విజయోత్సాహిత మూర్తుల్లారా,
విన్నారా మన వీరులచరితం ?
కన్నారా ఆగస్టు విప్లవం ?

విప్లవజ్యోతుల కిరణ కాంతిలో ఉదయించాడూ స్వతంత్రభానుడు !
విప్లవవీరుల నెత్తురునదిపై ప్రసరించిందీ స్వతంత్ర వాయువు !
విప్లవనేతల త్యాగజలధిలో వెలుగొందిందీ స్వతంత్రభారత్ !

వీరభారత యువకుల్లారా,
విజయోత్సాహిత మూర్తుల్లారా,
విన్నారా మన వీరులచరితం ?
కన్నారా ఆగస్టు విప్లవం ?

**సాంబశివరావ్ బాబ్జీ**

# 1942
# ఆగస్టు ఉద్యమం



రెండవ ప్రపంచ సంగ్రామం ఆరంభమయింది. బ్రిటను ఈ యుద్ధంలోకి ఇష్టంలేనట్టుగా, బలవంతాన, గత్యంతరం లేకదిగింది. జపాను చైనామీద అక్రమంగా విరుచుకు పడ్డప్పటినుంచి మన కాంగ్రెసు ఫాసిస్టు వ్యతిరేక ధోరణి ప్రస్ఫుటంచేస్తూ అనేక తీర్మానాలు చేసి ఉంది. అటువంటి సందర్భంలో బ్రిటను ఫాసిస్టు వ్యతిరేక సంగ్రామంలో ప్రవేశించగానే చేసిఉండ దగినపని కాంగ్రెసు సహకారం సంపాదించటం. ఎందుకంటే అప్పుడు కాంగ్రెసు ఎనిమిది రాష్ట్రాలలో ప్రభుత్వం నడుపుతున్నది, కాని కాంగ్రెసు బేషరతుగా యుద్ధసహకారానికి సమ్మతించదు. ఏ యుద్ధాశయాల కోసం బ్రిటను పోరుతున్నదో స్పష్టంగా ప్రకటించి భారత దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చిన పక్షంలో కాంగ్రెసు ఫాసిస్టు వ్యతిరేక సంస్థగా బ్రిటనుతో చేయి కలిపేది. కాని భారత స్వాతంత్ర్యం ఇచ్చే ఉద్దేశంలేక బ్రిటిషు వారు మనదేశాన్ని ఎవరి అనుమతి లేకుండా యుద్ధంలోకిలాగారు కాంగ్రెసు పదవీ సన్యాసం చేసింది. జపాను యుద్ధంలో ప్రవేశించినాక మనదేశానికి యుద్ధభయం మరింత అయింది. బ్రిటను మనదేశాన్ని రక్షించలేదనీ, ప్రజల సహకారం ఏమాత్రం సంపాదించ లేదనీ కాంగ్రెసు రూఢీచేసుకుని క్విట్ ఇండియా తీర్మానంచేసింది. ఇది 1942 ఆగస్టున జరిగింది. ఈ తీర్మానంయొక్క ఉద్దేశం జపానువారిని రప్పించడం కాదు, బ్రిటిషువారి సేనలను పంపించటమూ కాదు; అధికారం దేశీయులపరం చేసుకుని, ప్రజలలో ఉత్సాహం పురికొల్పి, సమగ్ర ప్రజాసహకారంతో బ్రిటిషువారితోపాటు జపానును ఎదిరించటం.

క్విట్ ఇండియా తీర్మానం జరగగానే బ్రిటిషు అధికారులు కాంగ్రెసు నాయకుల నందర్నీ దేశమంతటా ఒక్కసారిగా, ఫాసిస్టు ముఠాలను ఎరెస్టు చేసినట్టు ఎరెస్టు చేసేశారు. ముఖ్యదేశ నాయకులను ఎక్కడికో తీసుకుపోయి మాయంచేశారు.

ఈ దారుణం భరించలేక ప్రజలు తిరగబడ్డారు. ఏ ఆయుధాలూ లేకుండా బ్రిటిషు ప్రభుత్వాన్ని తరిమి వెయ్యటా

నికి ఏయే ప్రయత్నాలు చెయ్యటానికి అవకాశం ఉందో ఆ ప్రయత్నాలు దేశమంతటా జరిగాయి. స్టేషనులు పోస్టాఫీసులూ, ప్రభుత్వ కచేరీలూ నాశనం చేయబడ్డాయి. ప్రజలు పనిపెట్టుకుని ఎక్కడా హత్యాకాండ సాగించలేదు. రైళ్లూ, ట్రాములూ, బస్సులూ పట్టణాలలో అటకాయించబడ్డాయి.



అరుణ అసఫాలీ

ఈ సంక్షోభానికి బొంబాయి నగరమూ, రాష్ట్రమూ ప్రధాన కేంద్రాలు. 1942 ఆగస్టు కాంగ్రెసు బొంబాయిలోనే జరిగింది. ముఖ్యనాయకులంతా అక్కడే ఎరెస్టయినారు. ఇక్కడనుంచే ఇతర ప్రాంతాలకు డబ్బూ: పరికరాలూ, కార్యక్రమము అందించబడింది. నాయకుల ఎరెస్టు అనంతరం అరుణ అసఫాలీ మొదలైనవాళ్లు గవాలియమైదానంలో పెద్ద బహిరంగ సభచేశారు. ఈ సభ మీద పోలీసులు హింసాకాండ జరిపారు. ఆ సాయంకాలం శివాజీపార్కులోకూడా పోలీసులు బహిరంగ సభ మీద దాడిచేశారు. ప్రజలు కోపావేశంతో పోలీసు స్టేషనులూ, కచేరీలూ, ట్రాములూ, రైలు పట్టాలూ, తంతి తీగెలూ ధ్వంసంచేశారు. ఆ మర్నాడు పోలీసులూ, సిపాయీలూ పట్టణమంతా కాల్పులుచేస్తూ తిరిగారు. వందలాది ప్రజలు గాయపడ్డారు. షాపులు మూసేశారు. ఆఫీసులుకూడా మూసేశారు. నెలలతరబడి బొంబాయిలో బాంబులు పేలుతూ వచ్చాయి, విద్యార్థులు విరివిగా ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. బొంబాయిలోఉన్న ధనికులూ, మున్షీలాటి ఉన్నతోద్యోగులూ కూడా సానుభూతి ప్రదర్శించారు. పూనాలోకూడా ప్రజల మీద సైనికులూ పోలీసులూ దారుణ హింసాకాండ జరిపారు. ఆగస్టు 20 తేదీన రహస్యంగా కాంగ్రెసు రేడియో బొంబాయిలో నెలకొల్పబడింది. పత్రికల నోళ్లుకట్టి ప్రభుత్వం అణచిపెట్టిన తిరుగుబాటు వార్తలను ఈ రేడియో ఇస్తూ వచ్చింది.

సతారాజిల్లా ప్రజలంతా ఒకటిగా నిలబడి పోలీసుల అటకట్టించారు. పోలీసుల సహకారంచే వారిని నిర్దాక్షిణ్యంగా శిక్షించారు. 300 గ్రామాలలో కాంగ్రెసు నాయకులు ప్రభుత్వాన్ని భగ్నంచేసి మరోప్రభుత్వం పెట్టారు, ఈ విధంగానే సంయుక్త రాష్ట్రాలకు చెందిన బలియాజిల్లాలో ప్రజలు తమ స్వంత ప్రభుత్వం నడిపారు. ఈప్రభు

త్వం తెల్లవాళ్ళను ఎరెస్టు చేసింది. ఖైదులోఉన్న కాంగ్రెసు నాయకులను విడిపించింది. కాని అగష్టు 23 న మిలిటరీ ఆక్రమణజరిగి ఇక్కడి ఉద్యమం అణగి పోసాగింది. ఈ రాష్ట్రంలో అంతటా ప్రజలు తిరుగుబాటు చేశారు. విద్యార్థులూ యువకులూ చాలాసాహసం చూపారు. కాని పోలీసులు ప్రజల ఉత్సాహానికి మించి దారుణాలు సాగించారు.

మధ్యరాష్ట్రంలో ప్రత్యేకించి చెప్పుకోతగ్గవి అష్టీ, చిమూరు సంఘటనలు. ఈ రెండుచోట్లా పోలీసులు అకారణంగా ప్రజలలో క్రోధాగ్ని రేపారు. రెండుచోట్లా ప్రభుత్వం తరపు మనుషులను ప్రజలు హత్యలు చేశారు. ఆతరువాత ఈ గ్రామాలకు మిలిటరీ రావటమూ,ఊళ్లోఉన్న పురుషులందర్నీ ఎరెస్టు చెయ్యటమూ, స్త్రీలను చెరచటమూ, ఇళ్ళు కొల్లగొట్టటమూ పశువులలాగా ప్రవర్తించటమూ మొదలైనవి అతి దారుణంగా జరిగాయి. ఇవన్నీ చాలక అష్టిముద్దాయిలలో కొందరికి మరణశిక్ష వేశారు. ఆరువేల జనాభాలేని చిమూరులో లక్షరూపాయలు సాముదాయిక జరిమానా విధించారు. ఈ దారుణాలను గురించి డాక్టరుమూంజీ, ఆణే మొదలైనవారు నిరసన తెలిపారు. ఈ వార్తలకు ఉద్రిక్తుడై ఆచార్యభన్సాలే గాంధీ ఆశ్రమంనుంచి చిమూరువచ్చి నిరశనవ్రతం ఆరంభం చేశాడు

ఈ ఉద్యమం బిహారు ప్రాంతంలోనూ, పశ్చిమ బెంగాలులోనూ చాలా తీవ్రంగా నడిచింది. ఇక్కడ కొద్దిమంది యింగ్లీషువారిని చంపివేశారు కూడాను.

ఈ ఉద్యమం ఆంధ్రలోకూడా తీవ్రంగా నడిచింది. గోదావరీజిల్లాలు, గుంటూరుజిల్లా, వీటిలో రైలు స్టేషనులు తగలబెట్టటమూ, కొంతకాలం పాటు రైళ్లు నడపటానికి వీల్లేక పోవటమూ, పోలీసుల కాల్పులూ, ప్రజల తిరుగుబాటూ పెద్దెత్తున జరిగింది. అనేక వందలమందిమీద కేసులుపెట్టబడ్డాయి.

ఈఉద్యమాన్ని ప్రోత్సహించి నడిపిన ప్రసిద్ధవ్యక్తులు అరుణ అసఫాలీ, అచ్యుత పట్వర్ధన్, రామమనోహర్ లోహియా, జయప్రకాశ్ నారాయణ్ వగైరాలు. దీన్ని అణచటానికి భారతదేశంలో ఉన్న బ్రిటిషు సైనికులూ, వారి ఆయుధాలూ, యుద్ధవిమానాలూ కూడా అవసరమయాయి. ఈ ఉద్యమంతో బ్రిటిషువారిమీది ద్వేషభావం పల్లెపల్లెనా దేశమంతటా వ్యాపించింది.



# యుద్ధ నావికుల తిరుగుబాటు - 1945

భారత సైనికులమీద తమకుగల అధికారాన్ని భారత ప్రజలను అణచటానికి యథేచ్ఛగా వినియోగించుకోవచ్చుననే విశ్వాసాన్ని 1930 లో పెషావరులో గర్వాలీ సిపాయీలు భంగపరిచారు. నిరాయుధ ప్రజలమీద కాల్పులుచేయటానికి వారు నిరాకరించారు. అటుతరవాత భారత సైన్యానికి చెందిన నౌకాశాఖలోనూ, వైమానిక శాఖలోనూకూడా తీవ్రమైన సమ్మెలు జరిగాయి.

కాని 1945 ఫిబ్రవరి 21-23 లో బొంబాయి యుద్ధనావికులు అధికారుల మీదచేసిన తిరుగుబాటు చాలా ప్రాముఖ్యంకలది. ఎందుచేతనంటే ఈ తిరుగుబాటుకు ప్రజాసామాన్యం అండగా నిలిచింది. ఫిబ్రవరి 22 న బొంబాయిలో జరిగినహర్తాలు మహత్తరమైనది. అంత జయప్రదంగా ఎన్నడూ హర్తాలు జరిగి ఉండలేదు. అందులో హిందువులూ, ముస్లిములూ, కాంగ్రెస్‌వాదులూ, లీగువారూ కూడా నిరాక్షేపణగా పాల్గొన్నారు.

ఈ తిరుగుబాటుకు మూలకారణం నావికులు సాగించిన సమ్మె. తమ పరిస్థితులు హేయంగా ఉండటంవలనా, అధికారులు జాతివిచక్షణ చూపుతూ ఉండటంవలనా, తమ ఆత్మగౌరవంనిలుపుకునేటందుకున్నూ యుద్ధనావికులు సమ్మె చేశారు. ఈసమ్మె ప్రశాంతమైన సమ్మె. వారు తమ కనీసకోర్కెలను ఫిబ్రవరి 19 న అధికారులకందజేశారు. కాని అధికార్లకు వీరి కోర్కెలను సానుభూతితో విచారించే సౌజన్యంలేక వీరిని తుపాకులతో శిక్షించజూచారు. అప్పుడు నావికులు ఆయుధధారణచేసి 7 గంటలు హోరాహోరి ఫిరంగులతో పోరారు. శిబిరాలనూ నౌకలనూ వీరు ఆక్రమించి చాలా నైపుణ్యంతో యుద్ధంచేశారు. వీరు భారతీయ పౌరులకు తమ స్థితిగతులు తెలియజేస్తూ ప్రజల సానుభూతికోరారు. వారు కాంగ్రెసు లీగునాయకులకుకూడా తమవల్ల తప్పులేదని తెలుపుతూ విజ్ఞాపన పంపారు. నాయకులు యుద్ధం ఆపి అధికారులకు చిక్కమని ఆజ్ఞాపించగానే వారు ఆగిపోయినారు. తిరుగుబాటుచేసినందుకు ఎట్టి చర్యలూ తీసుకోబడవని వారికి భరవసా ఇవ్వబడింది.

రెండురోజులపాటు బొంబాయి అట్టుడికి పోయింది. సైనికులు ఆయుధ వాహనాలతో బొంబాయి వీధులలో వీరవిహారంచేసి కనిపించినవారినీ, ఇళ్ళలో ఉన్నవారిని పైకిలాగీ చంపేశారు. రెండురోజులలోనూ చచ్చినవారి సంఖ్య 250!

ఈ సంఘటనను గురించి జవహర్లాల్ నెహ్రూ, "భారతీయ సైనికులకూ భారతీయ ప్రజలకూ మధ్య బ్రిటనుపెట్టిన ఇనపగోడ పడిపోయింది," అన్నాడు. కాని ప్రజలనుంచి నావికులకు వచ్చినసానుభూతిలో ఎన్నో వొంతుకూడా నాయకుల వద్దనుంచి రాలేదు.



మన్యంలో ప్రజలు అనాగరికులు. వారి సంస్కారమూ, సంప్రదాయాలూ, జీవిత విధానాలూ చాలా హీనస్థితిలో ఉంటాయి. ఈ కోయలూ, చెంచులూ, మొదలైన జాతులను మనం అడివి మనుషులుగా చూస్తాం. కాని వారిలోకూడా స్వాతంత్ర్య కాంక్ష తీవ్రంగా ఉంటుంది. పైపెచ్చు వారు స్వాతంత్ర్యంకోసం పులులూ సింహాలూ పోరినట్టు పోరగలరు. అధికార్లను వారు సంస్కార్లకన్న అధికంగా వెలిపెట్టి బాడగలరు.

బ్రిటిషువారి పెత్తనం వారి జీవితాన్ని చాలా తారుమారుచేసింది. వారి అడవులన్నీ రిజర్వు అయాయి. ఫలాలూ, దుంపలూ, గడ్డీ, వెదురుబియ్యమూ వారికీ వారి పశువులకూ అందకుండా పోయాయి. ఈవిధంగా స్వాతంత్ర్యం కోల్పోవటం ఏమిటో వారెరగరు. ఆస్వేచ్ఛతో వారి సర్వస్వమూ పోయినట్టయింది. భారతదేశంలో బ్రిటిషువారి పరిపాలన పశుతుల్యులకూడా సహించరాని దయిందన్నమాట.

ఈ కొండజాతివారిని సంస్కరించే పద్ధతిలో బ్రిటిషువారు వర్గరహితంగాఉన్న ఆ సమాజంలో ముఠాదార్లూ, రైతులూ, కూలీలూ, అని మూడుచీలికలు చేశారు. మన్యంలో బ్రిటిషువారికి కావలిసిన ముడిపదార్థాలు సమృద్ధిగాఉన్నాయి, కాని రోడ్లులేవు. రోడ్డువేయటానికి ఏర్పాట్లు జరిగినప్పుడు బాశ్యన్ అనే తహశీల్దారు మరొకరి పేరుతో అకంట్రాక్టులు తనే పుచ్చుకున్నాడు. అతనికి మన్యం ప్రజలు చౌకకూలీకి గొడ్లలాగా దొరికారు. ఆ కూలీలను బుకాయించీ, వంచించీ, వారి కూలీలో కొంత తాను అపహరించీ, బెదిరించీ, ఒకవంక తన అధికారాన్ని దుర్వినియోగపరుస్తూ, వారి అసమర్థస్థితిని వినియోగపరుచుకుంటూ బాశ్యన్ రోడ్లువేయించాడు. ఎదురుతిరిగిన వాళ్ళమీద దొంగకేసులు బనాయిస్తూవచ్చాడు.

నడింపాలెంలో గాముసోదరులు గంటందొరా మల్లుదొరా ఉండేవాళ్ళు. గంటందొర గట్టుపానకాలు గ్రామానికి మునసబు. వాళ్ళకు ప్రజలలో మంచి పలుకుబడి ఉందనితెలిసి బాశ్యన్ వారి సహాయంతో ప్రజలను దోచ గానికి ఎత్తువేశాడు. గాముసోదరులు బాశ్యన్‌కు గడ్డిపెట్టారు. దాంతో గంటందొర ఉద్యోగంపోయింది. వాళ్ళ ఆస్తులుకూడా లాగేసి గాముసోదరు లిద్దర్నీ ప్రభుత్వ విరోధులుగాచేశాడు బాశ్యన్.

త్వరలోనే సీతారామరాజుకూ గాముసోదరులకూ స్నేహమయింది. సీతారామరాజు చాలా చదువుకున్నవాడు. అతనికి చాలాభాషలు వచ్చుననీ, జ్యోతిషంలోనూ వేదాంతంలోనూ ఆరితేరినవాడనీ చెబుతారు. అతను చిన్నతనంనుంచ వైరాగ్యపంథాలో పడిపోయినాడు. రాజకీయ రంగంలో కాంగ్రెసు ఉద్యమాన్నీ, విప్లవకారుల పంథానూకూడా సమగ్రంగా అర్థంచేసుకున్నాడు. భారత దేశదాస్యమూ మన్యప్రజల ఇక్కట్లూకూడా అతన్ని బ్రిటిషు విద్వేషిగా చేశాయి. విప్లవకారులు కార్యశూరులేగాని వారిది ప్రజాఉద్యమంకాదు. కాంగ్రెసు ఉద్యమం అతనికి కార్యశూన్యంగా కనపడింది. కార్యశౌర్యంగల ప్రజాఉద్యమాన్ని నడపాలని అతను

# మన్యంలో పోరాటం
# అల్లూరి సీతారామరాజు

సంకల్పించుకున్నాడు. అతను కృష్ణదేవిపేటలో మకాంపెట్టి రామాలయంలో నివాసం ఏర్పరచుకున్నాడు. చుట్టుపక్క ప్రజలు అతన్నొక అవతారపురుషుడుగా భావించారు.

సీతారామరాజు ఆ చోకితగిలి కలెక్టరూ, పోలీసు సూపర్నెంటూ అతన్ని ప్రశ్నించారు. మన్యంప్రజలను తిరుగుబాటు చేయిస్తున్నాడనీ, వారిచేత తాగుడు మాన్పించటానికి ప్రచారం చేస్తున్నాడనీ నేరాలుమోపారు. ప్రజలను అతడు కోర్టు కెక్కనివ్వకపోవటంకూడా వారికి నచ్చలేదు. కాని అతన్ని శిక్షించదగిన కేసేమీ వారికి దొరకలేదు. అయినా అతన్ని నరసిపట్నం పట్టుకుపోయి ఆవూరు దాటరాదని శాసించారు. తరవాత అతనికి పైడిపుట్టి దగ్గర 30 ఎకరాల భూమియిచ్చి అది దున్నుకుని బతకమని ఆశచూపారు. కాని సీతారామరాజు తీవ్రంగా కార్యరంగంలోకి దిగాలని తీర్మానించుకుని పోలీసులను తప్పించుకుని మన్యం ప్రజలమధ్య రహస్యజీవితం ప్రారంభించాడు.

సీతారామరాజుకు తగిన వాతావరణం ప్రజలలో ఏర్పడుతూవచ్చింది. ఎందుకంటే బాశ్యన్ పైశాచిక కృత్యాలు నానాటికీ పెచ్చుపెరిగి పోతున్నాయి. వాడు రైతుల్నీ కూలీలనూ నానా హింసలు పెట్టసాగాడు. వారిని సంస్కరించే పంథాలోనేకాబోలు వారిని చెట్లకు కట్టించి చింతబెత్తాలతో కొట్టించాడు వారి మర్మస్థానాలకు కారంపట్టించాడు. ఆవిధంగాగాని వారికి సామ్రాజ్యవాదుల సంస్కారం అవగాహన కాదనుకుని ఉంటాడు. ఇటువంటి కిరాతకప్రభుత్వ చర్యలు మన్యప్రజలని లేపగొట్టాయి. గాముసోదరు లిద్దరూ సీతారామరాజుకు అంగరక్షకులైనారు. మన్య ప్రజలు రాజువెనక నిలవడ్డారు. విప్లవం సాగింది.

సీతారామరాజు మొదటిదెబ్బ చింతపల్లి పోలీసుస్టేషనుమీద కొట్టాడు. పోలీసులు పారిపోయినారు. అక్కడిజైలు పగలగొట్టి రాజు ఖైదీలను విచారించాడు. ఒక్కరిమీదా సరిఅయిన కేసులేదు. రాజుకుచిక్కిన పోలీసుఉద్యోగి అతని కాళ్ళమీదపడి క్షమాపణవేడాడు. సీతారామరాజు అక్కడి పోలీసు రికార్డులన్నీ పరశురామప్రీతిచేసి అక్కడదొరికిన డబ్బూ ఆయుధాలూ ప్రజలలో పంచిపెట్టాడు.

అదిమొదలు సీతారామరాజు అనేక పోలీసుస్టేషనులు కొట్టాడు. ఆయాజైళ్ళలో కుములుతున్నవారిని తనసేనలో చేర్చుకున్నాడు. ఆసేనకు కావలిసిన ఆయుధాలు ఆస్టేషనుల్లోనే పుచ్చుకున్నాడు. పోలీసుశాఖకు రాజుపేరుచెపితే ఒక అవ్యక్తమైన భీతాహం పుట్టిపోయింది. అతనికి రకరకాల శక్తులున్నట్టు వారేనమ్మినట్టు కనిపిస్తుంది.

సీతారామరాజు మన్యం తిరుగుతూ ప్రజలను కూడగట్టి విప్లవంగురించి ప్రబోధంకూడా చేశాడు. అతను తనసేనను రెండు దళాలుగాచేశాడు. ఒకటి నిరాయుధదళం, ఒకటి సాయుధదళం. నిరాయుధదళం మన్యప్రజలను దైనికజీవితంలో విప్లవపంథాన నడుపుతూ, సమ్మెలు సాగించటానికి, పన్నులు ఎగబెట్టించటానికీనూ, సాయుధదళం అధికారులతో యుద్ధంసాగించటానికీ. ఇదికాక సీతారామరాజుకు అసంఖ్యాకులైన వేగులవాళ్ళుకూడా ఉన్నారు. మన్యానికి సీతారామరాజే రాజు. అతనికింద మన్యం ప్రజలలో చీలికలుపోయి మళ్ళీ ఒకే వర్గమయినారు.

సీతారామరాజును ప్రతిఘటించటానికి కలెక్టరు రిజర్వు ఇప్పించాడు. కాని మన్యం ప్రజలు రిజర్వుకు ఏవిధంగానూ సహకరించలేదు. సహకారమూ, తోడూ, తోవచూపించేవాళ్లూ లేకుండా మన్యంలో సంచరించటం చాలా కష్టం. రిజర్వువారి వార్తలుమాత్రం రాజు కందుతూఉన్నాయి. రిజర్వు పోలీసులు అడవుల్లోపడి పోతూ ఎదురైన దారిపొయ్యేవాళ్ళని చంపుతామని బెదిరించి వాళ్ళచేత తమ బరువులు మోయించారు .వాళ్ళు అర్థరాత్రి పోలీసులు నిద్రపోయేసమయాన పులిభయంపెట్టి పోలీసుల్ని పరిగెత్తించారు. జిల్లారిజర్వుతో ఈ పని సాధ్యంకాదని తేలిపోయింది.


మన్యం విప్లవాన్ని అణచటానికి గవర్నరు మలబారుసైన్యాన్ని పంపాడు. ఈసైన్యానికి నాయకులుగా కవర్టు హైటరులనే దొరలు వచ్చారు. చక్కని వ్యూహంపన్నిగాము సోదరులీ యిద్దరు దొరలనూ తమ తుపాకులకు అహుతిపుచ్చుకొన్నారు. మిగిలిన సిపాయీలూ ప్రాణాలతో బయటపడటానికిగాను ఆయుధాలు వదిలిపోవలిసి వచ్చింది.

ఈసారి సీతారామరాజు విప్లవంగురించి ఇండియా ప్రభుత్వందాకా వెళ్ళింది. అట్టహాసంగా స్పెషలు రైళ్ళమీద డేరాలూ, ఫిరంగులూ, మరతుపాకులూ. సేనలూ దిగినాయి. సైనికులు కొండలన్నీ చుట్టుముట్టి ఒక పగలల్లా సీతారామరాజు సేనతో ఘోరంగా యుద్ధంజరిపారు. కాని చీకటి పడగానే సీతారామరాజుముఠా దెబ్బలుతిన్నవారిని భుజాలమీదవేసుకుని శత్రువ్యూహం ఛేదించుకుని పారిపోయినారు. అంతటితో యుద్ధం అయిపోయిందిగాని విప్లవం అయిపోలేదు.

మన్యంలో మార్షల్‌లా ప్రకటించారు. సైనికులు సీతారామరాజును చూపమని ప్రజలను హింసించసాగారు. ఒకఊరు తగలబెట్టారు. సీతారామరాజునూ, గాము సోదరుల్ని పట్టిస్తే లంచాలాశపెట్టారు ఊరివాళ్ళకి. మగవాళ్ళు మాట్లాడకపోవటంచూసి వారిని చెట్లకుకట్టి నెత్తురు కాలవలు కారేటట్టు కొట్టారు. లాభంలేకపోయింది. స్త్రీలను బెదిరించారు. ఒక చెంచుస్త్రీ చంకలో పిల్లాణ్ణి లాక్కుని వాణ్ణి కత్తితో పొడిచారు. ఆసమయాన సీతారామరాజు తన గరిల్లాలతో ప్రత్యక్షమైనాడు. సైనికులు పారిపోయినారు.

కాని సైనికుల అత్యాచారాలు నానాటికీ మితిమీరాయి. తల్లులఎదట పిల్లల్నీ, పిల్లలఎదుట తల్లుల్నీ చంపారు. మనుషుల కాళ్ళుచేతులు నరికి, మొండాలను చావకముందే గొంతుదాకా మట్టిలోపూడ్చి ఏనుగులచేత తొక్కించి నానాహేయమైనపనులూ చేశారు. ఈ ఘోరాలుచూసి సీతారామరాజు సహించలేకపోయినాడు. ప్రభుత్వసేనలతో ముఖాముఖి పోరటంవల్ల అపజయం తప్ప మరొకటి ఉండదు, కాని సైనికాధికారులుచేసే ఘోరాలూ, ప్రజలనుపెట్టే హింసలూ చూస్తూ భరించేకంటె వీరమరణమే మేలనిపించింది. ఫలితాన్ని తృణీకరించి సీతారామరాజు ప్రభుత్వసేనలను ఎదుర్కొన్నాడు. ఉన్నది కొద్దిమందిఅయినా తీవ్రంగా యుద్ధంచేశారు. ఈ పోరాటంలో గాముగంటం దొర చనిపోయాడు. అతని సోదరుడు మల్లు దొరా, అగ్గిరాజు మొదలైనవాళ్లు పట్టుబడ్డారు. తరవాత సీతారామరాజును ఒంటరిగాపట్టుకుని తుపాకులతో కాల్చి చంపేశారు.

మన్యంలో సీతారామరాజు చేసిన తిరుగుబాటు దేశమంతటా కాంగ్రెస్ నాయకత్వాన జరుగుతున్న ఉద్యమంతో ఎటువంటి సమన్వయమూ పొందలేదు. సీతారామరాజుకు ఆ స్థితిలో కాంగ్రెసుచేయదగిన సహాయంలేదు. కాని మన్య ప్రజలలో పరప్రభుత్వం రేపిన ఆందోళనకు సీతారామరాజుచేసినది సరిఅయిన ప్రతిక్రియ కాదనటానికి వీలులేదు. అందుచేత ఈ సంఘటన భారతీయులలో స్వాతంత్ర్యాగ్ని రగుల్గొలపటానికీ, వారిలో ధైర్యసాహసాలు పెంపొందింప జేయటానికి పనికివస్తుంది.



# భారతరాజ్యాంగ పరిషత్తు

భారత సమాఖ్యలోని రాష్ట్రాల భావి పరిపాలన విషయమై రాజ్యాంగ పరిషత్తు ఆమోదించిన ప్రణాళిక క్లిష్టంగా ఉంది. దీనిని అమలుపరిస్తే చిక్కులు రావటానికి వీలుంది. ఈ ప్రణాళిక ప్రకారం వయోజన వోటింగ్ పద్ధతిపై నేరుగా ప్రజలు గవర్నరును ఎన్నుకొంటారు. ఇలా ఎన్నుకోబడిన గవర్నరు నాలుగు సంవత్సరాలపాటు ఆ పదవిలో ఉంటాడు. ఈ గవర్నరూ, శాసనసభకు బాధ్యతవహించి పనిచేసే మంత్రివర్గం దైనం దినపరిపాలన సాగిస్తారు. ఈ ప్రణాళికను చూడగానే బ్రిటిష్ అమెరికన్ రాజ్యాంగ విధానాలను మేళవించినట్లు స్పష్టమవుతుంది. అయితే యీ సమన్వయంలో ముమ్ముందువచ్చే చిక్కులను గుర్తించినట్లు కనుపించదు. గవర్నరుకు ఇస్తున్న అధికారాలు నియతంగానేఉంటాయి. కాని యీ అధికారాలవల్ల అతడు రాజ్యాంగశాఖకు, పరిపాలనాశాఖకు అధినేతగా ఉంటాడు. మామూలుగా ఇతన్ని పదవినుంచి తొలగించటానికి వీలులేదు. అయితే యీ ప్రత్యేకాధికారాలను వినియోగించటంలో యితనిమీద యూనియన్ అధ్యక్షునికి పర్యవేక్షణాధికారం ఉంటుంది. ప్రమాదపరిస్థితి ఏర్పడినప్పుడు గవర్నరు సర్వాధికారాలు చెలాయించవచ్చును. కాని ఈచర్య జరిపిన 15 రోజులలోపుననే ఈ సంగతి అధ్యక్షునికి తెలియజేయాలి. శాసనసభ ఎన్నుకొన్నా మంత్రివర్గం రాష్ట్రపరిపాలనా నిర్వాహణ విషయంలో సలహా యిస్తూవుంటుంది. మంత్రివర్గం శాసనసభకు బాధ్యతవహించి పనిచేస్తుంటుంది. అందువల్ల గవర్నరుకు ప్రత్యేకాధికారాలున్నా, మంత్రివర్గం ఆమోదంపొంది, దానిసలహాలను పాటించి వ్యవహరించాలి. అందువల్ల రాజ్యాంగంలో మంత్రివర్గం కీలకస్థానం ఆక్రమిస్తున్నది.

సిద్ధాంతరీత్యా యిదంతా సుస్పష్టంగా సంతృప్తికరంగానే ఉంది. కాని గవర్నరు మంత్రివర్గంతో సంప్రదించటానికి నిరాకరించి మంత్రివర్గాల యిష్టాలను త్రోసి వేయటానికో, శాసనసభకు విశ్వాసపాత్రమైన మంత్రివర్గాన్ని రద్దుచేయటానికో, శాసనసభను రద్దుచేసి కొత్త ఎన్నికలు జరపటానికో తన ప్రత్యేక అధికారాలను

చాపలి వెంకట హనుమంతరావు

వినియోగించటానికి పూనుకొంటే ఏమిజరుగుతుంది? అతన్ని రాష్ట్రీయ ప్రభుత్వాధి కారిగా ప్రజలు నేరుగా ఎన్నుకొంటున్నారు. అందువల్ల ప్రజలే తనకు అధికార మిచ్చారని అతడనవచ్చును. కాస్త ప్రతిభావంతుడైతే అతనికుండే ప్రత్యేకాధి కారాలు అప్రతిహతాలై మంత్రివర్గం అధికారాలకంటే బలీయాలుగా తయారు కావచ్చును. అలాంటి పరిస్థితేవస్తే, మంత్రివర్గం గవర్నరు నిరంకుశ చర్యలపై ఫలప్రదంగా అసమ్మతి సూచించటానికి వీలులేకపోవచ్చును. ఎందుకంటే "మీ మంత్రులను శాసనసభ మాత్రమే ఎన్నుకొన్నది. నన్ను ప్రజలంతా ఎన్ను కొన్నారని," అతడు వాదించటానికి వీలుంది. పైగా పదవికివచ్చిన తరువాత గడువు పూర్తిఅయ్యేటంతవరకు ఒక్క నేరారోపణ ప్రతిపాదనద్వారా తప్ప అతన్ని తొలగించటానికి వీలులేదు. ఈ ప్రతిపాదన తేవటం ఎంతో కష్టసాధ్యమైన పని కాని, తేలికకాదు. అలాంటి ప్రతిపాదనతేవటం అనేది జరిగితే తీవ్రస్పర్థ బయలుదేరి ప్రతిష్టంభన ఏర్పడ వచ్చును. శాసనసభను సమావేశ పరిచేది గవర్నరే. అందువల్ల శాసనసభ, మంత్రివర్గం గవర్నరు నిర్ణయాలకు దోసిలిఒగ్గాలి. లేదా యూనియన్ అధ్యక్షుణ్ణి జోక్యం కలిగించుకోవాలని కోరాలి. లేదా, నేరారోపణ ప్రతిపాదనచెయ్యాలి. ఇలాంటి తరణోపాయం లేకపోలేదు. కాని అనర్థకం బయలు దేరి ప్రతిష్టంభన ఏర్పడినతరువాతనే ఈమార్గం అవలంబించటానికి వీలవుతుంది.

అమెరికా అధ్యక్షునికి అంత అవకాశం, అధికారం ఇచ్చారంటే కారణంఉంది. శాసనసభ, పరిపాలనశాఖ, న్యాయశాఖ విడివిడిగాఉంచి, వాటికి అధికారాలను విస్పష్టంగా పంచారు. ఈ అధికారాలను చెలాయించటంలో ఒక శాఖకు మరొక శాఖకు ప్రతిబంధక మేర్పడకుండా సమన్వయం ఏర్పరచటంకోసమని అలా చేశారు. అమెరికన్ పౌరులంతా కలిసి ఎన్నుకొంటారు కాబట్టి అధ్యక్షునికి, కాంగ్రెస్‌కు సమానత్వం ఉంటుంది. ఎవరి రంగంలోవారు పరమాధికారులు. అధ్యక్షుడు, కాంగ్రెస్ (అమెరికన్ శాసనసభ) ఒండొరుల విధానాలను, నిర్ణయాలను మార్చుకో వచ్చును. పరిపాలన అంతా అధ్యక్షుని పేరుతో సాగిపోతుంది. మంత్రివర్గం అతనికి బాధ్యతవహిస్తుందే కాని, కాంగ్రెస్‌కు బాధ్యతవహించదు. ఐనా అమెరికన్ అధ్యక్షు నికి కాంగ్రెస్‌ను రద్దుచేసే అధికారంలేదు. భారత సమాఖ్యలోని రాష్ట్రీయ గవర్నరుకు శాసనసభను రద్దుచేసే అధికారంఉంది, గవర్నరును మంత్రివర్గం సలహానుసరించికాని, శాసనసభ ఓటునుపట్టికాని నియమించటం జరిగి ఆస్ట్రేలియన్ రాజ్యాంగంలోలాగా నామమాత్రపు రాజ్యాంగాధిపతిగా ఉండటం సంభవిస్తుం

దనుకోంది. ఆపక్షంలో నియమితుడయ్యే గవర్నరుకు నేరుగా ప్రజలు ఎన్నుకొన్న గవర్నరుకుండే పదవీ ప్రతిపత్తులు ఉండటానికి వీలులేదు. రాజ్యాంగ పరిషత్తు వారి ప్రణాళికలో మంత్రివర్గానికి గవర్నరుకు పరస్పరంగా అలాంటి అధికారాలు ఉంటున్నప్పుడు గవర్నరుకి ప్రత్యేకాధికారాలకు ఆచరణలో ఎలా నియతత్వం మేర్పడుతుందో స్పష్టంకావటంలేదు.


రాజ్యాంగచట్టంరీత్యా కాకపోయినా, న్యాయశాస్త్రరీత్యా గవర్నరు సొంత బాధ్యతతో వ్యవహరించటానికి ఎక్కువ అవకాశంఉంది. యూనియన్ అధ్యక్షుని కున్న పర్యవేక్షణాధి కారాల్ని గవర్నరు చర్యతీసుకొన్న పిమ్మటకాని అమలు పరచటానికి వీలులేదు. అందువల్ల విపత్సమయంలో గవర్నరుకిస్తున్న ప్రత్యేకాధి కారాలుకూడ విమర్శనీయమవుతున్నాయి. గవర్నరు తన ప్రత్యేకాధికారాల్ని విని యోగించి విపత్సమయంలో చర్యతీసుకొన్నప్పుడు 15 రోజులలోగా యూనియన్ అధ్యక్షునికి తెలియజేయాలని రాజ్యాంగ పరిషత్తు నిబంధన ఒకటిపెట్టింది. ఈ నిబంధన గవర్నరు తన అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా ఉండటానికి అట్టె తోడ్పడజాలదు.


గవర్నరు నిరంకుశతత్త్వం కలవాడైతే, రాజ్యాంగపరిషత్తు తయారుచేస్తున్న ముసాయిదా రాజ్యాంగం ఆ నిరంకుశత్వం కొనసాగించటానికి అవకాశమిస్తున్నది. తనతో కలిసిరాని మంత్రివర్గాన్ని రద్దుచేయటానికి గవర్నరుకు అధికారమున్నదని యిదివరకే పేర్కొన్నాను. అలా రద్దుచేస్తే మంత్రివర్గం చేయవలసినది ఏమిటి? మంత్రివర్గం శాసనసభ సహాయంకోరాలి. లేదా, కొత్తఎన్నికలు జరిపించవలసినదని గవర్నరునుకోరాలి. లేదా నేరారోపణ ప్రతిపాదనచేయాలి. శాసనసభ మంత్రి వర్గాన్ని బలపరస్తుందనుకొన్నా, శాసనసభను కొంతకాలంవరకు, అంటే, యూని యన్ అధ్యక్షుడు జోక్యం కలిగించుకోక తప్పదనుకొనే టంతవరకు, ధిక్కరించ టానికి వీలుంది. రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రవర్తించే గవర్నరును సక్రమ పంథాలో పెట్టటానికి నేరారోపణ ప్రతిపాదనమార్గం తేలికకాదు. దానివల్ల అంత తొందరగా పని జరగదు. పైగా నేరాపణ ప్రతిపాదన నెగ్గకుండా చేయటానికి తగినబలం అతనికి శాసనసభలో లేకుండావుండదు. ఈబలంతో అతడు కావలసి నంతమంది సభ్యులు కూడిరాకుండా చేయటానికి వీలుంది.

మంత్రులు కొత్త ఎన్నికలు జరిపించాలని కోరితే "ప్రజలు గవర్నరు పదవికి ఎన్నుకొని నాయందు విశ్వాసం ప్రకటించారు. కాబట్టి ఈ పదవీకాలంలో ప్రజలకు

నేనే ప్రతినిధిని, మిమ్మ ప్రజలంతా ఎన్నుకోలేదు. శాసనసభలోని పెద్దపార్టీ మాత్రమే ఎన్నుకొన్నది, కాబట్టి ప్రజానీకానికి అంతకూ మీరెట్లా ప్రతినిధు లవుతారు?" అని గవర్నరు త్రోసివేయవచ్చును.

పైన పేర్కొన్న పరిస్థితి రాకపోవచ్చును. ఎన్నికల్లోవచ్చిన గవర్నర్లు శాసనసభకూ, మంత్రివర్గానికి ప్రతికూలంగా ఉండరు. గవర్నరుకు మంత్రివర్గానికి తీవ్రస్పర్థ బయలుదేరి ప్రతిష్టంభన అనివార్యమౌతుందని కనిపిస్తే, సామరస్యం కోసం ప్రయత్నం జరుగుతుంది. లేదా అధ్యక్షుణ్ణి జోక్యంకలిగించుకోవలసిందని కోరటం జరుగుతుంది. ఈవిధంగా స్థితిగతులు విషమించకముందే పరిష్కార మేర్పడవచ్చును. కాని అంతమాత్రంచేత వివాదబీజాలులేవనీ, అలాంటి పరిస్థితులు అసలు ఎప్పుడూ రావటానికి వీలులేదనీ అనటానికి వీలులేదు. ప్రతిభాధురంధరులు మన జాతీయ రాజ్యాంగాన్ని తయారుచేస్తున్నప్పుడు స్థిమితమైన సక్రమ ప్రభుత్వ స్థాపనకు తీవ్రప్రమాదాన్ని తెచ్చిపెడుతున్న యీలోటును మన ప్రతినిధులు విస్మరించటానికి వీలులేదు. నియతాధికారాలే యిచ్చినా, గవర్నర్లను నేరుగా ఎన్నుకొనే విధానం, శాసనసభకు బాధ్యతవహించే మంత్రివర్గ విధానానికి రాజ్యాంగంరీత్యా విరుద్ధమని నేను భావిస్తున్నాను. విభిన్న ప్రజాసంస్థలకు ప్రాతినిధ్యం వహించే రెండు విభిన్న పరిపాలనా శాఖాధికారులకు ఏకీభావం ఏర్పడని పరిస్థితులు రావచ్చును. అలాంటి పరిస్థితులలో వారి అభిప్రాయభేదాలు విషమతరంగా ఉండటానికి వీలుంది. అందువల్ల బ్రిటిష్ రాజ్యాంగవిధానానికి, అమెరికన్ రాజ్యాంగవిధానానికి మనవారు కల్పించిన సమన్వయం ముమ్ముందు చిక్కులు రావటానికి తావిస్తూ చీకాకుగావుంది. రాష్ట్రీయ రాజ్యాంగానికి సంబంధించిన యీ ప్రత్యేకభాగాన్ని ఈసారిజరిగే సమావేశంలో జాగ్రత్తగా పరిశీలించి రాజ్యాంగ పరిషత్తు ఈలోటును తొలగిస్తుందని ఆశిస్తున్నాము.





# ముస్లిం లీగు పుట్టు పూర్వోత్తరాలు

నేడు దేశం రెండు చీలికలైపోయి పాకిస్థాన్ భారతసమాఖ్య అన్న రెండు స్వతంత్ర అధినివేశ రాజ్యాలు ఏర్పడ్డాయి. విప్లవం పూర్తిగా నెగ్గిఉంటే యీపని యెన్నడూ జరిగిఉండేది కాదని ప్రతివారు అంగీకరించకతప్పదు. ఈ విభజనతోనైనా దేశంలో శాంతి ఏర్పడి సాంఘిక ఆర్థిక రాజకీయాభివృద్ధి జరుగుతుందనీ, ఇంతటితో హిందూమహమ్మదీయ సమస్య అల్పసంఖ్యాకుల సమస్య తీరిపోయిందని అనుకోటానికి అవకాశాలు కనిపించటంలేదు. కలకత్తా పంజాబులలో ఇంకా కొంత అల్లరి జరుగుతూనేవుంది.

అసలు ఈ సమస్య యింత విషమించటానికి కారణమేమిటి? ముస్లింలీగ్ దీనికంతా కాంగ్రెసే కారణమంటుంది. కాంగ్రెస్ ఈబాధ్యత అంతా లీగ్ బ్రిటిష్ ప్రభుత్వాలదే నంటుంది. సోషలిస్టులు, తదితర తీవ్రవాదులు బ్రిటిష్ సామ్రాజ్య ప్రభుత్వం, రాజకీయ చైతన్య అభావం, లీగ్ మొండిపట్టుదల కారణమంటాయి. ఎవరేమిచెప్పినా ఈ సమస్య పుట్టుపూర్వోత్తరాలను, లీగ్ చరిత్రను, దేశీయ సాంఘిక ఆర్థిక రాజకీయ పరిస్థితులను ఒకసారి సింహావలోకనంచేస్తే కాని మూల కారణం తెలియదు.

## ఈస్టిండియా కంపెని - మహమ్మదీయులు

ఈస్టిండియాకంపెనీ 1757 లో బెంగాలును జయించినప్పటినుంచి మహమ్మదీయులను పూర్తిగా అణచివేయసాగింది. అప్పటికి రాజ్యాధికారులలో ఎక్కువమంది మహమ్మదీయులు. రాజ్యం గుంజుకోవలసింది వారినుంచి. అందువల్ల బ్రిటిష్ వారికి మహమ్మదీయులంటే ఎంతో కంటుగాఉండేది. ఆరోజుల్లో ఇండియాలో వాణిజ్యం పరిశ్రమలు అధికంగా హిందువుల అధీనంలో ఉండేవి. అందువల్ల వర్తకంకోసం హిందువులు బ్రిటిష్‌వారితో సన్నిహిత సంబంధం ఏర్పరచుకోవటం, కొంతవరకు ఆంగ్లసంస్కృతిభాషలతో పరిచయం ఏర్పడ్డం జరిగాయి. దానితో బ్రిటిషువారు హిందువులను కొంతదగ్గరకుతీయటం జరిగింది. ఈ విధానం 1750 నుంచి 1885 వరకు బ్రిటిష్‌వారు అప్రతిహతంగా సాగించారు.

ఈవిధానంవల్ల భారతీయ మహమ్మదీయులకు జరిగిన అపకారం ఇంతా అంతా కాదు. ఆర్థికంగా మహమ్మదీయులు పూర్తిగా దెబ్బతిన్నారు. బెంగాల్‌లో భూమి శిస్తు వసూలుచేయటానికి నియమించిన ఉద్యోగస్థులను (వీరిలో చాలవరకు హిందు

వులే) ప్రభుత్వం జమీందార్లనుగా చేసివేసింది. మహమ్మదీయులంతా రైతులై పోయారు. జమీందారులు వీరిని పీల్చి పిప్పిచేస్తూవచ్చారు.

విద్యావిషయికంగాచూస్తే బ్రిటిష్‌ప్రభుత్వం ఆరోజుల్లో చేసిన అపకారం అంతా యింతాకాదు. ఆనాడు ఉత్తరహిందూస్థానంకోర్టుల్లో పర్షియన్ అరబిక్ భాషలు ఉంటుండేవి. వీటిని పూర్తిగా బ్రిటిష్‌ప్రభుత్వం తొలగించి వేసింది. మహమ్మదీయ పాఠశాలలలో పర్షియన్ అరబిక్ భాషలను చెప్పటం మానివేశారు. స్కూళ్ళల్లో బోధించేవిషయాలనుకూడ మహమ్మదీయులను విముఖులను చేసేటట్లుగా చేశారేతప్ప వారిని ఆకర్షించేటట్లుగా చేయలేదు. ప్రభుత్వ పాఠశాలలో తమ ఇష్టంవచ్చినట్లు చేసుకొన్నారనుకొన్నా, ప్రైవేటు పాఠశాలనైనా యథాపూర్వంగా సాగనివ్వలేదు. ఆరోజుల్లో ఒక్క బెంగాలులో నాలుగోవంతుభూమి దేవాలయాల క్రింద, మసీదులక్రింద, విద్యాసంస్థలక్రింద ఉండేది. దీనిమీద ఎలాంటి శిస్తు వేసేవారుకాదు. ఈస్టుఇండియాకంపెనికి డబ్బు అవసరమై ఈ మాన్యాలనన్నిటిని నిర్దాక్షిణ్యంగా ఆక్రమించుకొన్నది. ఈ ఆక్రమణవల్ల ప్రభుత్వానికి సాలీన మూడులక్షలపౌనులు ఆదాయం పెరిగింది.

విద్యావిషయంలో ఆనాడు బ్రిటిష్‌ప్రభుత్వం మహమ్మదీయులను ఎంత అన్యాయం చేసిందో చెప్పటానికి ఈ క్రింది ఒకనిదర్శనం చాలును.

18 వ శతాబ్దిలో సుప్రసిద్ధ వ్యక్తిఅయిన హాజి మహమ్మద్ మొహిసిన్ విద్య కోసం ఒక ధర్మసంస్థను నెలకొల్పి, ధర్మకర్తలను ఏర్పరచి లక్షలాదిగా ఉన్న తన ఆస్తిని, తనచెల్లెలి ఆస్తిని వ్రాసియిచ్చిపోయాడు. 1817 లో ఆ ధర్మ కర్తృత్వం ప్రభుత్వానికి సంక్రమించింది. దానికివచ్చే ఐవేజుతో ప్రభుత్వం హుగ్లీ కళాశాల నడుపుతూవచ్చింది. ఆ కళాశాలలో మొత్తం చదువుకొనే విద్యార్థులు 300 మంది ఉంటే, అందులో మహమ్మదీయ విద్యార్థులు కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారని 1872 లో హెచ్. సి. బ్రౌన్ వ్రాశాడు. సాలీన 5,260 పౌనులు ఆ ధర్మసంస్థకు ఆదాయం వస్తూవుంటే అందులో 350 పౌనులుమాత్రమే ప్రభుత్వం మహమ్మదీయుల విద్యకు ఖర్చుపెట్టింది.

న్యాయప్రదాన విధానాన్ని పూర్తిగ ప్రభుత్వం మార్చివేయటంవల్ల వెనకటి చదువులు ఎందుకూ కొరగాకుండా పోయాయి. మహమ్మదీయులు ఆంగ్ల విద్యా విధానానికి అలవాటు పడలేక ప్లీడరీ ఉద్యోగాలు కోల్పోయారు. 1851 లో 240 మందికి ప్లీడరీపట్టాలు ఇస్తే, వారిలో ఒకడుకూడా మహమ్మదీయుడు లేడు. 1852, 68 మధ్య మాత్రం ఒక మహమ్మదీయునికి పట్టాయిచ్చారు.

ఇక ప్రభుత్వ ఉద్యోగాలలోకూడా మహమ్మదీయులకు చాల అన్యాయం జరిగింది. ఉదాహరణకు బెంగాల్‌నే తీసుకొందాము. 1871 లో మొత్తం 2141 గజెటెడ్ ఉద్యోగాలుంటే అందులో 1338 యూరపియన్లకు, 711 హిందువులకు, 92 మహమ్మదీయులకు ఇచ్చారు. అంటే హిందువులకిచ్చిన వాటిల్లో

ఏడో వంతు కూడా వారికివ్వలేదు. ఇక సైన్యంలో కూడా మహమ్మదీయులకు ఈ నిరాదరణే ఎదుర్కొన్నది. ఆనాడు మహమ్మదీయులంటే ప్రభుత్వానికి ఎంత తిరస్కార భావముండేదో స్పష్టమౌతుంది; గవర్నమెంటు ఆఫీసులకు మహమ్మదీయుల పండుగ సెలవు రోజు ఒకటి కూడ ఉండేది కాదు. హైకోర్టు క్రైస్తవుల పండుగలకని 62 రోజులు. హిందువుల పండుగలకని 52 రోజులు, మహమ్మదీయుల పండుగులకని 11 రోజులు మూసివేసేవాళ్ళు.

ఇలాంటి బ్రిటిష్ ప్రభుత్వ విధానంవల్ల మహమ్మదీయులు ఆర్థికంగా, రాజకీయంగా, విద్యావిషయంగా గట్టిగా దెబ్బతిన్నారు. చక్కగా బ్రతకటానికి మహమ్మదీయుడికి ప్రభుత్వం మార్గం లేకుండా చేసివేసింది. అందుకనే డాక్టర్ హంటర్, "170 సంవత్సరాలక్రితం సాధారణకుటుంబంలో పుట్టిన మహమ్మదీయుడు నిరుపేదగా ఉండటానికి వీలులేదు. ఇప్పుడు భాగ్యవంతుడుగా ఉండటానికి అంతకన్నా వీలు లేదు," అని ఆ రోజుల్లో వ్రాశాడు.

బ్రిటిష్ ప్రభుత్వం మహమ్మదీయులపై కత్తి దూయటానికి వహాబీ ఉద్యమం, 1857 తిరుగుబాటులో ప్రముఖపాత్ర వహించటం, అన్న యీ రెండే ప్రధాన కారణాలు. అంతకన్నా మహమ్మదీయులు చేసుకొన్న పాపం ఏమీ లేదు.

ఇలాంటి విధానంతో మహమ్మదీయులు విద్య, ఉద్యోగాలు, జీవనోపాధి కోల్పోయి ఎంతో అధోగతిలో పడ్డారు. ఆ సమయంలో కాంగ్రెస్ సంస్థ ప్రారంభమై దినదిన ప్రవర్ధమానం కాసాగింది. బ్రిటిష్ ప్రభుత్వం ఆతురత హెచ్చింది. కాంగ్రెస్ ప్రాబల్యం అరికట్టటం ముఖ్యమనిపించి మార్గాలు అన్వేషింపసాగింది.

ఇంతలో సర్ సయద్ అహమ్మద్ ఖాన్ అధోగతిలో ఉన్న మహమ్మదీయులను ఉద్ధరించటానికి పూనుకొన్నాడు. వారిలో విద్యాగంధం పెంపొందించి చైతన్యవంతులను చేయటానికి ఉపక్రమించాడు. అలీఘుర్ విశ్వవిద్యాలయ స్థాపనానికి తోడ్పడ్డాడు. మహమ్మదీయులలో ప్రబలిఉన్న అంధ విశ్వాసాలను, దుష్టసంప్రదాయాలను ఖండించాడు. మహమ్మదీయులు అతన్ని నాస్తికుడన్నారు. మతద్రోహి అని వెలివేశారు. చంపేస్తామని బెదిరించారు.

మొదటి రోజుల్లో సర్ సయద్ జాతీయవాది. హిందువులు, మహమ్మదీయులు ఒకేజాతి అనీ, భారతకన్యకు హిందువులు మహమ్మదీయులు చెరి ఒక కన్ననీ అన్నాడు. బెంగాల్‌లో బయలుదేరిన రాజకీయ చైతన్యాన్ని యితడు ప్రశంసించాడు.

కాని అలిఘుర్ కాలేజి ఇంగ్లీషు ప్రిన్సిపాల్ సంపర్కంతో సర్ సయద్ తత్త్వం తరువాత పూర్తిగా మారిపోయింది. 19 శతాబ్దం తుదివరకు అతడు విద్యాధికులైన మహమ్మదీయులు చాలవరకు కాంగ్రెస్‌లో చేరకుండా చేశాడు.

అతని మరణానంతరం హిందూ మహమ్మదీయ విభేదాలు పెంపొందటానికి

హిందీ ఉర్దు వివాదం బయలుదేరింది. అప్పటివరకు ఉత్తర హిందూస్థానపు కోర్టులలో పర్షియన్ లిపి సర్వసాధారణంగా వాడబడుతుండేది. కొంతమంది హిందువులు దీన్ని తీసివేసి నాగరిలిపి ప్రవేశపెట్టాలని ఆందోళన లేవదీశారు. దానితో స్పర్థ బయలుదేరి సంయుక్తరాష్ట్రాలలో అంజుమనే ఉర్దు సంస్థ ఏర్పడింది.

## అలీఘర్ ప్రిన్సిపాల్స్ కుతంత్రాలు

అలీఘర్ విశ్వవిద్యాలయం ఏర్పడినకొత్తలో యూరపియన్లు ప్రిన్సిపాల్సుగా ఉంటూవచ్చారు. ఆనాటి మహమ్మదీయ రాజకీయాలను పరోక్షంగా వీరే నడుపుతూ హిందువులపట్ల వైముఖ్యం, ప్రభుత్వంపట్ల ఆనుకూల్యం పెంపొందిస్తూ వచ్చారు. ప్రజాస్వామిక సంస్థలను ఇండియాలో ప్రవేశపెట్టటానికని చార్లెస్ బ్రాడ్లా 1889 లో బ్రిటిష్ పార్లమెంటులో ఒక బిల్లు ప్రతిపాదించాడు. ఆ రోజుల్లో అలీఘర్ కళాశాల ప్రిన్సిపాల్ గా ఉంటున్న బెక్ మహమ్మదీయుల తరఫున ఒక నివేదికను తయారుచేశాడు. ఆ నివేదికలో ఇండియాకు ప్రజాస్వామ్య పద్ధతి పనికిరాదనీ, భారతీయులంతా ఒకేజాతివారు కాదనీ అన్నాడు. కాలేజీ విద్యార్థుల సహాయంతో ఆ నివేదికపై 20,735 మంది మహమ్మదీయుల సంతకాలు సంపాదించి ప్రభుత్వానికి పంపించాడు. ఆ సంతకం చేసినవారిలో నివేదికలోని అంశాలు తెలుసుకొని మరి సంతకం చేసినవారు ఎంతమంది ఉన్నారో ఆ బెక్ మహాశయుడే బ్రతికివచ్చి చెప్పాలి.

1893 లో మహమ్మడెన్ ఆంగ్లో ఓరియంటల్ డిఫెన్సు అసోసియేషన్ అన్న పేరుతో ముస్లింసంస్థ ఒకటి ఏర్పడింది. మహమ్మదీయుల అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేసి వారి రాజకీయాధికారాలను రక్షించటం, బ్రిటిష్ పరిపాలనను బలపరచేవాటిని సంమర్థించటం, ప్రజలలో రాజభక్తి పెంపొందించటం, మహమ్మదీయులలో రాజకీయ ఆందోళన ప్రబలకుండా చేయడం దాని ప్రధానలక్ష్యాలు.

బెక్ ఇలాంటి అభివృద్ధి నిరోధక రాజకీయాలు 15 సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా సాగించాడు. అతని తరువాత ప్రిన్సిపాల్ అయిన థియడోర్ మారిసన్ తన పదవికి రాజీనామాయిచ్చి హిందీఉర్దూ ఆందోళనలో మహమమ్మదీయుల పక్షాన పనిచేశాడు. 1906 లో అతని స్థానంలో ఆర్చిబాల్డ్ అనే ఆంగ్లేయుడు అలీఘర్ కాలేజీకి ప్రిన్సిపాల్ అయ్యాడు. ఈ సమయంలోనే రాజ్యాంగంలో మార్పులు ప్రవేశపెట్టాలని బ్రిటిష్ప్రభుత్వం ఆలోచించసాగింది.

## ప్రభుత్వ దోహదం-ముస్లింలీగ్ స్థాపన

అప్పటికి కాంగ్రెస్ ప్రబలంగా ఉంది. దాన్ని అణచివేయటానికి ప్రభుత్వం ఆలోచిస్తూవుంది. ఆర్చిబాల్డు మహమ్మదీయులకు చేయూత ఇచ్చి రెచ్చగొట్టి కాంగ్రెస్‌కు ప్రత్యర్థి సంస్థను నెలకొల్పించటానికి వైస్రాయి అంతరంగిక కార్యదర్శి మొదలైన వారితో సంప్రదింపులు జరిపాడు, ప్రభుత్వంకూడా దీనికోసమే ఎదురుచూస్తూవుంది. ఆర్చిబాల్డ్ నుంచి సూచనరాగానే ప్రభుత్వం

వెంటనే దోహదం ఇచ్చింది. ఈ విషయం 1906 లో ప్రిన్సిపాల్ ఆర్చిబాల్డ్ నవాబ్ మొహిసుల్ ముల్క్‌కు వ్రాసిన ఉత్తరాన్నిబట్టి స్పష్టమాతుంది. ఆ ఉత్తరంలో ఆర్చిబాల్డ్ యిలా వ్రాశాడు :

"మహమ్మదీయ రాయబార వర్గాన్ని చూడటానికి వైస్రాయి సమ్మతిస్తున్నాడని ఆయన ఆంతరంగిక కార్యదర్శి కర్నల్ డన్‌లప్‌స్మిత్ నాకు తెలియజేశాడు. వైస్రాయి సందర్శనం కోరుతూ ఆయనకు ఉత్తరం వ్రాయవలసినదని అతడు సలహాయిస్తున్నాడు. ఈ సందర్భంలో కొన్ని సలహాలు పాటిస్తే మంచిది. కొంత మంది మహమ్మదీయ ప్రతినిధులచేత విజ్ఞప్తి పత్రంపై సంతకాలు చేయించి వైస్రాయికి పంపించండి. రాయబారవర్గంలో అన్నిరాష్ట్రాల మహమ్మదీయ ప్రతినిధులు ఉండేట్లు చూడండి. వైస్రాయికి పంపే విజ్ఞప్తి పత్రంలో వ్రాయ వలసిన విషయం: మొట్టమొదట రాజభక్తి ప్రకటించాలి. స్వపరిపాలన విషయంలో ప్రభుత్వంవారు అవలంబించ దలచుకొన్న చర్యను ఆమోదించాలి. ఎన్నికల సూత్రం అమలుపరచటం అనేది జరిగితే, అల్పసంఖ్యాకులుగా ఉన్న మహమ్మదీయులకు నష్టదాయకంగా పరిణమిస్తుందని చెప్పాలి. మహమ్మదీయులకు ప్రాతినిధ్యం నామినేషన్ ద్వారా కాని, మతాన్నిబట్టి కాని యివ్వాలని సవిన యంగా మనవి చెయ్యాలి. ఇండియాలాంటి దేశంలో జమీందారులకు కూడ సముచిత ప్రాతినిధ్య మివ్వాలని చెప్పాలి. ఎన్నికల విధానం ప్రవేశపెట్టటానికి సమయంరాలేదు కాబట్టి, నామినేషన్ పద్ధతినే మహమ్మదీయులు బలపరచటం మంచిది. ఎన్నికలు ప్రవేశపెట్టేటట్లైతే తగిన భాగస్వామ్యం సంపాదించటం మహమ్మదీయులకు చాల కష్టం. ఈ అభిప్రాయాలను ప్రకటించేటప్పుడు నా ప్రస్తావన రానీకండి.... వైస్రాయికి పంపించే విజ్ఞప్తి పత్రం ముసాయిదాను నన్ను వ్రాయమన్నా వ్రాస్తాను. లేదా మీరు వ్రాసినదానిని నన్ను సవరించమన్నా సవరించి పెడతాను. బొంబాయిలో దానిని తయారుచేసేటట్లయితే, నేను పరిచూడ గలను. మనకున్న స్వల్పవ్యవధిలోనే బలవత్తర ఉద్యమం సాగించాలంటే పనులు తొందరగా కానివ్వాలి."

ఆర్చిబాల్డ్ సూచనప్రకారమే మహమ్మదీయ రాయబారవర్గం ఆగాఖాన్ నాయకత్వాన వైస్రాయిని సందర్శించి స్థానికసంస్థలలోను, లెజిస్లేటివ్ కౌన్సిల్‌లోను మహమ్మదీయులకు ప్రత్యేక ప్రాతినిధ్యం కావాలని కోరింది. వైస్రాయి అనుకూ లంగా సమాధానమిచ్చాడు. ఇలా ఈ రాయబారం సఫలం కావటంవల్ల ప్రత్యేక మహమ్మదీయసంస్థ నెలకొల్పటానికి మహత్తరమైన దోహదం లభించింది. 1906 డిసెంబరు 31 అఖిలభారత ముస్లింలీగ్ ఏర్పడి ఢాకాలో ఆగాఖాన్ అధ్యక్షతన సమావేశమైంది.

ఈ విధంగా ముస్లింలీగ్ బయలుదేరటానికి వైస్రాయి, ప్రభుత్వంలోని ఆంగ్లేయ ఉన్నతోద్యోగులు పాటుపడ్డారు. మహమ్మదీయులను చేరదీయటానికని 1905

ఆగస్టు 16 న ప్రభుత్వం బెంగాల్‌ను వారి సమ్మతితో నిమిత్తం లేకుండానే విభజించింది. 1909 లో ప్రత్యేక నియోజకవర్గాలుకూడా అందుకే ప్రవేశ పెట్టింది. ఈ పని కేవలం ఆంగ్లేయ ఉన్నతోద్యోగుల గూడుపుఠాణీవల్ల జరిగిం దని రాంసేమాక్డొనాల్డుకూడ స్పష్టంగా వ్రాశాడు.

పై సంఘటనల నన్నిటిని సింహావలోకనం చేసినప్పుడు ఒకటి స్పష్టమౌతు న్నది. కాంగ్రెస్ ప్రాబల్యం పెరగకుండా చేయటానికి బ్రిటిష్ ప్రభుత్వం మతస్పర్థ లేవగొట్టిందని బోధపడక మానదు. మతద్వేషం పెంపొందించి తమ అధికారానికి ఏమాత్రం ప్రమాదం రాకుండా చేసుకోటానికే ప్రత్యేక నియోజక వర్గాలను ప్రవేశ పెట్టింది.

ప్రభుత్వం మద్దత్తుతో బయలుదేరిన లీగ్ తరువాతనైనా ఆ విషమవాతా వరణంనుంచి బయటపడి సంకుచిత మతద్వేషాలకు అతీతమై మహమ్మదీయ ప్రజానీకానికి అభ్యుదయకరమైన విధానం అవలంబించిందా ? ఈ విషయాన్ని గూర్చి నిశ్చితంగా తేల్చి చెప్పకముందు చరిత్రను పరిశీలించాలి.

1909-10 లో లీగ్ ప్రధానకార్యాలయం అలీఘర్‌నుంచి లక్నోకు మారింది. దానితో, అలీఘర్ కాలేజి యూరపియన్ ప్రిన్సిపాల్స్ పెత్తనం, పలుకుబడి తగ్గిపోయింది. లీగ్‌లో మౌలానషిబ్లి పలుకుబడి హెచ్చింది. బెంగాల్ విభజన మహమ్మదీయులలోకూడా ఆందోళన రేకెత్తించింది.

## జాతీయభావ ప్రజ్వలన

ఈలోపున యూరప్‌లో కొన్ని సంఘటనలు జరిగాయి. టర్కీలో యంగ్ టర్క్ ఉద్యమం బయలుదేరింది. దీని ప్రధానలక్ష్యం జమీందారీ దశలోఉన్న ఆట్టోమన్ సామ్రాజ్యాన్ని ఆధునిక లిబరల్ రాజ్యంగా మార్చటమే. విప్లవంతెచ్చి ఈ ఉద్యమనాయకులు రాజ్యాంగ సంస్కరణలు ప్రవేశపెట్టవలసినదని సుల్తా నును బలవంతపెట్టారు. టర్కీ బలవత్తర రాజ్యంగా తయారైతే తమకు ముప్పు వస్తుందని ఇంగ్లీషువారు సుల్తానుకు సహాయంచేశారు. మహమ్మదీయ ప్రపంచం గగ్గోలు కెత్తింది. బ్రిటిష్ ప్రభుత్వంమీద విద్వేషాగ్నులు గుమ్మరించింది.

లక్నో సమావేశానంతరం జరిగిన లీగ్ సమావేశం హిందూమహమ్మదీయులకు సఖ్యమేర్పడటం ముఖ్యమన్నది. ఇంతలో యుద్ధం ప్రారంభమైంది, మహమ్మదీయు లలో తీవ్రవాదులైన వారిని ప్రభుత్వం నిర్బంధంలో ఉంచింది.

## లక్నో ఒడంబడిక-ప్రభుత్వ కుతంత్రం

1915 లో కాంగ్రెస్‌లీగ్‌ల సమావేశాలు ఒకేసారి ఒకేచోటజరిగాయి. పండిట్ మాలవీయ, మహాత్మాగాంధి, శ్రీమతి సరోజినీనాయుడు లీగ్ సమా వేశానికి హాజరయ్యారు. జనాబ్ జిన్నా తీర్మానంపై, కాంగ్రెస్‌తో సంప్రదించి ఇండియాకు రాజకీయ సంస్కరణ ప్రణాళికను తయారుచేయటానికి లీగ్ ఒక సంఘాన్ని నియమించింది. ఈ సంప్రదింపుల ఫలితంగా లక్నో ఒడంబడిక జరిగింది.

దీనిప్రకారం మహమ్మదీయులకు అల్పసంఖ్యాకులుగా ఉన్నచోట ప్రత్యేక నియోజకవర్గాలతోపాటు అదనపు ప్రాతినిధ్యం ఇవ్వాలి. కౌన్సిళ్ళలో బిల్లును ప్రతిపాదించేటప్పుడు అది ఉభయులలో ఎవరికి సంబంధించినదైనా, ఆపక్షంవారిలో ముప్పాతికవంతు ప్రతిఘటిస్తే దానిని విరమించుకోవాలి.

ఈ ఒడంబడికను చెడగొట్టి మహమ్మదీయులను చేరబట్టటానికని ప్రభుత్వం మహమ్మదీయులపక్షం అవలంబించి విమర్శించింది. మహమ్మదీయులకు అన్యాయం జరిగినదంది. ఈ ఒడంబడిక ప్రకారం బెంగాల్ శాసనసభలోవారికి 34 స్థానాలే వస్తున్నాయి. ప్రభుత్వం యీ అన్యాయాన్ని గమనించి 44 స్థానాలువారికి ప్రత్యేకిస్తున్నదని ప్రకటించింది.

కాని తరువాత జరిగిన జలియన్‌వాలాబాగ్ దురంతాలు మహమ్మదీయుల క్రోధాన్ని ప్రజ్వలింపజేశాయి. ఖిలాఫత్ ఉద్యమం బయలుదేరింది. ఇందులో కాంగ్రెస్ లీగ్ ఉలేమాసంస్థలు మూడు ఏకోన్ముఖంగా పని చేశాయి. 1920 లో లీగ్ డాక్టర్ అన్సారీ అధ్యక్షతన సమావేశమై కాంగ్రెస్ సాగిస్తూవున్న సహాయ నిరాకరణ ఉద్యమంపట్ల సంపూర్ణ ఆమోదసహకారాలు ప్రదర్శించింది. ఈ సుహృద్భావం మరికొంతకాలం సాగింది. 1927 లో లీగులో చీలికలు వచ్చాయి. అసలు లీగ్ కలకత్తాలో జిన్నా అధ్యక్షతక్రింద సమావేశమై సైమన్‌కమిషన్‌ను బహిష్కరించింది. 1928లో లీగ్ మహమ్మదీయుల 14 కోర్కెలను ప్రకటించింది. ఫెడరల్ విధానం ఒక్కటే ఇండియాకు అనుకూలమనీ, రాష్ట్రాలకు రెసిడ్యుయరీ అధికారాలతోగూడిన స్వపరిపాలన ఉండాలని అంటూ ఒక విచిత్రనిబంధన పెట్టింది. ఫెడరేషన్‌లోని అన్నిరాష్ట్రాలు అంగీకరిస్తే తప్ప కేంద్రశాసనసభ రాజ్యాంగాన్ని మార్చగూడదన్న నిబంధన అందులో ఉండాలన్నారు. ఇంతకన్నా విపరీతమైన నిబంధన ఏముంటుంది?

ఈపై సంఘటనలను పరిశీలించినప్పుడు లీగ్ మొదటినుంచి కేవలం మత దృక్పథంతో ప్రవర్తిస్తున్నదే కాని ప్రజాస్వామికదృష్టితో వ్యవహరించటంలేదనీ, ప్రభుత్వం స్వార్థంకోసం ఏమి చేస్తున్నా తదనుగుణంగా పోతున్నదనీ స్పష్టం కాకమానదు.

ప్రభుత్వం, కాంగ్రెస్ తనసహకారంకోసం పోటీలు పడుతున్న వన్న వాసన తగలగానే లీగ్ వాంఛలకు ఒక పరిమితి లేకుండా పోయింది. వాటికికూడా తలఒగ్గి కాంగ్రెస్ లీగ్‌తో ఒక అంగీకారానికి రాగానే బ్రిటిష్ ప్రభుత్వం అంతకన్నా ఎక్కువ అధికారాలిచ్చి ఆ ఒడంబడికను భగ్నంచేసివేస్తూ వచ్చింది. దీనికి

ఉదాహరణ పండిట్ మాలవీయ అల్లాబాదులో ఐకమత్యార్థం జరిపిన సమావేశమే. ఈసమావేశంలో హిందూ మహమ్మదీయులు దాదాపు ఒక అంగీకారానికి వచ్చారు. కేంద్రంలో బ్రిటిష్ ఇండియాలోని మహమ్మదీయులకు నూటికి 32 స్థానాలు ఇవ్వటానికి, బొంబాయి రాష్ట్రంలోనుంచి వేరుచేసి ప్రత్యేక సింధురాష్ట్రం ఏర్పరచటానికి, ఆ కొత్త రాష్ట్రంలో హిందువులకు రక్షణలను కల్పించటానికి, ఒడంబడిక జరిగింది. వెంటనే బ్రిటిష్ సామ్రాజ్యం విజృంభించింది. కేంద్రంలో మహమ్మదీయులకు నూటికి $33\frac{1}{3}$ స్థానాలు ఇవ్వటానికి, బొంబాయినుంచి సింధు రాష్ట్రం వేరుచేసి దానికి కావలసిన ఆర్థిక సహాయం కేంద్రప్రభుత్వంచేత యిప్పించటానికి బ్రిటిష్ ప్రభుత్వం నిశ్చయించిందని ఇండియామంత్రి సర్ శామ్యుయల్ హోర్ రౌండ్ టేబిల్ సమావేశంలో ప్రకటించాడు. సింధురాష్ట్రంలో అల్ప సంఖ్యాకులుగా ఉండే హిందువుల రక్షణసంగతి అతడు ఎత్తనేలేదు.

## ముస్లింలీగ్ హిరణ్యాక్షవరాలు

ఇలాంటి ప్రభుత్వవైఖరి చూడగానే లీగ్ కోర్కెలు మరీ పెచ్చురిల్లాయి. 1934 లో ప్రభుత్వ ఉద్యోగాలలో వివిధమతాల వారికిచ్చే పదవుల నిష్పత్తిని నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తరువు జారీచేసింది. దీనికి లీగ్ వర్కింగ్ కమిటీ అసమ్మతి సూచిస్తూ యీక్రింది కారణాన్ని ప్రకటించింది. ప్రభుత్వం మహమ్మదీయుల హక్కులను రక్షించి న్యాయం కలుగజేయలేకపోయింది. మహమ్మదీయ జనాభాను బట్టి నూటికి 25 వంతులే ఇవ్వటానికి నిశ్చయించింది కాని, శాసన సభలో ఉన్న $33\frac{1}{3}\%$ సభ్యత్వాన్ని అనుసరించి నిర్ణయించలేదు.

ఇలాంటి లీగ్‌తో కాంగ్రెస్ ఒడంబడిక చేసుకోవాలని ప్రయత్నాలు చేస్తూనే వచ్చింది. 1935 లో రాజేంద్రప్రసాదు జనాబ్ జిన్నాతో సంప్రదింపులు జరిపి ఒక అంగీకారానికి వచ్చాడు. ఆ ఒడంబడిక మీద కాంగ్రెస్ సంతకం చేస్తానన్నా జిన్నాకు సంతృప్తి కలగలేదు. దానిపై హిందూమహాసభకూడ సంతకం చేయాలని అతడు పట్టుపట్టాడు. హిందూమహాసభ అంగీకరించలేదు. 'ఈ నిబంధనలకు ఆమోదించని హిందువులతో మేము పోరాడుతా'మని కాంగ్రెస్ హామీ యిచ్చినా జిన్నా అంగీకరించలేదు. నాడు కాంగ్రెస్ హిందూ సంస్థ కాకపోయింది. ఆ కాంగ్రెస్ నాయకుడైన గాంధిజీని హిందువులందరికి ప్రాతినిధ్యం వహించి మాట్లాడవలసిందని 1938 లో జిన్నాకోరాడు. ఈ సంస్థ 1941 వచ్చేటప్పటికి అతని దృష్టిలో హిందూసంస్థకూడా కాక సవర్ణ హిందూ సంస్థ అయింది.

1935 రాజ్యాంగ చట్టాన్ని కాంగ్రెస్ లీగ్‌లు రెండూ నిరసించాయి. కేంద్ర శాసనసభలను రెండూ బహిష్కరించి రాష్ట్రీయ శాసనసభలకు పోటీచేశాయి. మిశ్రమ మంత్రివర్గాలను నెలకొల్పుదామన్న దృష్టితో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ లీగ్‌తో ఒడంబడిక చేసుకోటానికి 1937 లో ప్రయత్నించాడు. కాంగ్రెస్ రాజకీయ కార్యక్రమాలతో మీ కెక్కడ అభిప్రాయ భేదాలున్నాయో తెలియజేయవలసిందని లీగ్ నాయకుడైన నవాబ్ మహమ్మద్ ఇస్మాయిల్ ఖాన్‌కు ఆయన ఉత్తరం వ్రాశాడు. సరియైన సమాధానం లేకపోయింది. పండిట్ నెహ్రూ జనాబ్ జిన్నాకు ఉత్తరం వ్రాశాడు. "అయితే మా 14 షరతులు మీరు వినివుంటారనుకొంటాను." అన్నాడు జనాబ్ జిన్నా. కమ్యూనల్ ఎవార్డువల్లను తదితరం వాటివల్లను వాటిలో చాలవరకు అమలుపరచటం జరిగిందిగదా అని పండిట్ నెహ్రూ వ్రాస్తే, "మా జాబితాను పెంచుకోగలముగదా," అని లీగ్ నాయకుడు జవాబిచ్చాడు. నిజంగా లీగ్ అలాగే చేసింది.

1938 జూన్‌లో లీగ్ తన 11 షరతులను కాంగ్రెస్‌కు తెలియజేసింది. అందులో ముఖ్యమైనవి: వందేమాతరం మానివేయటం, మహమ్మదీయులు అధిక సంఖ్యాకులుగా ఉన్న రాష్ట్రాలను యథాతథంగా ఉంచటం, భారత మహమ్మదీయులకు ప్రాతినిధ్యం వహించేది కేవలం ఒక్క ముస్లింలీగ్ మాత్రమేననీ అంగీకరించటం. మొదటి షరతులెలా ఉన్నా చివరిది మహాఘోరం. చివరి దానిని అంగీకరించటమంటే కాంగ్రెస్ కేవలం హిందూసంస్థ అని ఒప్పుకోవటమౌతుంది. సంకుచితమైన మతాలను అతిక్రమించి కేవల రాజకీయపక్షం ఉండటానికి వీలు లేకుండా చేయటమౌతుంది. మహమ్మదీయుల శ్రేయస్సును పురస్కరించుకొని చూచినా, లీగ్‌లో తప్ప మరొక సంస్థలో చేరటానికి వారికి అవకాశం లేకుండా చేయటమౌతుంది. ఈ షరతుపైనే అభిప్రాయభేదాలు బయలుదేరి సంప్రదింపులు విఫలమయ్యాయి.

1938 ఏప్రిల్‌లో ముస్లింలీగ్ మహాసభ జిన్నా అధ్యక్షతక్రింద కలకత్తాలో జరిగింది. ఉపన్యాసకులు కాంగ్రెస్ మంత్రిత్వాలు నిరంకుశంగా ఉన్నవంటూ తీవ్రంగా విమర్శించారు. మిశ్రమ మంత్రివర్గ స్థాపనకు కాంగ్రెస్ నిరాకరిస్తున్నదంటే మహమ్మదీయులను అణచివేయటానికి ప్రయత్నించటమే నన్నారు. కాంగ్రెస్ ఫాసిస్టుకొండకు డీకొనటంవల్లనే హిందూమహమ్మదీయ సామరస్యం బద్దలైపోయిందన్నారు. కేంద్రశాసనసభలో హిందువులసంఖ్య పెంపొందించుకోటానికే సంస్థాన ప్రజామండలి ఉద్యమం కాంగ్రెస్ సాగిస్తున్నదన్నారు.

1939 మార్చిలో లీగ్ వర్కింగ్ కమిటీ సమావేశమై భారతీయ మహమ్మదీయుల హక్కులను సేకరించి రక్షించటానికి సూచింపబడిన ముసాయిదారాజ్యాంగ ప్రణాళికలను పరిశీలించటానికి ఒక సంఘాన్ని నియమించింది. ఈ సంఘంచేసిన సూచనలపై సంస్కృతినిబట్టి విభజన జరగాలనీ, ఇండియాలో కాన్ఫెడరేషన్ ఏర్పడాలనీ, డాక్టర్ సయద్ అబ్దుల్ లతీఫ్, ఒక ప్రణాళికను తయారుచేశాడు. దేశవిభజన మతాలనుబట్టి జరగాలనీ, సాధ్యమైనంతవరకు ప్రజలమార్పిడితో మహమ్మదీయభాగాలలో మహమ్మదీయులే ఉండేటట్లు హిందువులభాగాలలో హిందువులేఉండేటట్లు చేయాలనీ, మార్పుజరిగేకాలంలో మహమ్మదీయులకు సంపూర్ణరక్షణలు కల్పించాలనీ, రాష్ట్రీయమంత్రివర్గాలుకే కేవలం ఒక్క అధిక సంఖ్యాకుల పార్టీతోనే ఏర్పడగూడదనీ సూచించాడు.

1939 సెప్టెంబరులో యుద్ధంప్రారంభమైంది. మహమ్మదీయుల కోర్కెలను తీర్చినతరువాత నే యుద్ధసహాయాన్నిగూర్చి లీగ్ ఆలోచించగలదని లీగ్ వర్కింగ్ కమిటీ ఢిల్లీనుంచి ప్రకటించింది. ఇండియాస్వాతంత్ర్యమే తన ఆదర్శమనీ, లీగ్ అంగీకారంలేకుండా నూతనరాజ్యాంగం బ్రిటిష్‌ప్రభుత్వం ప్రవేశపెట్టరాదనీ హెచ్చరిస్తూ లీగ్ తీర్మానించింది.

ఇంతలో కాంగ్రెస్‌మంత్రివర్గాలు రాజీనామాయిచ్చాయి. దీనితోనైనా కాంగ్రెస్‌పై లీగ్‌కున్న ప్రాతికూల్యం అంతరించవచ్చు ననుకున్నారు. కాని జనాబ్ జిన్నా దేశమంతటా 'విముక్తి దినోత్సవం' జరపవలసిందని లీగ్ సంఘాలకు ఉత్తరువు జారీచేశాడు. డిసెంబరులో 'లీగ్ భయపడవలసిన పనిలే'దని లార్డ్ లిన్‌లిత్‌గో జిన్నాకు ఉత్తరం వ్రాశాడు.

## లాహోరు తీర్మానం

ఇలాంటి పరిస్థితులలో లీగ్ 27 వ సమావేశం 1940 మార్చి 22 న ప్రారంభమైంది. తన అధ్యక్షోపన్యాసంలో రెండుజాతుల సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ జనాబ్ జిన్నా "ఇస్లాం హిందూత్వాలు శబ్దార్థతః, మతాలుకావు; విభిన్నవిస్పష్ట సాంఘికవ్యవస్థలు. హిందువులు, మహమ్మదీయులు ఒకే జాతీయతను పెంపొందించుకోగలరనటం కల్ల. ఇండియాఅంతా ఒకే జాతిఅన్నఅపోహముదిరి మన యిబ్బందులన్నింటికి చాలవరకు కారణమయింది. ఈ భావాన్ని త్వరలో సవరించుకొనక పోతే, ఇండియా కిది వినాశకారణమౌతుంది," అన్నాడు. ఇండియా అఖండత కృత్రిమమనీ, కేవలం మిలిటరీబలంతో ఈ కృత్రిమ అఖండత కాపాడబడుతున్నదనీ,

ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమనీ, జాతి అంటే ఎలాంటి నిర్వచనం చెప్పినా మహమ్మదీయులంతా ఒకజాతిఅనీ అన్నాడు.

ఈ సమావేశంలోనే సుప్రసిద్ధ లాహోరు తీర్మానం ఆమోదించటం జరిగింది. దీనితో లీగ్‌కు పాకిస్థాన్ ఆదర్శమైంది.

తరువాత క్రిప్సు రాయబారం సందర్భంలోకాని, యుద్ధానంతరం బ్రిటిష్ అమాత్యత్రయం ప్రకటించిన ప్రణాళిక విషయంలో కాని, లీగ్ ఎలా వ్యవహరించిందో విస్పష్టమే.

ఈ సింహావలోకనంతో తేలుతున్న విషయాలు: ఇండియాలో మతద్వేషాలను పెంపొందించి తన అధికారాన్ని అవిచ్ఛినంగా కొనసాగించుకోటానికి బ్రిటిష్ ప్రభుత్వం ప్రయత్నించింది. లీగ్ కూడా బ్రిటిష్ సామ్రాజ్యప్రభుత్వం ఆడించినట్లు ఆడింది. మొదటినుంచి లీగ్ కేవలం మతదృష్టితోనే ఆలోచిస్తూ వచ్చింది. దానికి సమగ్ర ప్రజాస్వామికదృష్టి ఎన్నడూలేదు. ఎప్పుడన్నా అలాంటి దృష్టి కనిపించినా కేవలం 1914కు పూర్వంఉన్న పార్లమెంటరీ ప్రజాస్వామికపు దృష్టితో ఆలోచించి దీనివల్ల మహమ్మదీయులకు అన్యాయం జరుగుతుందన్న భయంతో వెనకంజవేయటం జరిగింది. ప్రథమ ప్రపంచ యుద్ధానంతరం జరిగిన రష్యా విప్లవం, 1930 నాటి ప్రపంచ ఆర్థికమాంద్యం, జర్మనీ ఇటలీలలో విజృంభించిన ఫాసిజం, యుద్ధకాలంలో యూరపియన్ ప్రజాస్వామిక రాజ్యాలుకొట్టిన పిల్లిపిరియాలో వీరికెన్నడు స్మృతిపథాలలో మెదలునట్లైనా కనిపించదు. కాంగ్రెస్ లీగ్‌లకు జరిగిన సంప్రదింపులన్నీ యిందుకు ప్రబలనిదర్శనం.

ఏది ఎలా ఉన్నా లీగ్ తన పాకిస్థాన్ లక్ష్యాన్ని సాధించింది. ఇకమీదట పాకిస్థాన్‌లో ప్రజానీకం స్థితిగతులు చక్కబడకపోతే దానికి అటు బ్రిటిష్ ప్రభుత్వం కాని, ఇటు హిందువులు కాని కారకులు కాజాలరు. ఆ బాధ్యత అంతా అప్పుడు లీగ్‌దీ, ఆ నాయకులదీ అవుతుంది. ఇకమీదట ఇండియాలో రాజకీయాలు మతదృష్టికి పాల్పడక సరియైన త్రోవను నడవటానికి మార్గం ఏర్పడింది. దేశం చీలికలైపోయినా యీ సదవకాశం లభిస్తున్నందుకు తీవ్రవాదులు సంతోషించక తప్పదు.





మేడమ్ కామా


18 ఆగస్టు 1908 లో జర్మనీలోని స్టట్‌చార్ట్ నగరంలోజరిగిన అంతర్జాతీయ సోషలిస్టు కాన్ఫరెన్సులో మన జాతీయజండాని ప్రప్రథమంగా ప్రదర్శించిన భారతనారీమణి

# జాతీయ జెండా

పూర్వకాలంనుండీ ప్రతి సంఘానికీ, ప్రతి జాతికీ ఒక ప్రత్యేకజెండా వుండేది. ఈ సంఘం ఫలానిది, ఈ జాతిపే రిది అని చూచీ చూడడంతోనే నిర్ధారణగా స్ఫురించేందుకు ప్రత్యేక చిహ్నాలను ఉపయోగించడం ఎన్ని తరాలనుండియో వస్తోంది. పూర్వపు అనాగరిక జాతులకు కూడా ప్రత్యేక చిహ్నాలుండేవి. బట్టలునేయడం చేతకాని ఆరోజులలో రంగు రంగుల పిట్టలయీకలను తలలో గుచ్చుకోడం ఒక ఆచారంగా వుండేది. తరువాత ఆయా జాతులు ఉపయోగించే బల్లెములమీద వారి కులదైవాలను, పవిత్ర జంతువులను చెక్కించుకుని వాటినే చిహ్నంగా వాడుకునేవారు. కాలక్రమేణ బట్టలునేయడం నేర్చుకున్నప్పటి నుండి ప్రతిజాతి తమ ప్రత్యేక చిహ్నాలను పలుచటి రంగు గుడ్డమీద చిత్రించి ఒక కఱ్ఱకుగాని, స్తంభానికిగాని, త్రాడుకుగాని ఒక ప్రక్కనుకట్టి రెండోప్రక్క గాలిలో రెపరెపలాడుతూండేట్లు చేసేవారు. దీన్నే మనం జెండా అంటాము. ప్రతిజాతికి యీ జెండా అనేకవిధాలుగా ఉపయోగపడుతుంది. ఈ జెండాను అనేక విధాలైన గుర్తులివ్వడానికి ఉపయోగించవచ్చును. పండుగలకి, ఉత్సవాలకి, సుఖదుఃఖాలకి ఈజెండాను అనేక రంగాలలో అనేక రీతులుగా ఎగరవేయవచ్చును. జెండాచూడగానే జాతిచిహ్నాలు మనకు సప్పున జ్ఞాపకంరావాలి. ఇదే జెండాయొక్క ముఖ్యోపయోగం. సైన్యానికి, నౌకాబలానికి ప్రత్యేక చిహ్నంగాకూడా జెండా ఎంతో ఉపయోగపడుతుంది.




1916



1921



1931




కె.వి.రావు

ప్రతిజాతికి దాని సంస్కృతి కనుగుణ్యమైన ప్రత్యేక జెండావుంది. ఆ జెండా కెంతో పుట్టుపూర్వోత్తర ముంటుంది. ఒకానొకప్పుడు అమెరికా సంయుక్తరాష్ట్రాలు ఇంగ్లీషువారికి వలసరాష్ట్రదేశంగా వున్నాయి. అప్పుడు ఆ

Condensed from "History of the Indian National Flage" By Parasuramaiah Pingaly

దేశానికి ఇంగ్లాండుదేశపు జెండావుండేది. కాని అమెరికాకు స్వాతంత్ర్యంవచ్చిన తరువాత మరొక క్రొత్త స్వాతంత్ర్య జెండాను చిత్రించుకోవలసి వచ్చింది. ఈ విధంగానే పాశ్చాత్య శృంఖలాలనుండి భారతజాతిని విడిపించాలంటే దానికొక ప్రత్యేక జెండా వుండాలనడం నిర్వివాదాంశం. ఆ జెండా భారతీయ సంస్కృతినంతను ప్రతిఫలింపజేస్తూ, ఆసేతు హిమాచల పర్యంతం ప్రతివారిహృదయంలోనూ స్వాతంత్ర్యపిపాస, జాతీయత రేకెత్తించాలి. జెండాను చూస్తే ప్రతి భారతీయుడు చేయెత్తి కొలిచేటంతటి భక్తి, శ్రద్ధలు కలగాలి. భిన్నభాషలు, భిన్నమతాలు కొల్లలుగావున్న విశాల భారతదేశంలో సమిష్టి చేకూర్చగల జెండా కావాలి. ఖండాంతరాలలోగూడా భారతజాతి ఖ్యాతిని వేనోళ్ళచాటి విజయాన్ని కూర్పగలిగినదిగా వుండాలి జాతీయజెండా.

భారత స్వాతంత్ర్య పోరాటం ప్రథమదశలో వున్నప్పుడు మనకొక ప్రత్యేక జాతీయపతాకం లేదు. జాతీయ సమావేశాలలో కూడా పరాయిదేశపు పతాకాలను ఉపయోగించే వాళ్ళం. అప్పట్లో అంటే 1907 వ సంవత్సరంలో మునగాల యెస్టేటు వ్యవసాయశాఖకు అజమాయిషీ దారుగా వుంటూన్న శ్రీ పింగళి వెంకయ్య పంతులుగారు యీ అసభ్యపు పరిస్థితులను సహించలేక, మాతృదేశానికొక ప్రత్యేకపతాకం చిత్రించాలని పూనుకున్నారు. భారతరాజకీయ నాయకులకెవ్వరికీ యీ అభిప్రాయం కలుగకముందే శ్రీ పంతులుగారి నీ సమస్య వేధించడం మొదలు పెట్టింది. చిన్నప్పటినుండీ శ్రీ పంతులుగారికి జెండాలంటే అపరిమితమైన ఉత్సాహం. ప్రతిదేశపు జెండాను ప్రత్యేకంగా పరిశీలించి, దాని చరిత్ర తెలిసికొని, జెండాలయొక్క విలువను జీర్ణింపజేసికొన్నారు. 1909 వ సంవత్సరం నవంబరు "మోడరన్ రెవ్యూ"లో ప్రచురితమయిన ఒక వ్యాసంలో "వజ్రాయుధం" మన జాతీయజెండాలో చిహ్నంగావుంటే బాగుంటుందనే పురమాయింపు పంతులుగారికి నచ్చలేదు. భారతదేశంలో అందరూ హిందువులైతేనే వజ్రాయుధచిహ్నం జెండాలో పనికివస్తుందనీ, కాని మన దేశంలో హిందువులు, మహమ్మదీయులు, బౌద్ధమతస్థులు, కిరస్తానులు, సిక్కులు, జైనులు, పార్శీలు, జ్యూలు అను భిన్నమతావలంబకు లుండబట్టి ఆ చిహ్నం అందరి ఆదరాన్ని పొందజాలదనీ, అన్ని మతాలవారికి ప్రేమపాత్రంగా వుండే ఒక ఏకైక జాతీయ జెండా అత్యవసరమని పంతులుగారు చెప్పారు. ఆనాటినుండి జాతీయజెండా ఎట్లాంటిదై వుండాలనే సమస్యనే తమ అభిమాన విషయంగా పెట్టుకుని ఎంతో శ్రమకోర్చి సర్వమతాలకు సమిష్టిగా వుండే జాతీయపతాకాన్ని సృష్టించగలిగారు. మనదేశంలోని పై మతాలవారు భిన్నరంగులకు ప్రాముఖ్యాన్నిస్తారన్న విషయాన్ని పూతగాగొని శ్రీ వెంకయ్య పంతులుగారు జాతీయ జెండాను చిత్రించారు. పసుపు పచ్చ రంగు, శంఖచక్రాలు హిందువులకు, ఎఱ్ఱరంగు, చంద్రవంక మార్కు మహమ్మదీయులకు, నారింజరంగు బౌద్ధమతస్థులకు, నీలిరంగు, శిలువమార్కు కిరస్తానులకు, అకుపచ్చ రంగు శిక్కులకు, తెల్లరంగు జైనులకు, గులాబీరంగు, సూర్యుడు పార్శీలకు, అకాశపు రంగు జ్యూలకు ప్రియతమమైనవి. భారతదేశంలోని ఆయామతాల జనాభానుబట్టి జాతీయజెండాలో వారికి ప్రియతమమైన రంగులను, చిహ్నాలనువేస్తే అందరూ దాన్ని గౌరవిస్తారని శ్రీ పంతులుగారి అభిప్రాయం. మతాలతోబాటు, మన దేశంలో అనేక భాషలున్నాయి. భాషా ప్రయుక్తరాష్ట్రాలు కూడా చాలా వున్నాయి. కాబట్టి భాషాప్రయుక్త రాష్ట్రాలకు కూడా జాతీయ పతాకంలో కొన్ని చిహ్నాలిస్తే బాగుండునని పంతులుగారి అభిప్రాయం. తమ బుఱ్ఱలోపుట్టిన యీ అభిప్రాయాలకు సుస్పష్టరూపాలను దిద్దేందుకు 1913 నుండి ప్రతి జాతీయమహాసభకు హాజరయి నాయకులందరితోనూ జాతీయపతాక ప్రతిష్ఠాపననుగురించి చర్చలు సాగించారు

1913 నుండి ప్రతిజాతీయ మహాసభ సమావేశంలో జాతీయపతాక తీర్మానాన్ని పెట్టి యావద్భారతదేశానికి యీ సమస్యయొక్క ప్రాముఖ్యతను వెల్లడించారు. 1914 వ సంవత్సరంతో యీ ముఖ్యవిషయాన్ని కీర్తికాయులైన బ్రజేంద్రనాథ్ సేన్, రవీంద్రనాథ్ టాగూరు, సర్ జె. సి. బోస్, సర్ పి. సి. రే, సర్ అశుతోష్ ముఖర్జీ మొదలగు మేధావులతో ఎంతో విపులంగా చర్చించి 1916 వ సంవత్సరంలో "భారతదేశానికొక జాతీయపతాకం" అనే అమూల్య ఆంగ్ల గ్రంథాన్ని వ్రాసి ప్రచురించారు. ఈ గ్రంథప్రచురణయే మన జాతీయపతాక ప్రతిష్ఠాపనకు ప్రాతిపదిక అని చెప్పినచో అతిశయోక్తికాదు. అప్పటికి మహాత్మాగాంధీగారు యింకా భారతరాజకీయాల్లో విరివిగా కల్పించుకోనేలేదు. ఏకైక జాతీయచిహ్నమగు జండా వుండాలని ఏ యితర భారతీయనాయకునికి తట్టనేలేదు. కాని శ్రీ పంతులుగారి సూక్ష్మబుద్ధికి యిట్టే స్ఫురించింది. ఒక మంచి ఆలోచన ఆయన బుఱ్ఱలోకి వచ్చింది. అంటే అది వెంటనే కార్యరూపంలో పెట్టేవరకు నిద్రపట్టనంతటి దీక్షాపరులాయన. ఈ దీక్షాఫలితమే వారు 1916 లో ప్రచురించిన "భారతజాతీయ పతాక"మను ఆంగ్ల గ్రంథము. ఈ గ్రంథానికి అప్పట్లో వైస్రాయి కార్యనిర్వాహకవర్గ సభలో సభ్యుడుగానున్న ఏకైక ఆంధ్రులగు సర్ బయ్యా నరశింహేశ్వరశర్మగారు ఉత్తేజితమైన తొలిపలుకువ్రాసి గ్రంథప్రాశస్త్యమును కొనియాడారు. గ్రంథకర్తకు ఆశీస్సులు యిచ్చారు. హోమ్ రూల్ ఉద్యమం యింకా పుట్టక ముందే శ్రీ వెంకయ్యపంతులుగారు బందరు జాతీయకళాశాల అధ్యాపకుడుగ ఉండగ వ్రాసిన యీ ఉత్తమగ్రంథమే నేటి త్రివర్ణ జాతీయపతాక ప్రతిష్ఠాపనకు దారితీసింది. ఈ గ్రంథంలో 30 తరహాల జాతీయపతాకాలను వారు పురమాయిస్తూ, మన దేశంలోని వివిధ మతాల ఆశయాలు, చిహ్నాలు ఆ సమిష్టి జాతీయపతాకంలో ప్రతిబించించేటట్లు ప్రయత్నించారు. ఈ గ్రంథంలోని 30 నమూనా పతాకాలను రంగులలో అచ్చువేసేందుకు, గ్రంథం అచ్చొత్తించడానికి సర్ సి. పి. రామస్వామిఅయ్యర్, కీర్తికాయులైన సర్ యస్. సుబ్రహ్మణ్య అయ్యరు (హైకోర్టు జడ్జి) మొదలగు అనేకమంది పెద్దలు భూరి విరాళాలిచ్చారు.

1917 వ సంవత్సరంలో శ్రీమతి అనీబిసెంటమ్మ ఆధిపత్యంక్రింద భారతజాతీయ మహాసభ సమావేశమయినప్పుడు హోమ్ రూల్ ఉద్యమం లేవదీయబడింది. ఈ ఉద్యమస్థాపకుల యాజమాన్యంక్రింద ఒక జాతీయపతాక సంఘాన్ని పంతులుగారి ప్రోద్బలంవల్లనే స్థాపించారు. సంఘం స్థాపించడంతోనే వారు సంతృప్తిపడక, భారతజాతీయ పతాక ప్రచారక సంఘాన్ని ప్రతిష్ఠాపించి జాతీయపతాక ఆవశ్యకతను ప్రజలకు నచ్చచెప్పారు. ఈ ప్రచార సంఘానికి శాఖోపశాఖలు సువిశాల భారతదేశమంతటా స్థాపించేటట్లు చేశారు శ్రీ పంతులుగారు. జాతీయపతాక అవశ్యకతనుగురించి, ఉత్కృష్టతనుగురించి ఈ సంఘం క్రిందివిషయాలను ప్రచారంచేసింది :—

(1) జాతీయపతాకం యావద్భారతజాతికి ఏకైక దైవంగాను, లక్ష్యంగాను ఉపయోగిస్తుంది.

(2) జాతీయతత్వాన్ని, ఆశయాలను తనలో ప్రతిఫలింపచేస్తూ, జాతియైక్యతకు ఎంతగానో తోడ్పడుతుంది, పతాకం.

(3) ప్రతి భారతపౌరునకు మాతృదేశపు చిహ్నాలను చూపుతూ జాతీయతను వెంపొందింపజేస్తుంది.

(4) స్వాతంత్ర్య సమరరంగంలో పిరికిపందలై పారిపోజూచే భారతీయులకు జాతీయ పతాకం రెండింతలు శక్తినీ, ధైర్యాన్ని యీయగల ఆవేశం రేకెత్తించగలదు.

(5) మన జాతీయపతాకంయొక్క ప్రతిష్ఠను నిలబెట్టుకోవాలనే దీక్ష యావద్భారతజాతికి కల్పిస్తుంది.

(6) అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఏకైకజాతీయపతాకం ఏవిధంగా భిన్నమతాలను, వివిధభాషలను యైక్యతపొందింపజేస్తోందో, అదేవిధంగా మనదేశంలోకూడా జాతీయైక్యతకు తోడ్పడుతుంది.

(7) మనజాతి పూర్వపుటౌన్నత్యాన్ని పదే పదే స్ఫురింపజేస్తూ, పునర్జీవింపజేస్తూ ఎప్పటి కప్పుడు జాతీయఉత్సాహాన్ని ద్విగుణీకృతం చేయగలుగుతుంది పతాకం.

(8) జాతినంతను త్యాగమూర్తులుగ చేయగల్గ మహత్తరశక్తి పతాకంలో వుంది.

ఈవిధంగా శ్రీ వెంకయ్య పంతులుగారు మొదలుపెట్టిన అలజడికి ఎంతోమంది మేధావులు, దేశభక్తులు దోహదమిచ్చి, కొన్నిమార్పులనుకూడా సూచించారు. 1919 లో పంజాబు కంతకు వయోవృద్ధుడైన జలంధర్ నివాసియగు లాలాహన్సరాజ్ మన జాతీయపతాకముపైన రాట్నచిహ్నముంటే బాగుండునని పురమాయించారు. అహింసా పద్ధతులమీద మనం స్వాతంత్ర్యపోరాటం సాగిస్తున్నాం కాబట్టి. జండామీదకూడా ఆ తత్వాన్ని జ్ఞాపకపరచే రాట్నమే వుంచాలని హన్సరాజ్‌గారు చెప్పారు. అప్పటికే భారతజాతినంతను తన సత్యాగ్రహ సమ్మోహనాస్త్రంతో కట్టివేయగలిగిన మహాత్మా గాంధీగారుగూడా రాట్నచిహ్నమెంతో అనుగుణ్యంగావుందని అభినందించారు. కాయకష్టాన్ని, సౌభ్రాతృత్వాన్ని సూచించే రాట్నచిహ్నం జాతీయపతాకంమీద చూడగానే మన స్వాతంత్ర్య పోరాటం ఏపంథాలో నడపాలో హెచ్చరిస్తూంటాయి. అందుకే మన జండామీద, పులినిగాని, సింహాన్నిగాని, మరేవిధమైన భీకరమైన జంతువునుగాని చిహ్నంగా వుంచలేదు.

1916 వ సంవత్సరమందు లక్నోలో జరిగిన జాతీయమహాసభ సమావేశానికి ప్రప్రథమంగా జాతీయపతాకాన్ని హోమ్ రూల్ ఉద్యమ పతాక సంఘంవారు ఎగురవేశారని డాక్టరు అనీబిసెంటమ్మ సంపాదకత్వంక్రింద నిర్వహింపబడిన "న్యూఇండియా" అనే పత్రికలో 1917 వ సంవత్సరంలో జనవరి 1 వ తేదీన ప్రచురింపబడింది. 1921 వ సంవత్సరంలో అఖిలభారత జాతీయమహాసభ బెజవాడలో సమావేశమయ్యేవరకు హోమ్‌రూల్ ఉద్యమ పతాకమే జాతీయ సభలలో ఉపయోగిస్తూండేవారు. జాతీయపతాకం విషయంలో శ్రీ పింగళి వెంకయ్య పంతులుగారికి కూలంకష జ్ఞానం, అనుభవం వున్నదన్న విశ్వాసంవల్ల మహాత్మాగాంధీగారు వారిని ప్రత్యేకంగా ఆ సమావేశానికి పిలిపించి నిరాడంబరమైన త్రివర్ణపతాకాన్ని చిత్రించమని కోరారు. గాంధీజీకోరిన ప్రకారం ఎఱుపు, తెలుపు ఆకుపచ్చ రంగులు గలిగి మధ్యను రాట్నం చిహ్నంగాగల జాతీయజండాను శ్రీ పంతులుగారు సమకూర్చి గాంధీజీని సంతోషపరిచారు. ఈ త్రివర్ణపతాకమే నాటికి నేటికి మన జాతీయ సంస్థలలో ఎగురుతోంది. 1921 వ సంవత్సరం ఏప్రిల్ 13 వతేదీగల "యంగ్‌యిండియా" పత్రికలో గాంధీజీ జాతీయ జెండాను గురించి యీక్రిందివిధంగా వ్రాశారు :—

"ఏకైక జాతీయపతాకం కోసం తమ సర్వస్వం త్యాగంచేయడానికి సంసిద్ధులై ఉండాలన్న విషయాన్ని మనం విస్మరించకుండా వుండడం ఎంతో అవసరం. ఇతర జాతులకుండే

పతాకాల ఉద్దేశాలను, ఆశయాలను వర్ణిస్తూ, భారతదేశానికి 30 రకాల జండాలను పురమూయిస్తూ శ్రీ పింగళి వెంకయ్యపంతులుగారు అమూల్యమైన పుస్తకాన్ని భారతప్రజలకందజేశారు. వీరు బందరు జాతీయ కళాశాలలో వుంటూ కొన్ని సంవత్సరాలనుండి జాతీయపతాక ఆవశ్యకతనుగురించి ఎంతో ఉత్సాహంతోనూ, పట్టుదలతోనూ, పనిచేస్తున్నారు........

"గత నాలుగు సంవత్సరాలనుండి శ్రీ పంతులుగారు ప్రతి జాతీయమహాసభ సమావేశానికి హాజరయి, పతాకసమస్యను అత్యంతోత్సాహంతో చర్చించి దాని ప్రాముఖ్యతను నచ్చ చెప్పారు.

"1921 లో బెజవాడయందు జరిగిన జాతీయ మహాజనసభకు శ్రీ వెంకయ్యపంతులుగారిని నేను స్వయంగా పిలిపించి ఎరుపు, ఆకుపచ్చ, తెలుపురంగులుగలిగి మధ్యరాట్నము చిహ్నముగాగల నిరాడంబరమైన జండా ఒకటి చిత్రించి యివ్వమని అడిగాను. వారి అకుంఠిత ఉత్సాహఫలితమే నేడు మనకున్న త్రివర్ణపతాకము".

మహాత్మా గాంధీగారు 1921 లో వ్రాసిన పైవాక్యాలవల్ల త్రివర్ణపతాకం పుట్టింది ఆంధ్రదేశంలోనేనని, మనజాతికొక పతాకం కావాలన్న ఊహ ప్రప్రథమంగా ఆంధ్రపుత్రుని బుద్ధిలోనే పుట్టిందని చెప్పడాని కెంతో సంతోషిస్తున్నాను.

ఈవిధంగా జననమందిన త్రివర్ణపతాకం అనతికాలంలోనే ప్రజలలో చైతన్యంగలిగించింది. గాంధీజీ నాయకత్వాన ఎక్కడచూచినా జాతీయపతాకం ఆకాశవీధులలో ఎగరడం ప్రారంభించింది. పామరప్రజలకు జాతీయపతాకంపట్ల భక్తి శ్రద్ధలుకలిగేందుకు, వారిలో చైతన్యం కలిగేందుకు ప్రతియేడాది జండా ఉత్సవాలు దేశమంతటా చేయడం ప్రారంభించారు. "హిందువులయెడ నెఱ్ఱనై, ఇస్లామునందున పచ్చనై, తదితరులందున ధవళమై వెలుగొందె జండా" అని ప్రతి మతంవారిలోనూ పతాకమంటే గౌరవభావాలను పుట్టించగలిగారు. ఎల్లెడల గలుగుతూన్న యీ జాగృతిచూచి, పశుత్వమే తమ పరమాశయంగా పెట్టుకున్న పరాయి ప్రభుత్వం కన్నెఱ్ఱచేసింది. అభం శుభం తెలియని భారతప్రజను అనేకవిధాల హింసించ మొదలిడింది. తత్ఫలితమే మొట్టమొదట్లో నాగపూరులో జరిగిన జండా సత్యాగ్రహం. 1923 వ సంవత్సరం మే 1 వతారీఖున జాతీయ జండాలతో ఒక ఊరేగింపు నాగపూరు వీధుల్లో పోతూంటే, 144 వ సెక్షనుక్రింద ఊరేగింపును ఆపేసింది ప్రభుత్వం. కాని వలంటీర్లు వినకుండా ముందుకు సాగారు. వారిని అరెస్టుజేసి ఖైదువేశారు. ఈ సందర్భంలో అరెస్టుకాబడిన మొట్టమొదటి స్త్రీ వలంటీరు సుభద్రాదేవి. ఆమె వీరోచితకృత్యమే దేశం కళ్ళుతెరిపించింది. జండా ప్రభావాన్ని కోటిసూర్య ప్రభలలో విరాజిల్లచేసింది. భారతప్రజలలో చాలమందికి నాగపూరు జండా సత్యాగ్రహంయొక్క అంతరార్థం ప్రాముఖ్యత బోధపడకపోయినా, ప్రభుత్వంమాత్రం చాలా కలవరపడింది. ప్రజలో చైతన్యంకలిగి తమ నిరంకుశ ప్రభుత్వానికి అంతరాయం కలుగుతుందనే సంశయం పొడసూపింది. అంతేగాక భారతదేశంలోని అన్నిమతాలకీ యేకైక జాతీయ జండా యేర్పడటం ప్రభుత్వానికి గిట్టలేదు. మొదటినుండీ బ్రిటిషుప్రభుత్వం "విడదీసి పాలించు" అనే సూత్రంమీద అధికారం చెలాయిస్తూండడం జగద్విదితమే. హిందువులు ఎఱ్ఱ జండాను, మహమ్మదీయులు ఆకుపచ్చ జండాను, తదితర మతాలు తెల్ల జెండాను

ప్రత్యేకంగా ఉపయోగిస్తే పాపం బ్రిటిషువారికి కోపంవచ్చేదికాదు. అందరికీ పనికివచ్చే, అందరి ఆదరాభిమానాలను చూరగొనే జాతీయ జండా లభించడం బ్రిటిషు సామ్రాజ్యానికే గొడ్డలిపెట్టని ప్రభుత్వం గ్రహించబట్టే, మొగ్గలోనే త్రుంచేద్దామనే ఆశతో నాగపూరు సత్యాగ్రహ సందర్భంలో అంతక్రూరంగా ప్రవర్తించింది. ఈ నాగపూరు జండా సత్యాగ్రహం అసాంతం కొనసాగించమని అఖిలభారత జాతీయ మహాసభవారుకూడా "నాగపూరు జండా సత్యాగ్రహ సంఘంవారికి కావలసినసలహా, సహాయంకూడా చేశారు. ఆనాటినుండి ప్రతి నెల 18 వ తారీఖు (యిదివరకు గాంధీరోజు అని చేసేందుకుబదులు) జండారోజుగా ఉత్సవాలు జరుపవలసిందని జాతీయమహాసభ అనుజ్ఞయిచ్చింది. ఈ నాగపూరు జండా సందర్భంలోనే సేట్ జమ్నాలాల్ బజాజ్ అరెస్టు అయ్యాడు. దానితో మరింత సంచలనం కలిగింది. జాతీయ మహాసభ యీ విషయంపట్ల మరింత శ్రద్ధవహించింది. జమ్నాలాల్ మీద వేసిన 3000 రూపాల జరిమానా ఆయన యివ్వనందున, ఆయన కారు నాగపూరులో వేలం వేశారు. కాని ఒక్కపిట్ట పాడలేదు. లాభంలేక ప్రభుత్వం ఆకారును కథియవార్‌కు తీసికెళ్ళారు. కథియవార్‌కు తీసికెళ్ళడంలో ఒక అంతరార్థంవుంది. కథియవార్‌లో అనేక బుల్లి బుల్లి స్వదేశసంస్థానాలున్నాయి. వారు బ్రిటిషు ప్రభుత్వానికి తాబేదారులయి, గులాములయి వారి చెప్పుచేతలలో మెలుగుతూంటారు. బ్రిటిషు భారతంలో అమ్ముడుబోని సరుకంతా ప్రభుత్వం యీ సంస్థానాధీశ్వరులమీద రుద్దడం మామూలు. బ్రిటిషుప్రభుత్వం అడగడం తడవుగా శిరసావహించడం యీ సంస్థానాధీశ్వరుల విధి. ఈ కారణాలవల్ల జమ్నాలాల్ బజాజ్‌కారు కథియవార్‌కు వెళ్ళింది. జాతీయమహాసభ ఆజ్ఞానుసారంగా ప్రతిరాష్ట్రంనుండి వలంటీరులు నాగపూరు జండా సత్యాగ్రహాన్ని బలపరచడానికి కొల్లలుగా వచ్చారు. వారుపడిన బాధలు వర్ణనాతీతము. 1923 వ సంవత్సరం జూలై 10 వ తేదీనాటికి ఈ జండా సత్యాగ్రహ సమస్య అఖిలభారత ఉద్యమంగామారి, శ్రీయుత్ వల్లభాయి జె. పటేల్‌గారిని సత్యాగ్రహ నాయకులుగా జాతీయమహాసభ నియమించింది. భారతదేశంలోని వివిధప్రాంతాలనుండి వలంటీర్లు పంపబడ్డారు. కొన్ని జాతీయసంస్థలు డబ్బుకోసం ప్రజలను ప్రబోధంజేశాయి. 1923 ఆగస్టులో విశాఖపట్టణంలో సమావేశమైన అఖిలభారత జాతీయ కార్యనిర్వాహక సభవారు పటేల్‌భాయీలు నాగపూరు సత్యాగ్రహోద్యమాన్ని ఎంతో నిపుణతతో నడపడాన్ని అభినందిస్తూ, అది అసాంతమయ్యేవరకు వారినే నాయకులుగా నియమించారు. "పటేల్ భాయీల నిరంతరకృషిఫలితంగానే నాగపూర్ సత్యాగ్రహం విజయవంతమయిందని చెప్పాలి" అని డాక్టరు పట్టాభి సీతారామయ్యగారు వ్రాసిన అఖిలభారత జాతీయ మహాసభ చరిత్రలో ఉద్ఘాటించారు. ఈ నాగపూర్ జండా సత్యాగ్రహం దేశానికెంతో గొప్పగా తోడ్పడింది. ఈ సత్యాగ్రహంతో పతాకప్రభావం భారతదేశపు మారుమూలలకు ప్రాకింది. నాగపూర్ జండా సత్యాగ్రహంలో సర్వకష్టాలకోర్చి, అనేక అవమానాలకు గురియయి పతాకప్రతిష్ఠను మన వలంటీర్లు నిలబెట్టడంతో జండాకొక పవిత్రత, సార్వజనీనత ప్రాప్తించింది. అంతవరకు త్రివర్ణపతాకాన్ని జాతీయపతాకంగా ఉపయోగించటానికి విముఖత్వం చూపినవారుగూడా దాని మహాత్మ్యంముందు లొంగిపోయారు.

ఈ విధంగా త్రివర్ణ పతాక ఉత్కృష్టతను ఎప్పటికప్పుడు ప్రజలలో ఉద్బోధిస్తూ, దాని యెడల ప్రజాసామాన్యానికి గౌరవప్రపత్తులు కలిగేటట్లు ప్రచారం జరిగింది. అయినప్పటికి మనదేశంలో అనేక మతాలున్నాయని మనం విస్మరింపరాదు. అన్ని మతాలకు జండాలో చోటు వున్నదాలేదా అన్న విషయం కొన్ని మతాలవారిని వేధిస్తూండేది. మరీ సిక్కులదే గొప్ప పేచీవచ్చిపడింది. వారికుండే సైనిక ప్రాముఖ్యతవల్ల జాతీయజెండాలో వారికి ప్రియతమ మగు వన్నెరంగు యిమిడ్చి తీరాలని అనేక సిక్కు సంస్థలు అలజడి చేసినవి. 1930 వ సంవత్సరమందు లాహోరులో పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ ఆధిపత్యంక్రింద జరిగిన అఖిల భారతజాతీయ మహాసభ సమావేశంలో సిక్కు సంస్థలు త్రివర్ణ పతాకమునెడల తమ అసంతృప్తిని తెలిపారు. జవహర్ వాటినన్నిటిని శాంతంగా విన్నాడు. కాని 1930 లో గొప్ప సత్యాగ్రహోద్యమం లేవదీయబడడంవల్ల యీ పతాక సమస్యకంత ప్రాముఖ్యత అప్పట్లో యివ్వడానికి వీల్లేదని, స్వాతంత్ర్యపోరాటం క్లిష్టదశలో నున్నప్పుడు సౌభ్రాతృత్వం అవసర మని జవహర్ సిక్కులను శాంతింపజేశాడు. 1930 లో జరిగిన సత్యాగ్రహోద్యమం, మార్చి 1931 లో అయిన గాంధీ—ఇర్విన్ ఒడంబడికతో ముగిసింది. దానితో 1931 లో కరాచీలో జరిగిన అఖిలభారత జాతీయమహాసభ సమావేశంలో మళ్ళీ సిక్కులు పతాకపు రంగులనుగురించి ఆందోళన సాగించారు. సిక్కు నాయకుల కోరికలను కూలంకషంగా చర్చించి నిర్ణయాలకు దిగడంకోసం అఖిలభారతజాతీయ మహాసభవారు ఒక ఉపసంఘాన్ని నియమించారు. ఈ ఉప సంఘం కావలసిన ప్రమాణాలన్నిటినీ పరిశీలించి జూలై 1931 లో తమ నివేదికను జాతీయమహాసభ కందజేశారు. ఈ సంఘంచేసిన సిఫార్సుల ననుసరించి జాతీయజండాకు కుంకుమపువ్వు రంగు, ఆకుపచ్చ రంగు, తెలుపురంగు ఉండాలని, రాట్నమే చిహ్నంగా వుండాలని అఖిలభారత జాతీయమహాసభ నిర్ణయించింది. ఈ రంగులకు ఆదివరకుదాకావుండే మతసంబంధమైన అంతరార్థాలకు బదులు సత్యము, శౌర్యము, శాంతము అనే మానసిక గుణాల పరంగా పతాకోత్కృష్టతను ప్రజలకు నచ్చజెప్పాలని, రంగులు మతాలను తెలుపు తున్నాయని చెప్పడంవల్ల మనదేశంలో ఉండే వివిధమతాలను ఐక్యపరచే బదులు యింకా విడదీసినవాళ్ళమవుతామని కూడా అఖిలభారత జాతీయమహాసభవారు ప్రబోధించారు. కుంకుమ పువ్వురంగు శౌర్యాన్ని, త్యాగశీలాన్ని ప్రతిబింబింప జేస్తుందని, ఆకుపచ్చరంగు అకుంఠిత శక్తి విశ్వాసాలను, ధీరత్వాన్ని చాటుతుందని, తెల్లరంగు మన స్వాతంత్ర్య పోరాటానికి ప్రాతిపదికలైన సత్యం, అహింసలకు ప్రత్యక్ష నిదర్శన అని వివరింపబడింది. ఈ రంగులపైన గిఱ్ఱునతిరిగే రాట్నము గ్రామజీవనాన్ని, రైతు, కార్మికత్వాన్ని స్ఫురింపజేస్తూంటుంది. అంటే కార్మిక, కర్షకులపై అధారపడిన మనదేశము, సత్యము, అహింసలపై ఆధారపడిన త్యాగము వలన సుభిక్షముగా నుండవలెనని మన ఆశయము. ఈ ఆశయచిహ్నమే మన త్రివర్ణ పతాకము. నేడు భారతరాజ్యాంగపరిషత్తు రాట్నమును తీసివేసి దానిస్థానే అశోకుని ధర్మచక్ర మును నిర్ణయించింది. దీనిలో రాట్నచిహ్నమైన చక్రం ఉన్నందుకు గాంధిమహాత్ముడుకూడా దీనిని ఆమోదించాడు. అంతేకాదు ముస్లింలీగుకూడా దీనిని ఆమోదించింది.



# అరవిందుని సందేశము

ఆగస్టు 15 భారతస్వాతంత్ర్య జన్మదినం. ఇక్కడనుండి భారతదేశానికి నవయుగారంభం. ఇది మనదేశానికేగాక ఆసియాకూ, ప్రపంచానికీకూడా ప్రాముఖ్యమైనరోజు; నేటినుండి స్వతంత్రరాజ్యాలకూటమిలో మన దేశంకూడా చేరి మానవజాతియొక్క భావిరాజకీయ, సాంఘిక, సాంస్కారిక. అధ్యాత్మిక జీవితనిర్మాణంలో ప్రముఖపాత్ర నిర్వహిస్తుంది. ఇది నా జన్మదినంకూడా గనక, నాకూ, నా సందేశాన్ని స్వీకరించినవారికీ మాత్రమే। ప్రాముఖ్యం కలిగిఉంటూ వచ్చిన ఈ తేదీకి ఈ ప్రత్యేకత ఏర్పడటంగురించి నేను సహజంగా సంతోషించక తప్పదు. ఇది కాకతాళీయమని నేను భావించను; నన్ను సదా నడిపించే భగవంతుని నిర్ణయమని విశ్వసిస్తాను. నేను జీవించిఉండగా ఫలితానికి రావాలని నేను కోరిన ప్రపంచ ఉద్యమాలన్నీ ఈనాడు రకరకాల పరిణామదశలలో ప్రత్యక్షంగా ఉన్నాయి.

ఈ శుభదినాన నన్ను సందేశం ఇవ్వమన్నారు. కాని సందేశం ఇచ్చేస్థితిలో నేను లేను. నేను చేయగలిగినదల్లా నా బాల్యంలోనూ, కౌమారంలోనూ నన్ను వెంటాడి ఈనాడు ఫలోన్ముఖానికి వస్తున్న నా ఆశయాలు ప్రకటించటమే. ఈ ఆశయాలకు భారతస్వాతంత్ర్యంతో సన్నిహిత సంబంధంఉంది; ఎందుచేతనంటే భావిభారతం వాటిని కొనసాగించటంలో ప్రధానపాత్ర వహిస్తుందని నా నమ్మకం. విస్తృతీ, ఘనతా, శక్తీ, సంపదా భారతదేశానికి అవసరమే అయినప్పటికీ, భారతదేశం ఆశిస్తున్నది కేవలమూ వీటికొరకే కాదనీ, ఇతర దేశాలమాదిరిగా పరపీడనకు అసలే కాదనీ, భగవంతునీ, ప్రపంచాన్నీ సేవించి మానవజాతికి సహాయకారిగానూ మార్గదర్శిగానూ ఉండటంకోసమే ననీ నేను ఎల్లప్పుడూ నమ్మాను, చెప్పానుకూడానూ. ఆ ఆశయాలూ, ఆదర్శాలూ ఈ క్రిందివిధంగా ఆ దేక్రమంలో ఉన్నాయి: భారతస్వాతంత్ర్య, ఐక్యతలకొరకు విప్లవం; ఆసియాయొక్క విముక్తి పునరుజ్జీవనాలూ, విశ్వకల్యాణకార్యక్రమంలో ఆసియాకు ఎప్పటి ఉన్నతస్థానమూ; వివిధదేశాల ప్రజాజీవితాల సమగ్రజాతీయ పరిణామంతోపాటు అంతర్జాతీయ

ప్రజాజీవిత సమైక్యతా, తద్వారా మానవజాతికి నూతన వికాసంతో కూడిన ఉన్నతజీవనమూ; భారతీయ అధ్యాత్మిక పరిజ్ఞాన ఫలితంగా విశ్వమానవజీవితంలో ఆధ్యాత్మికపరివర్తన; చివరకు పరిణామంద్వారా మానవబుద్ధి మరొకస్థాయికి పెరిగి, మానవుడు ఆలోచించటం ప్రారంభించి ఆత్మపరిణామంకొరకూ ఆదర్శ సంఘస్థాపనకూ ఆవేదనపడుతూన్న నాటినుంచి మానవుని పీడించిన విషమ సమస్యలు పరిష్కారం కావటమూనూ.

భారతదేశం స్వాతంత్ర్యం సంపాదించి, ఐక్యత లేనందువల్ల ఇది ఓటి స్వాతంత్ర్యం. ఒక సమయంలో భారతదేశం బ్రిటిషువారి రాకను పూర్వం ఉండిన అయోమయ విభక్తస్థితిలో తిరిగిపడుతుందనే భయం కలగకపోలేదు. కాని నేడు అటువంటి ప్రమాదం దూరమయింది. రాజ్యాంగసభ సాహసంతో వివేకవంతమైన వైఖరి అవలంబించటంవల్ల నిమ్న జాతుల సమస్య తగవులు లేకుండా పరిష్కారమయే అవకాశాలేర్పడ్డాయి. కాని హిందూ ముస్లిము విభేదం మటుకు శాశ్వతంగా రాజ్యాంగ స్వరూపం పొందినట్లు కనిపిస్తుంది. దీనిని కాంగ్రెసువారుగాని ప్రజలుగాని శాశ్వత ఏర్పాటుగా కాక తాత్కాలికమైనదిగానే భావిస్తారని నమ్ముతున్నాను. ఎందుకంటే ఈ ఏర్పాటు శాశ్వతమైతే భారతదేశం బలహీనమై పోతుంది: భాతృసంఘర్షణ జరగవచ్చుని, మరొక పర పీడకూడా సంప్రాప్తించవచ్చు. ఇరుపక్షాలమధ్య ఆందోళనతగ్గి, సామరస్యం ఏర్పడి, పరస్పర సహకారం హెచ్చి విభజనతొలగి పోవాలి. ఈ విధంగా ఐక్యత తిరిగిరావాలి.

ఆసియా మేల్కొన్నది. అందులో కొన్ని ప్రాంతాలు విముక్తమయాయి. ఇతర ప్రాంతాలు విముక్తికోసం పెనగులాడు తున్నాయి. కొద్దిగానే ఈపని బాకీపడిఉంది. నేడో రేపో పూర్తి అవుతుంది. ఇక్కడ భారతదేశం ప్రముఖ పాత్ర నిర్వహించవలసి ఉంది. ఈ నిర్వహణ అప్పుడే ఉత్సాహవంతంగానూ సమర్థతాయుతంగానూ ప్రారంభమై భావిప్రపంచసమాఖ్యలో భారతదేశ గౌరవం సూచితమవుతోంది.


విస్పష్టమైన పునాది ఏర్పడలేదేగాని మానవజాతి యొక్క ఏకీకరణ ఆరంభ మయింది. కాని గొప్ప ప్రతిబంధకాలున్నాయి. కాని చరిత్ర నిదర్శనమైతే ఈ మహాప్రయత్నం విజయవంతం కాకతప్పదు. ఈ విషయంలోకూడా భారతదేశం


ఉచితపాత్ర నిర్వహించ నారంభించింది. ఇదే విధంగా విశాలమైన రాజనీతితో దూరదృష్టితో, క్షణభంగుర విషయాలనుండి శాశ్వత విషయాలమీదికి దృష్టి సారించి వ్యవహరించినట్టయితే భారతదేశం ఈ పరిణామం శీఘ్రగమనం పొందవచ్చును. ప్రమాదవశాత్తూ నేటి పరిణామ ఉద్యమానికి ఘాతకలిగి నప్పటికీ ఏనాటికైనా మానవ ఐక్యత కలిగితీరక తప్పదు. అది ప్రకృతినిర్దేశం. దీనివల్ల వివిధదేశాలకుకూడా ఎంతో అవసరం ఉంది, ఎందుకంటే ఈ ఐక్యత రానట్టయితే చిన్న దేశాలకు హానితథ్యం, పెద్ద దేశాలక్షేమానికికూడా పూచీలేదు. విభజన భారతదేశానికే ముప్పం. కనుక భారతసమైక్యత అందరికీ వాంఛనీయం. దానికి అంతరాయంగా ఉన్నవి స్వార్థమూ, మౌఢ్యమూ మాత్రమే. వీటికి చికిత్స లేదని చెబుతారు. కాని ప్రకృతి అవసరాలకూ, భగవదాదేశానికీ అంతరాయంగా ఇవి నిలబడజాలవు. అప్పటికి జాతీయత తనపని నెరవేర్చుకున్న దవుతుంది; అంతర్జాతీయ దృక్పథం ఏర్పడి అంతర్జాతీయ సంస్థలు అమలులోకి వస్తాయి. ఐక్యత మానవజాతికి అవహిస్తుంది.

భారతదేశం ప్రపంచానికి ఆధ్యాత్మికశక్తి నివ్వనారంభించింది. ఈ శక్తి క్రమంగా యూరపునూ అమెరికానూ ఆవరిస్తున్నది. ఈ ఉద్యమం క్రమంగా హెచ్చుతుంది. ఈనాటి భయంకర సంఘటనలమధ్య అధిక సంఖ్యాకులు భారత విజ్ఞానంకోసం చూస్తూ, యోగాభ్యాసాలు ప్రారంభిస్తున్నారు.


మిగిలినదంతా నా ఆశలతోకూడిన ఆదర్శమే. దీన్నినాతో పంచుకునేవారు భారతదేశంలోనూ పశ్చిమదేశాల్లోనూకూడా ఉన్నారు. ఇందులోఉన్న ప్రతిబంధకాలు శక్తివంతమైనవి. కాని భగవంతుడి అనుగ్రహం ఉంటే అన్నీ గడిచిపోతాయి. ఈ పరిణామం అంతస్సులోనుంచి సాగిరావాలి గనుక దీని విస్తృతి విశాలమైనప్పటికీ దీని ఆరంభం మనదేశంలోనే కావచ్చు.

భారతస్వాతంత్ర్యం ఆరంభమైన ఈరోజు నాకీసూచనలు చేస్తున్నది. ఇది ఎంతకాలం, ఎంతవరకు, ఎంతత్వరగా జరుగుతుందనేది ఈనూతన స్వతంత్ర భారతంమీదే ఆధారపడి ఉంది.






మదరాస్ పెన్సిల్ ఫ్యాక్టరీ :: మదరాస్




# సంచారి

## తెలుగు వారపత్రిక

ఆంధ్రదేశానికి సంబంధించిన సమగ్ర వార్తలను వారం వారం ప్రకటించి తద్వారా ఆంధ్రజాతిని ఐక్యపరిచే ఆశయంతో సంచారి త్వరలో వెలువడుతుంది. వేడివేడివార్తలను మాకు అందించి ఆంధ్రసోదరులు మా ఉద్యమానికి సహకారం ఇవ్వాలని ప్రార్థన.

●

ఆఫీసు :

37, ఆచారప్పన్ వీధి — మద్రాసు 1

# జాతీయావసరాలను తీర్చిన జాతీయపరిశ్రమ

## ది హిందుస్థాన్ మెటల్ రిఫైనరీ అండ్ రోలింగ్ మిల్స్

భారతీయుల పెట్టుబడి

భారతీయ కార్మికులు

టెలిగ్రాములు : రోలింగ్ మిల్సు

★

భారతీయుల యాజమాన్యం

ఆఫీసు : ఫోన్ 2999

★

వర్క్సు : ఫోన్ 3477

అనుభవజ్ఞులైన నిపుణులైన టెక్నీషియన్లచే నడపబడుతున్నది. ఇండియాలో ఒక ప్రధాన పరిశ్రమ ఎంతో కాలంగా లేనిలోటును ఇది తీరుస్తున్నది; ఇది అల్యూమినియం, ఇత్తడి, రాగి మున్నగు లోహపు తునకలనుంచి పరిశుభ్రమైన లోహాన్ని ఉత్పత్తిచేస్తుంది.

మా న్యు ఫా క్చ రిం గ్ సె క్ష న్

## ది మైసూరు ప్రిమియర్ మెటల్ ఫ్యాక్టరీ

ఏ పాత్రనైనా కొనే ముందు ఈ మార్కును గుర్తించండి.

అల్యూమినియం. ఇత్తడి. రాగి పాత్రలు స్టెయిన్‌లెస్ స్టీల్‌వేర్ ఉత్పత్తిచేయువారు

★

సన్ బ్రాండ్ ఇత్తడి సామగ్రి. స్టెయిన్‌లెస్ స్టీల్ సామగ్రి, శ్రేష్టతకు, నిర్మాణ కౌశలానికి పేరుగాంచినవి. ఎక్కడా అతుకులు, ఇరుకు సందులు ఉండవు. గనుక, సన్ బ్రాండ్ పాత్రలకు మట్టి అంటుకోదు, మరలుకపడదు, ఇత్తడి పాత్రలపై స్వచ్ఛమైన తగరం పూయబడినది.

ఆఫీసు : ఫోన్ 2535

★

టెలిగ్రాములు : "సన్ బ్రాండ్"

★

ఫ్యాక్టరీ : ఫోన్ 3829

### 'సన్ బ్రాండ్' శ్రేష్ఠతకు పరిశుభ్రతకు చిహ్నం

★ ★ ★

★

ఆఫీసులు : 124, మింట్ వీధి, మద్రాసు

కేశవ్ లాల్ కె. షా
మేనేజింగ్ పార్టనర్

★

వర్క్సు : తండియార్ పేట

రుచికి, ఆరోగ్యానికీ, ఉత్సాహానికి

యస్. యస్. కాఫీ & పౌడరును

ఉపయోగించండి.




యస్. యస్. ఖాదర్ మహమ్మద్ రావుత్తర్ అండ్ కో

40. మళయపెరుమాళ్ వీధి, :: జి. టి. మదరాసు

స్త్రీకి సంతానం సహజమైన కోరిక



లోధ్ర

దానిని సఫలత నొందిస్తుంది★

లోధ్ర అంతటా దొరుకును

కేసరికుటీరం లిమిటెడ్.

మదరాస్



# మీ ముద్దుల బిడ్డ

చంటి పిల్లల పెరుగుదలకు గాఢమైన భంగములేని నిద్ర అత్యావశ్యకము — ఎప్పుడు చంటి బిడ్డ నిద్రపోక, ఎడతెరిపిలేక ఏడ్చుచుండునో అప్పుడుయేదో దోషమున్నదని గ్రహించుడు.

చంటి బిడ్డకు జ్వరముతగిలినా, మలబద్ధకమైనా, కడుపునొప్పితో బాధపడినా తక్షణమే గ్రైప్‌కాల్ యివ్వండి. వెంటనే గుణముకనిపించి బిడ్డ స్వేచ్ఛగా నిద్రపోవును.

బిడ్డ ఉన్న ప్రతి యింట్లోను, గ్రైప్‌కాల్ సీసా ఒకటి ఎల్లప్పుడూ ఉంచుట అవసరము—ముఖ్యముగా పండ్లు వచ్చేటప్పుడు అత్యావశ్యకము.

Meclec

## గ్రైప్-కాల్



అన్నిరకాల బిడ్డ వ్యాధులకు

ది మెక్‌లెక్ న్యూట్రిమెంట్సు అండ్ ఫార్మస్యూటికల్సు లి.

99-ఎ ఆర్మీనియన్ స్ట్రీట్. జి. టి. మద్రాసు

ADARTS MNP.48 Telugu



# యువ

## యువకుల మాస పత్రిక

ఇందులో బి.యే.; ఇంటరు; స్కూలు ఫైనలు చదువు విద్యార్థుల రచనలు ప్రకటిస్తాము. ఈ విషయంలో తమ తమ రచనలు పంపి తోడ్పడమని ప్రతి విద్యార్థినీ కోరుతున్నాము.
ఇవికాక బి ఏ, ఇంటరు, స్కూలు ఫైనలు కోర్సుకు సంబంధించిన వ్యాసాలు ఉంటాయి.
అధ్యాపకుల సహకారం అర్థిస్తున్నాము.

సంవత్సరం చందా రు. 5-0-0
విడి ప్రతి 0-6-0

సంచిక సెప్టంబరులో వెలువడుతుంది

యువ కార్యాలయం
37, ఆచారప్పన్ వీధి,
జి. టి. మద్రాసు 1.



# ఆంధ్రజ్యోతి

సెప్టెంబరు సంచిక ఆంధ్రజ్యోతి ఇక వెలువడదు. మరుసటి సంచిక అక్టోబరు 1 వ తేదీన వెలువడుతుంది. ఈసంగతి చందాదారులు గమనించ ప్రార్థన.

మేనేజరు
ఆంధ్రజ్యోతి



# How to make a LITTLE food go a LONG way



ఆహారపదార్థాల కొరతవలన ఈనాడు రేషన్సు అతి తక్కువగా ఇవ్వబడుతున్నాయ్. అందువలన ప్రతి ఆదర్శగృహిణి స్వతంత్రభారతంలో ఎంతో తక్కువ ఆహారాన్ని చాలా ఎక్కువ ఉపయోగంలోకి తేవాలి.

ఇందుకుగాను ప్రతివంటకమూ సాధ్యమైనంత రుచికరంగా చేసుకోవాలి. స్వస్తిక్‌వారి గోవాలిన్ మార్కు వనస్పతితో పూరీలు, చపాతీలు, బజ్జీలు ఎంతో రుచికరంగా చేసుకోవచ్చు.

2 పౌన్లు, 5 పౌన్లు, 0 పౌన్లు డబ్బాలు ప్రతి షాపులోను దొరకును.

DOWALIN BRAND

# SWASTIK YANASPATI

**UNMATCHED FOR QUALITY**

**SWASTIK OIL MILLS LIMITED, BOMBAY.**

BOM-8 SHILPI

**BE INDIAN - - - - - - - - - - -BUY INDIAN!**

సేల్సు డిపో, 14 G, స్ట్రింగర్ వీధి, లోన్‌స్క్వేర్, మద్రాస్.



బి. ఎన్. కె. ప్రెస్, 37, ఆచారప్పన్ వీధిలో బి. నాగిరెడ్డిగారిచే ముద్రింపబడి అదేచోట బి. ఎన్. గుప్తగారిచే ప్రకటించబడింది. సంపాదకుడు: చక్రపాణి.

పిల్లల మాసపత్రిక



# చందమామ

సంచాలన: చక్రపాణి

## పెద్దలకు విజ్ఞప్తి

మీరు పిల్లలకు అనేకమైన తినుబండారాలూ, ఆట వస్తువులూ ఇస్తూ ఉంటారు. కాని **చందమామ** పిల్లలకు అత్యంత ప్రియతమమైనదని మీరు గ్రహించారా?

మీ పిల్లలు **చందమామ** చదువుతూ ఉండనట్టయితే రూ. **5/-** లు పంపి వెంటనే చందాదారులుకండి. నెలనెలా **చందమామ** మీ పిల్లల మానసిక జీవితాని కెలాటి వెలుగునిస్తుందో మీకే తెలుస్తుంది.

★

అనన్య ప్రచారంగల పిల్లల పత్రిక

చందమామ




**చందమామ ఆఫీసు**

**37. ఆచారప్పన్ వీధి :: మద్రాసు, 1.**




PRINTED AT THE B. N. K. PRESS, MADRAS - 1